# కోరికల వల్ల నష్టాలు

రచన : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



# కోరికల వల్ల నష్టాలు



రచన & ప్రచురణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు

మొదటి ముద్రణ : సెప్టెంబరు, 2025
ప్రతులు : 2,000

వెల : రూ.100/-

పుస్తకముల కొరకు :-
**తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94901 71853, 9440309812

# విషయ సూచిక :


1. కోరికల వల్ల నష్టాలు ........................................................ 3

2. మాంసాహారం తినాలనే కోరిక వల్ల నష్టాలు ........................ 14

3. రకరకాల కోరికలు ........................................................ 17

4. కోరికలకు పరిమితి లేదు? ................................................ 19

5. దైవం కోరికలు తీరుస్తాడా? ............................................... 22

6. అవసరాలకు పరిమితం అవ్వాలి ........................................ 35


7. దేవుడు కోరికలు తీరుస్తాడా? ............................................ 56

8. ఏ జన్మలోనూ కోరికలు తీరవు ............................................ 66

8. కోరికలు, సంకల్పాలు శక్తిని హరిస్తాయి ................................ 80

9. భగవద్గీతలో కోరికల వల్ల కలిగే నష్టం .................................. 91

10. మరణించినపుడు కలిగే నష్టాలు ........................................ 94

## ధ్యానం చేసే పద్ధతి
## శ్వాస మీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతోన్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమక్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీమండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండలశుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.

# కోరికల వల్ల నష్టాలు

కోరికలు లేకుండా ఎవరూ ఉండరు. చాలా మందికి అనిపించవచ్చు కోరికల వల్ల నష్టాలు ఏమిటి? కోరికలు లేకుండా ఎలా ఉండగలరు? అసలు కోరికలు లేకపోతే జీవించడం ఎందుకు? అసలు జీవించేదే కోరికలు తీర్చుకోవడం కోసం కదా? అని అనేవాళ్ళు కూడా ఉన్నారు. అందుచేత అలా కోరికలతో జీవిస్తున్న మానవులకు ఈ కోరికలు ఎన్ని రకాల నష్టాన్ని, కష్టాల్ని కలగజేస్తాయో తెలుసుకుందాం.

ఎందుచేతనంటే ఇది కనుక తెలుసుకుంటే ప్రతి ఒక్కరు కోరికలు తీర్చుకోవడానికి ప్రయత్నించరు, కోరికల్ని అదుపు చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. అలా ఎవరైతే కోరికల్ని అదుపు చేసుకోగలుగుతారో వారు జీవితంలో అవసరాలకు పరిమితమవుతారు. అలా అవసరాలకు పరిమితమై జీవితంలో సుఖ సంతోషాలతో జీవించగలుగుతారు. ఆ జీవితం చాలా సాఫీగా సాగిపోతూ ఉంటుంది.

ప్రపంచంలో గమనిస్తే అంతా కోరికలు కోరేవారే కనిపిస్తారు. మానవులకి రకరకాల కోరికలు ఉంటాయి. ఇప్పుడు ప్రపంచంలో 700 కోట్ల పైగా జనాభా వుంది. ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క రకమైన కోరికలు వుంటాయి. ఒకళ్ళ కోరికలకి ఇంకొకళ్ళ కోరికలకి సంబంధం వుండదు. సహజంగా ఎవరికైనా ముఖ్యంగా సుఖపడాలనే కోరిక వుంటుంది, అంతేకాదు సంతోషంగా జీవించాలనే కోరిక కూడా వుంటుంది ఆనందం పొందాలనే కోరిక కూడా వుంటుంది. మరి వీటి గురించి కొంచెం వివరించుకుందాం.

## సుఖాలు అనుభవించాలి అనే కోరిక

వీటినే భోగాలు అంటారు. మానవులకు ఐదు ఇంద్రియాలు ఇవ్వబడ్డాయి. ఈ ఐదు ఇంద్రియాలతో మనస్సుకు కలిగించే తృప్తినే "సుఖము"

అంటారు. అలా ప్రతి ఒక్కరు వారికి ఉన్న ఈ ఐదు ఇంద్రియాలతో మనస్సుకు తృప్తి కలిగించడానికి ప్రయత్నిస్తారు.

కళ్ళు చూస్తున్నాయి అంటే ఆ సుఖం కళ్ళ ద్వారా మనస్సు అనుభవిస్తుంది. చెవులు వింటున్నాయి అంటే ఆ సుఖం కూడా మనస్సే అనుభవిస్తుంది. అలా ముక్కు వాసన చూస్తుందంటే ముక్కు ద్వారా మనస్సు తృప్తి పొందుతూ ఉంటుంది.

మనం రోజూ కళ్ళతో సినిమాలు, నాటకాలు, స్టేజ్ ప్రోగ్రాములు, సెల్ ఫోన్లో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నటువంటి వింతలు, విశేషాలు ఎన్నో చూస్తున్నాం. మరి ఆ సుఖం కోసం ఒక చిన్న సెల్‌ఫోన్‌కి లక్షలు కూడా ఖర్చు పెడుతున్నారు.

అలాగే ఎన్నో రకాలు తింటూ ఎన్నో రుచులు అనుభవిస్తున్నారు. చాలామంది సంపాదించుకునేది దేనికి తినకపోతే ఎలా? అని రకరకాల రుచులు ఆస్వాదిస్తూ, అనుభవిస్తూ, సుఖపడుతున్నాము అని భావిస్తారు.

అలా సంగీతం వింటూ, రకరకాల సుగంధ ద్రవ్యాలు వాసన చూస్తూ, ఏసీల్లో ఉంటూ శరీరాన్ని సుఖ పెడుతున్నారు, సంసారంలో ఎన్నో సుఖాలు పొందుతున్నారు. ఇటువంటి సుఖాలు పొందాలనే కోరిక ప్రతి ఒక్కరికీ ఉంటుంది.

## సంతోషం పొందాలి అనే కోరిక

సంతోషము అంటే అది శరీరానిది కాదు, మనస్సుది, శరీరానికి సంబంధం లేకుండా మనస్సుకు కలిగే తృప్తినే సంతోషం అంటారు. మనస్సు కోరుకున్నది  జరిగితే నాకు చాలా సంతోషంగా ఉంది అంటారు.

ఎవరైనా ఒక లక్ష రూపాయలు సంపాదించాలనుకుని, కష్టపడి మొత్తం మీద లక్షా సంపాదించినా, అనుకున్న ఉద్యోగం సంపాదించినా, పెళ్లి చేసుకోవాలనుకున్నప్పుడు మంచి సంబంధం కుదిరినా చాలా సంతోషపడతారు.

అలాగే ఒక కారో, బైకో కొనుక్కోవాలనుకుని కొన్నా, పండగ రోజుల్లో కొత్త బట్టలు ధరించినా అది అందరికీ చూపిస్తూ ఎంతో సంతోషపడతారు. నాకు చాలా సంతోషంగా ఉంది అంటారు. అలా సంతోషంగా జీవించాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు.

## ఆనందం అనుభవించాలి అనే కోరిక

చాలామంది సంతోషాన్నే ఆనందం అనుకుంటారు, కానీ ఆనందం అన్నది సామాన్య మానవులకి లభించదు. ధ్యానం చేసేటటువంటి యోగులకే లభిస్తుంది. వారు సుఖం, సంతోషం కోరుకోరు కానీ ఆనందంగా జీవించాలి, ఆనందం పొందాలి అని కోరుకుంటారు, దానికి కావలసిన సాధనలు చేస్తారు. ఆ సాధనలు చేస్తూ ఉంటే వాళ్ళు పొందేటటువంటి ఆనందానుభూతి వర్ణించలేనిది.

అందుకే గొప్ప సాధకులు అలా సాధన చేస్తూ రోజుల తరబడి, వారాల తరబడి, నెలలు తరబడి లేవకుండా అలా కూర్చుని ఉండిపోతారు. ఎందుకంటే అద్భుతమైనటువంటి ఈ ఆనందానుభూతి ముందు సుఖాలు, సంతోషాలు అన్నీ దిగదుడుపే.

అలా నెలలు తరబడి ఉండిపోయే గొప్ప యోగులని “సమాధి స్థితికి” వెళ్ళిపోయారు అంటారు. సమాధి స్థితిలో పొందేటటువంటి ఆనందానుభూతి వర్ణించలేనిది.

ఇప్పుడు పత్రిగారి మార్గంలోకి వచ్చినటువంటి ధ్యానులు కూడా కొంచెం బాగా పట్టుదలగా, దీక్షగా రోజు ధ్యానం చేస్తూ ఉంటే కొన్నాళ్ళకి వాళ్ళకి తెలియకుండానే రెండేసి గంటలు, మూడేసి గంటలు అలా కూర్చుని వుండిపోతారు. ఇన్ని గంటలు కూర్చున్నాను అన్న విషయమే వారికి తెలీదు. కూర్చుని లేచేసరికి మూడు గంటలు అయిపోతుంది. అదేంటి అప్పుడే మూడు గంటలు అయిపోయిందా అని అనిపిస్తుంది.

ప్రారంభంలో కూర్చున్న వాళ్ళకి ధ్యానం నరకమే కానీ, నిత్య సాధన చేసేవాళ్ళకి ఇటువంటి అనుభూతి కలుగుతూ ఉంటుంది. అలా ఒకటి, రెండు సార్లు కలిగే సరికి ఆ ఆనందాన్ని అనుభవించి, ఆ రుచిని ఆస్వాదించి ఇంక ధ్యానాన్ని వదలలేరు.

ఎన్ని పనులు ఉన్నా, సంసారంలో ఎన్ని సమస్యలు ఉన్నా ధ్యానం చేయకపోతే వాళ్ళకి అదో రకంగా ఉంటుంది. అలాంటి ఆనందం ధ్యానం చేయకపోతే వాళ్ళకి ఉండదు. ధ్యానం చేయకపోతే వాళ్లకు ఉండేది అశాంతి. జీవితం అన్నాక సమస్యలు వుంటాయి, సంసారం అన్నాక ఇబ్బందులు, గొడవలు ఉంటాయి, మాట మాటా తేడా వస్తుంది, అన్నీ సాఫీగా ఉండవు. భార్య అనుకున్నట్టు భర్త ఉండడు, భర్త అనుకున్నట్టుగా భార్య ఉండదు. వీళ్ళిద్దరూ అనుకున్నట్టుగా పిల్లలు ఉండరు. అందుచేత ఎన్ని సుఖాలు వున్నా కాసేపటికి ఈ సమస్యల వల్ల బాధ కలుగుతూ ఉంటుంది.

మానవులు తమ కోరికలు తీర్చుకోవడానికి కష్టపడుతూ ఉంటారు. ఎంత కష్టపడినా కొన్ని కోరికలు తీర్చుకోగలరు కానీ చాలా కోరికలు తీర్చుకోలేకపోతారు. అలా అనుకున్న కోరికలు తీర్చుకోలేకపోతే, ప్రయత్నం చేసినా వారి వల్ల అవ్వలేదు కాబట్టి, దైవాన్ని ఆశ్రయిస్తే, ఆయన్ని కోరుకుంటే ఆయన శక్తితో వారి కోరికలు తీరుస్తాడు అనేటటువంటి భావం చాలా మందిలో ఉంటుంది.

అందుచేత ఇంచుమించు ప్రపంచంలో అందరూ కూడా దైవాన్ని ఆశ్రయిస్తారు. కానీ ఎవరి నమ్మకాన్ని అనుసరించి వారు ఆ దైవాన్ని ఆశ్రయిస్తారు. ఒక్కొక్కరికి ఒక్కొక్క దైవం అంటే ఇష్టం. అలా హిందువులు పూజలు చేస్తారు, క్రిస్టియన్లు ప్రార్థన చేస్తారు, ముస్లింలు నమాజు చేస్తారు. అలా పూజలు, ప్రార్థనలు, నమాజులు చేసి తమ కోరికలు కోరుకుంటారు.

అలా దైవాన్ని ఆశ్రయించడం "భక్తి" అని, వారు భక్తులమని

భావిస్తారు. అంతేకాదు చాలామంది నాకు దేవుడు అంటే చాలా ఇష్టం అంటారు. కారణం కోరికలు తీరుస్తాడనే ఆ దైవం అంటే ఇష్టం తప్ప అది నిజంగా దేవుడి మీద ఇష్టం కాదు.

ఎందుచేతనంటే వీరు కోరిన కోరికలు ఆ దైవం తీర్చకపోతే కొన్నాళ్లకు ఆ దైవం మీదే వీళ్ళకి నమ్మకం పోయి, ఆయన మీద కోపం వస్తుంది. అప్పటిదాకా ఇష్టపడిన దైవాన్ని కూడా వదిలేస్తారు. ఆయన్ని మార్చేసి కొత్త దేవుడిని పట్టుకుంటారు. అలా మతాలు మార్చే వాళ్ళని ప్రపంచంలో మనం ఎంతో మందిని చూస్తున్నాం. మరి నమ్ముకున్నటువంటి దైవం కోరికలు తీర్చలేదనే ఇవన్నీ చేస్తున్నారు.

ముఖ్యంగా మానవులలో మూడు రకాలు ఉన్నారు.

1) తమో గుణంతో ఉన్నవాళ్ళు

2) రజో గుణంతో ఉన్నవాళ్ళు

3) సాత్విక గుణంతో ఉన్నవాళ్ళు

అందుచేత వారికి కలిగే కోరికలని కూడా మనం మూడు రకాలుగా విభజించవచ్చు.

1) తమో గుణ కోరికలు

2) రజో గుణ కోరికలు

3) సాత్విక గుణ కోరికలు

**1) తమో గుణ కోరికలు:-**

వీరికి ముఖ్యంగా ఖానా, పీనా, సోనాకు సంబంధించిన కోరికలే ఉంటాయి. అంటే హాయిగా నచ్చింది తిని, త్రాగి, పడుకోవడం. మరి ఇటువంటి కోరికలు తీరాలంటే ధనం కావాలి. అందుచేత ధన సంపాదన మీద ఎక్కువ దృష్టి పెడతారు. ధనం సంపాదించాలనే కోరిక బాగా ఉంటుంది. ఈ మూడు రకాల్లో ఏ రకమైన కోరికలు ఉన్న వాళ్ళకైనా సరే వారి కోరికలు తీరాలి

అంటే ముఖ్యంగా ధనం కావాలి. అందుచేత ధనం సంపాదించాలనే కోరిక ప్రబలంగా ఉంటుంది.

అంతేకాదు వీరికి శరీరాన్ని బాగా ఆరోగ్యంగా ఉంచుకోవాలనే కోరిక ఉంటుంది. కుటుంబంతోనే గడపాలి, సుఖ సంతోషాలతో జీవించాలి అనేటటువంటి కోరికలు ఉంటాయి.

**2. రజోగుణ కోరికలు:**

వీళ్ళకి కొంచెం గర్వం, అహంకారం ఉంటుంది. వీళ్ళు గొప్ప హోదా కావాలని, అందరికంటే గొప్పవారు అవ్వాలని, పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని కోరుకుంటారు. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క రంగాన్ని ఎంచుకుంటారు. ఎవరు ఏ రంగాన్ని ఎంచుకున్నా ఆ రంగంలో గొప్పగా జీవించాలి అనేటటువంటి కోరిక ఉంటుంది. అందరూ తన మాటే వినాలని, తన చెప్పు చేతల్లోనే ఉండాలని కోరుకుంటూ ఉంటారు. అలా చూస్తే అసలు కోరికలు లేని వారే కనిపించరు.

మనం పురాణాల నుంచి ఉదాహరణగా తీసుకుంటే రావణాసురుడిది రజోగుణం. ఆయనకి సీతను అనుభవించాలనే కోరిక కలిగింది. ఆవిడని ఎత్తుకొచ్చి లంకలో బంధించాడు. కానీ ఈ కోరిక వల్ల ఆయన ఎంత నష్టపోయాడో మనకి తెలుసు. తాను నాశనం అవ్వడమే కాదు తన వారినందరి నాశనానికి కారణం అయ్యాడు. అక్కడికీ విభీషణుడు రామునితో గొడవ ఎందుకు? సీతను అప్పచెప్పు అంటే కుదరదన్నాడు. ఆ కోరికే లేకపోతే నష్టమే లేదు కదా?

కోరుకోవచ్చు, తీర్చుకోగలిగే కోరికలు కోరుకోవడంలో తప్పులేదు, ఇబ్బంది లేదు. కానీ తీర్చుకోలేనివి కోరుకుంటే ఎంతో నష్టపోతారు. రజోగుణంలో పట్టుదల ఎక్కువ ఉంటుంది.

ఇప్పుడు రాజకీయాల్లో చూస్తే, నేను చాలా గొప్ప స్థితికి రావాలి, ఆ

పదవి సంపాదించాలి అనేటటువంటి కోరికతో చేయకూడని పనులు చేస్తూ, మోసాలు చేస్తూ, ఎంతో మందిని బాధిస్తూ ఉంటారు. మరి అలాంటి వారు ఒక్కొక్కసారి పరాజయం పాలై ఎన్ని కష్టాలు పడ్డారో, ఎంత నష్టపోయారో మనం చూస్తున్నాం.

ఒక ఎలక్షన్లో నెగ్గి కోరిక తీర్చుకున్నా మళ్లీ ఇంకో ఎలక్షన్లో ఓడిపోయి ఎంతో బాధపడి, నష్టపోతున్నారు. అప్పుడు జీవితం చాలా దుర్భరం అయిపోతుంది. మరి ఈ నష్టం ఎందుకు జరిగింది? కోరిక వల్లేగా! ఆ కోరికే లేకపోతే ఈ నష్టం ఎందుకు ఉంటుంది? అందుచేత ఒక రకంగా చూస్తే కోరిక నష్టమే.

అలాగే మహాభారతంలో దుర్యోధనుడు మయ సభలో అవమానం పాలయ్యాడు, ద్రౌపది చూసి నవ్వింది. ఆ అవమాన భారం భరించలేక పోయాడు.

తనను అలా అవమానించినందుకు ఆవిడని అవమానించాలి అనేటటువంటి బలమైన కోరిక ఆయనలో బయలుదేరింది. ఆ కోరికతో మాయాజూదంలో పాండవుల్ని ఓడించి ద్రౌపదిని వస్త్రాపహరణం చేసి తన కోపాన్ని, తన కోరికను తీర్చుకోవాలనుకున్నాడు. ఆవిడని అవమానపరిచాడు, కానీ దాని ఫలితంగా భారత యుద్ధం జరిగింది.

దాని వల్ల దుర్యోధనుడే కాదు మొత్తం కురువంశం అంతా సర్వ నాశనం అయిపోయింది. దీనికి కారణం ద్రౌపదిని అవమానించాలనే దుర్యోదనుడి కోరికే. ఆ కోరికే లేకపోతే, ఆవిడని అవమానించకపోతే వారంతా నాశనం అవ్వకుండా హాయిగా జీవించేవారు. ఇలా మనం పురాణాలు తిరగేసినా, చరిత్ర తిరగేసినా ఇటువంటి కోరికలు ఎంత నష్టాన్ని కలిగిస్తాయో మనం తెలుసుకోవచ్చు.

అలాగే ఇప్పుడు ప్రజాస్వామ్యాలు  వచ్చాయి కానీ అంతకుముందు

ఆ పురాణ కాలాల్లో రాచరికాలు ఉండేవి. ఆ రాజ్యాల రాజులు బాగా సంపాదించి, బల సంపన్నులై, ప్రక్కన ఉన్న రాజ్యాన్ని జయించాలనే కోరికతో అలా ఆ దేశాన్ని జయిస్తూ తన రాజ్యాన్ని విస్తరించుకునేవారు. ఇలాంటి యుద్ధాల్లో ఒక్కోసారి విజయం సాధించేవారు. ఒక్కోసారి పరాజయం పాలై ఎంతో నష్టపోయేవారు.

అలా చూస్తే చరిత్రలో ఆ రాజ్యాన్ని జయించాలనే కోరికతో ఎంతమంది చావుకు కారకులు అయ్యేవారు. తమ వైపు, శత్రువుల వైపు కూడా ఎంతోమంది చనిపోయేవారు. ఆర్థికంగా నష్టం జరిగేది.

అలాగే ఏదైనా కోరికలు తీరాలి అంటే ధనం కావాలి. ధనం లేకుండా ఏ కోరిక తీరాలన్నా అసంభవం, అసాధ్యం. ఒక ఎలక్షన్లో గెలవాలి అంటే ఎంతో పెట్టుబడి పెట్టాలి. అందుచేత చాలామంది ఆ కోరిక తీర్చుకోవడం కోసం ముందు ధన సంపాదన కోసం చేయకూడని అడ్డమైన పనులన్నీ చేస్తారు, అధర్మంగా వ్యవహరిస్తారు, సృష్టి విరుద్ధంగా ప్రవర్తిస్తారు. ఆ తప్పులు, పాపాలు చేయడం వల్ల సృష్టి నియమాల ప్రకారం, సృష్టిలో ఉన్నటువంటి సిద్ధాంతం ప్రకారం భవిష్యత్తులో వారు ఎన్నో కష్టాల పాలవుతారు, ఎంతో నష్టపోతారు.

ఈ డబ్బు సంపాదించడానికి అవినీతి పనులు చేస్తే తర్వాత వచ్చినటువంటి ప్రభుత్వాలు వారి మీద అవినీతి ఆరోపణలు చేసి అరెస్టు చేయడం, వాళ్ళని జైల్లో వేయడం మనం చూస్తూనే ఉన్నాం. కొంతమంది ఇన్కమ్‌టాక్స్ వాళ్ళకి దొరికి డబ్బు అంతా కోల్పోవడం కూడా చూస్తున్నాం. మరి ఈ కష్టము, నష్టము ఎందుకు వచ్చింది? ధనం సంపాదించాలనే కోరిక వల్ల.

**3. సాత్విక గుణ కోరికలు:**

వీళ్ళకి ఎంతసేపు ఇతరులకి, లోకానికి సేవలు చేయాలి, అందరికీ మేలు చేయాలి, మంచి పనులు చేయాలి అనేటటువంటి కోరికలే ఉంటాయి.

అన్నదానాలు చేయాలని, వస్త్రదానాలు చేయాలని, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, ఇలా చేస్తూ పుణ్యం సంపాదించాలనే కోరిక వీళ్ళకు ఉంటుంది. ఇలా సాత్విక గుణంలో ఉన్నవారు సేవలు చేస్తూ, పుణ్యాన్ని సంపాదించుకోవాలి అనేటటువంటి కోరిక ఉంటుంది. ఈ పుణ్య కార్యాలు చేస్తూ వాళ్ళు భోగాలు పొందాలని కోరుకుంటూ ఉంటారు.

ఇక్కడ ఇలా పుణ్యం చేసి భోగాలు వస్తే నష్టం ఏమిటి? అని మీకు అనిపించొచ్చు. కానీ ఇటువంటి కోరిక కూడా నష్టమే అన్నది మనకి జ్ఞానం పెరిగేకొద్దీ అర్థమవుతుంది. ఎందుచేతనంటే ఎవరైతే ఈ పుణ్య కార్యాలు చేస్తారో వీళ్ళు భోగాలు సంపాదించగలరు కానీ ముక్తిని సంపాదించలేరు. ముక్తి అంటే జన్మ లేని స్థితి పొందడం, మళ్ళీ భూమి మీదకి రాకుండా ఉండడం.

ఎవ్వరైనా సరే ఈ సృష్టిలో ఒక కర్మ చేస్తే అది పుణ్య కర్మ అవనివ్వండి, పాప కర్మ అవనివ్వండి ఆ కర్మ అనుభవించడానికి మళ్ళీ భూమి మీదకి రావాలి. ఎన్ని పుణ్యాలు చేసి మళ్ళీ భూమి మీదకి వచ్చినా ఆ పుణ్యాలు అనుభవిస్తూ ఈ ప్రపంచంలో ఉన్న పరిస్థితి వల్ల కొన్ని దుఃఖాలు కూడా అనుభవించాలి. అందుచేత వాళ్ళు ముక్తి పొందలేరు. అదే పుణ్యాల వల్ల వాళ్ళకు వచ్చే నష్టం.

అందుకే భగవద్గీతలో శ్రీకృష్ణుల వారు ఏం చెప్పారంటే? "శుభాశుభ పరిత్యాగి" అన్నారు. శుభాన్ని అంటే పుణ్యాన్ని, అశుభం అంటే పాపాన్ని రెండింటినీ వదిలేయమన్నారు. అందుకే అన్నమాచార్యుల వారు "తెగదు పాపము, తీరదు పుణ్యము" అన్నారు. దానికి తెంపు ఎక్కడ ఉంటుంది? అలా జన్మలు తీసుకుంటూనే ఉండాలి. పాపాలు చేస్తున్నా, పుణ్యాలు చేస్తున్నా మళ్ళీ భూమి మీదకు వస్తూనే ఉండాలి. ఇంక రాకూడదు అంటే పాపాలు, పుణ్యాలు చేయకూడదు.

అందుచేత ఈ సేవలు చేయాలనుకునే వాళ్ళు మళ్ళీ జన్మ తీసుకోవాలి. అందుకే అంటారు **"పాపాలు చేసేవారికి ఇనుప గొలుసు పడుతుంది, పుణ్యం**

**చేసేవారికి బంగారం గొలుసు పడుతుంది"** అని అంటారు. అంటే ఇనుప గొలుసుతో బంధింపబడేవాళ్ళు డబ్బు లేకుండా ఈ బంధంలో చిక్కుకుంటే, పుణ్యం చేసేవాళ్ళు డబ్బుతో ఈ బంధంలో చిక్కుకుంటారు. వాళ్ళూ బంధీయే, వీళ్ళూ బంధీయే. అంతే కానీ బంధ విముక్తులు కాలేరు, ముక్తి పొందలేరు.

అందుకే పత్రి గారు **"పాపం చేస్తే నరకానికి వెళ్తావు, పుణ్యం చేస్తే స్వర్గానికి వెళ్తావు, కానీ ధ్యానం చేస్తే మోక్షానికి వెళ్తావు"** అన్నారు. అందుచేత పుణ్యం చేసినా స్వర్గానికి వెళ్తావు కానీ మళ్లీ భూమిమీదకి వస్తావు.


శ్రీ కృష్ణుల వారు చెప్పారు కదా "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" అని. అంటే నువ్వు సంపాదించుకున్న పుణ్యం క్షీణించిపోగానే అంటే ఆ పుణ్యాన్ని అనుభవించాక అది అయిపోగానే మానవ లోకంలో మళ్లీ జన్మ తీసుకోవాల్సిందే అన్నారు. అందుచేతే పత్రిగారు ఈ రెండు రకాల కర్మలు వద్దు ధ్యానం చేయమంటారు, ముక్తి కర్మలు చేయమంటారు. ముక్తి కర్మలు అంటే ఆత్మ కర్మలు, ఆత్మకు సంబంధించిన కర్మలు అంటే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం, స్వాధ్యాయం, సాంగత్యం, సేవ ఇవి చెయ్యాలి.

సహజంగా ప్రారంభ జన్మల్లో అంటే 100 నుంచి 150 జన్మలు తమోగుణంలో ఉంటారు. తర్వాత ఇంకో 100 నుంచి 150 జన్మలు రజోగుణంలో ఉంటారు. తర్వాత 100 జన్మలు సాత్విక గుణంలో ఉంటారు. ఈ జన్మలు పెరిగే కొద్దీ వారిలో, వారి కోరికల్లో మార్పు వస్తూ ఉంటుంది. కానీ ఏ రకమైనటువంటి స్థితిలో ఉన్నా ఆ కోరికలు వాళ్ళకి నష్టాన్నే కలిగిస్తాయి కానీ ఏమీ లాభం కలిగించవు.

మీరు అడగొచ్చు మరి కోరికలు లేకపోతే ఎలాగండి అని? కానీ గుర్తుపెట్టుకోండి కోరికలు తప్పు కాదు, కానీ అవి అవసరాలకు పరిమితం అవ్వాలి. అవసరానికి మించి ఉంటే అవి అనర్థాన్నే కలిగిస్తాయి. నష్టాన్ని కలిగిస్తాయి. అందుకే కోరికలని అదుపు చేసుకునే ప్రయత్నం చేయాలి. మరి

ఇది ఎలా సాధ్యం? అని మీరు అడగొచ్చు. కోరికలని అదుపు చేయాలి అంటే కోరికలకు మూలం “మనస్సు” కాబట్టి మనస్సును మీరు అదుపు చేస్తే కోరికలు మీ అదుపులో ఉంటాయి. అంటే మనస్సు చెప్పినట్టు మీరు వినడం కాదు, మీరు చెప్పినట్టు మనస్సు వినాలి.

అది ఎలా సాధ్యం అంటే? ఆ మార్గమే పత్రి గారు మనకు అందించినటువంటి “శ్వాస మీద ధ్యాస” ధ్యానం. “శ్వాస మీద ధ్యాస” ద్వారా మెల్లి మెల్లిగా మీ మనస్సు మీ అదుపులోకి వస్తుంది. ఎప్పుడైతే మనస్సు అదుపులోకి వచ్చిందో మనసుకు సంబంధించిన విషయాలు, గుణాలు అన్నీ కూడా మీ అదుపులో ఉంటాయి.



# మాంసాహారం తినాలనే కోరిక వల్ల నష్టాలు

ఎవరైతే తాము ఆత్మ అని తెలుసుకోరో, సవ్యంగా జీవించరో వాళ్లకి పైలోకానికి వెళ్ళాక ఒక జీవితమే నష్టపోయాను అన్నది అర్థమవుతుంది. తాను సంపాదించినవి, ఖర్చు పెట్టినవి అన్నీ వృధా అయ్యాయి అన్నది అర్థమవుతుంది. ఈ కోరికల వల్ల ఎంత నష్టపోయారో అక్కడ తెలుసుకుంటారు. అందుచేత పత్రిగారు మీకున్న జీవితంలో, మీకున్న సమయంలో సగం శరీరం గురించి వినియోగించండి. సగం ఆత్మ అయిన మీకోసం వినియోగించండి అని అంటారు.

అందుచేత కోరికలు తీర్చుకోవడం కాదు కోరికల్ని అదుపు చేసుకుంటూ ఉన్నంతలో అనుభవిస్తూ, లేదని బాధపడకుండా, ఆశపడకుండా జీవించినట్లయితే ఆత్మ కోసం చేయవలసినవి చేస్తారు. అప్పుడు జీవితంలో నష్టం లేకుండా జీవిస్తారు.

అలాగే ఇంకా చూస్తే ఈ ప్రపంచంలో చాలామందికి **"మాంసం తినాలనేటటువంటి కోరిక ఉంటుంది".** దాని వల్ల ఎంత నష్టపోతున్నారు అన్నది వాళ్లకి తెలియదు. ఈ కోరిక వల్ల ఎన్నో రకాల జంతువులను హింసించి, చంపి వాటిని భక్షిస్తారు. అలా మేకల్ని, గొర్రెల్ని, ఆవుల్ని, గేదెల్ని, ఎద్దుల్ని , కోళ్ళని, బాతుల్ని చంపుతారు. అలాగే జలచరాల్ని అంటే రొయ్యల్ని, చేపల్ని ఇంకా చైనాలో చూస్తే క్రిమి కీటకాల్ని, పాముల్ని కూడా తింటూ ఉంటారు. అన్నిటిని చంపేస్తారు. ఇదంతా దేనికి అంటే? వాటి మాంసం తినాలనేటటు వంటి కోరిక.

సరే కోరిక తీర్చుకున్నారు బానే ఉంది. కానీ ఇలా ఆ జీవులని చంపడం వల్ల, వాటిని హింసించడం వల్ల తిరిగి ఆ ఫలితం కష్టాల రూపంలో, రోగాల రూపంలో అనుభవించి ఎంతో నరకాన్ని, ఎంతో నష్టాన్ని పొందుతారు,

రోదిస్తారు, నా జీవితం ఇలా అయిపోయింది అని బాధపడతారు.

జీవితంలో మీరు అనుకున్నట్టు జీవించొచ్చు అది మీ ఇష్టమే కానీ, ఇతరుల్ని బాధించి మీరు ఆనందించకూడదు. ఇతరులని శోకింపచేసి మీరు ఆనందించకూడదు. ఇతరులని ఆనందింపచేసి మీరు ఆనందించాలి. అదే సృష్టి లో ఉన్నటువంటి ధర్మం. అలా జీవించినట్లయితే ఏ ఇబ్బందీ ఉండదు.

అలా జీవితమంతా తినడం వల్ల మరలా జన్మ తీసుకుని ఆ కర్మల ఫలితంగా నరకాన్ని అనుభవిస్తారు. అలా కష్టాలు పడుతున్నవారిని మనం ఎంతోమందిని చూస్తున్నాం. ఇవాళ మనం కనుక గమనించినట్లయితే ప్రపంచంలో అన్నిటికంటే హాస్పిటల్స్ కి, మందుల షాపులకి ఫుల్ డిమాండ్ ఉంది. ఎన్ని షాపులు ఉన్నా చాలట్లేదు... అన్నీ కిటకిటలాడుతున్నాయి .

ఎందుకు ఇన్ని రోగాలు అంటే వారు చేసిన కర్మల ఫలితమే. ఏమీ చేయకుండా ఏమీ రాదు, ఏది చేస్తే అదే వస్తుంది. అందుచేత బాగా తెలుసు కోండి ఈ మాంసం తినాలనే కోరిక వల్ల దాన్ని వదలలేరు. కొంతమందికి తెలుసు అయినా మానలేరు అలవాటయిపోయింది అంటారు. చూడండి ఉదయాన్నే కాఫీ తాగడం అలవాటైన వారు ఆ కాఫీ తాగకపోతే ఉండలేరు. మాంసం తినడం అలవాటైన వారు మాంసం తినకపోతే ఉండలేరు.

కొంతమంది అంటారు సరే నేను చచ్చిపోతే చచ్చిపోతాను ఏదైతే అది అవుతుంది. నేను మాత్రం మాంసం మానలేను అంటారు. దానికి అంత ఎడిక్ట్ అయిపోతారు. ఇవ్వాళ ఒక వైద్యం చేయించుకోవాలంటే ఎన్ని లక్షలు అవుతున్నాయో ఒక్కసారి ఆలోచించండి. ప్రతిదానికి ప్యాకేజీలు పెట్టి ట్రీట్మెంట్ చేస్తున్నారు. కొంతమంది ఆస్తులు కూడా అమ్ముతున్నారు. కొంతమంది అప్పుల పాలవుతున్నారు. మరి ఇదంతా కోరిక వల్ల వచ్చే నష్టమేగా? వాడు జీవితమంతా కష్టపడి కూడబెట్టింది రోగాలకి ఖర్చు చేస్తున్నారు.

చాలామంది ఉద్యోగం, వ్యాపారం చేసేటప్పుడు కొంత డబ్బు వెనకేసుకోవాలి అనుకుంటారు. దేనికోసం అంటే? ఏమో ఎప్పుడు ఏ రోగం వస్తుందో! ఎంత డబ్బు అవసరం అవుతుందో! అనే ఉద్దేశ్యంతో చేస్తారు. నిజంగా వాళ్ళు అనుకున్నట్టుగానే ఏ రోగమో వచ్చి ఆ డబ్బంతా ఖర్చైపోవడమో, అది చాలకపోవడమో మనం చాలా మంది జీవితాల్లో చూస్తున్నాం. కొంతమందిని చూస్తే గనుక కుటుంబం కోసం ఖర్చు పెట్టవలసిన డబ్బు రోగాల కోసం ఖర్చు పెడతారు. మందులు లేకుండా జీవించే వాళ్ళు ఎవరూ కనపడరు .

అలాగే కొంతమందికి మందు అంటే సారా, బ్రాంది, విస్కీ ఇలాంటివన్నీ తాగాలనే కోరిక ఉంటుంది. మత్తు పదార్థాలు సేవించాలనే కోరిక ఉంటుంది. వీటి వల్ల ఎంత నష్టపోతున్నారో ఒక్కసారి ఆలోచించండి. వాళ్ళు మందు త్రాగారు అంటే శారీరక స్పృహ కోల్పోతారు, ఏం మాట్లాడు తున్నారో తెలియదు, ఏం చేస్తున్నారో తెలియదు. అలా మందు త్రాగి ఇంటికి వచ్చి భార్యను కొట్టేవాళ్ళు, అక్కర్లేని గొడవలు పడి ఇంట్లో నరకాన్ని సృష్టిస్తారు.

ఎంత వ్యసనం అయిపోతుందంటే ఇంక అది త్రాగకపోతే ఉండలేని పరిస్థితి వస్తుంది. డబ్బంతా దానికే వెచ్చిస్తారు. కొంతమంది సంపాదించడం మానేసి ఆ బలహీనత వల్ల భార్యల్ని డబ్బు ఇమ్మని వేధిస్తారు. ఆవిడ కష్టపడి సంపాదించిన డబ్బు వీడు తాగుడికి పట్టుకుపోతాడు. ఇవ్వకపోతే పట్టుకొని కొడతాడు. వాడి బాధ భరించలేక ఇచ్చి ఆవిడ ఏడుస్తూ కూర్చుంటుంది, ఇలాంటివి మనం చూస్తున్నాం.

మరి ఈ కోరిక కూడా ఎంతో నష్టాన్ని కలిగిస్తుంది  ఇది మనసుకు సంబంధించిన బలహీనత. ఎవ్వరైతే మనసుని అదుపు చేసుకుంటారో మెల్లి మెల్లిగా ఈ బలహీనత నుంచి బయటపడతారు.

# రకరకాల కోరికలు

కొంతమందికి జూదం ఆడాలనే కోరిక, ఇంకా కొంతమందికి లాటరీలు, క్రికెట్ బెట్టింగ్లు, వ్యభిచారం చేయాలనే కోరిక, పదవులు సంపాదించాలనే కోరిక. ఈ కోరికలన్నీ కూడా ఆర్థిక నష్టాన్ని కలిగిస్తాయి. ఇంకా కొంతమందికి ఎలక్షన్లు వచ్చాయంటే చాలు అక్కడ కూడా బెట్టింగులు ద్వారా సంపాదించాలనే కోరిక వుంటుంది. అందులో సంపాదించేవాళ్ళు ఎవరు ఉంటారో తెలియదు కానీ, ఎంతో మంది నష్టపోయినోళ్ళని చూస్తున్నాం.

ఈ నష్టం అంతా ఎందుకు జరుగుతుంది? కోరికల వల్లే. మరి ఇటువంటి నష్టాల్ని అధిగమించాలంటే ఎవరైనా సరే మనసు శుద్ధి చేసుకోవాలి. మరి దానికి "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేయాలి. ఈ కోరికలు ఎన్ని తీరినా ఇంకా కొత్తవి పుడుతూనే ఉంటాయి. కోరిక తీరిపోతే సరిపెట్టుకుంటారా, తృప్తి పడతారా? అబ్బే సరిపెట్టుకోరు దానితో తృప్తి పడరు. ఇంకో కొత్త కోరిక పుడుతుంది. ఎవరి కోరికలైనా పూర్తిగా తీర్చుకోవడం అన్నది అసాధ్యం, అసంభవం, ఈ కోరికలకు అంతం లేదు.

చూడండి ముందు బాగా చదువుకోవాలనుకుంటాడు సరే చదువుకున్నాడు. మంచి మంచి ర్యాంక్ కావాలనుకుంటాడు. సరే ర్యాంక్ సంపాదించాడు. అక్కడితోటి సరిపోతుందా? అంటే మంచి ఉద్యోగం కావాలనుకుంటాడు. మంచి ఉద్యోగం వస్తుంది. అక్కడితో సరిపోతుందా? అంటే అందులో మంచి పొజిషన్ కావాలనుకుంటారు. అక్కడితో సరిపోయిందా? అది అయిపోయిన తర్వాత పెళ్లి , పెళ్లి అయిపోయింది. తర్వాత పిల్లలు, సరే పిల్లలు పుట్టారు. అక్కడితో సరిపోతుందా? అంటే వాళ్ళ జీవితాలు బాగుండాలి. వాళ్ళు కూడా మంచిగా ఎదగాలి అనే కోరిక.

ఇలా ఈ కోరికలకి అంతం ఉండదు. అంతే కాదు మీరు చూడండి సైకిల్ లేనివాడు నాకు ఒక్క సైకిల్ ఉంటే చాలు అనుకుంటాడు. పోనీ ఏదో

తిప్పలు పడి సైకిల్ కొన్నాడు అక్కడితో వాడు తృప్తి పడతాడా అంటే? అది కొన్న కొన్నాళ్ళకి అబ్బే సైకిల్ కాదు బైక్ కొంటే బాగుంటుంది అని ఇంకా కొన్నాళ్ళు కష్టపడి మొత్తం మీద బైక్ కొని ఆ కోరిక తీర్చుకుంటాడు.

అక్కడితో ఊరుకుంటాడా అంటే? ఆ బైక్ కూడా వాడికి సరిపోదు, కారు ఉంటే బాగుంటుంది అనుకుంటాడు. పోనీ కారు కొన్నాడు, ఊరుకుంటాడా అంటే? మామూలు కారు సరిపోదు ఇంకా పెద్ద కారు కావాలి అనుకుంటాడు. కుటుంబం అంతా కలిపి ఒక కారు కొనుక్కున్నారు అక్కడితో సరిపోతుందా అంటే? వాడికే కాదు, వాడి కొడుక్కి కారు, ఇద్దరు కొడుకులు ఉంటే ఇద్దరికీ రెండు కార్లు కావాలి అనుకుంటారు. ఇలా చూస్తే ఎక్కడా అంతం ఉండదు.

ఏ ఇల్లూ లేకపోతే ఏదో ఒక ఇల్లు చాలు అంటారు. సరే అలాగే ఏదో ఒక పూరి గుడిసె వేసుకున్నాడు అనుకోండి. కొన్నాళ్ళు పోయాక అది నచ్చదు. ఒక పెంకుటిల్లు ఉంటే బాగుంటుంది అనుకుంటారు. పెంకుటిల్లుతో తృప్తి పడతారా అంటే? అదీ చాలదు ఒక డాబా అంటారు. ఇంకా పెద్ద ఇల్లు అంటారు.

అక్కడితో సరిపోతుందా అంటే? డెకరేషన్ చేయాలంటారు. ఇలా చూస్తే ఈ కోరికలకి ఎక్కడా అంతం లేకుండా పెరిగిపోతూనే ఉంటాయి. ముందు ఒక పది లక్షల ఇల్లు కొంటాడు. తర్వాత 50 లక్షల ఇల్లు కొంటాడు. తర్వాత కోటి రూపాయలు. దీన్ని బట్టి చూస్తే ఒక కోరిక తీరినా తృప్తి ఉండదు అన్నది మనకు అర్థమవుతుంది.

ఇక్కడ గమనిస్తే కోరిక కోరతారు బాగానే ఉంటుంది. ఆ కోరిక తీరకపోతే వాళ్ళకి చాలా దుఃఖం  కలుగుతుంది, అశాంతికి లోనవుతారు, ఎంతో నష్టపోతూ ఉంటారు.

# కోరికలకు పరిమితి లేదు

ఉపనిషత్తుల్లో ఒక కథ చెప్పబడింది. ఏమిటంటే? యయాతి మహారాజు ఒక రాక్షసరాజు. ఆయనకి ఎన్నో భోగాలు ఉన్నాయి, ఏది అనుకుంటే అది నెరవేరగలదు, ఎంతోమంది సుందరాంగులైనటువంటి స్త్రీలని అనుభవించేవాడు. అలా ఎన్నో కోరికలు తీర్చుకునేవాడు, చాలా హాయిగా సరదాగా గడిపేవాడు, చాలా తృప్తిగా జీవించేవాడు, దేనికీ లోటు లేదు, ఏది అనుకుంటే అది నెరవేర్చుకునేవాడు.

ఇలా ఉంటూ ఉండగా మెల్లి మెల్లిగా ఆయనకి వార్ధక్యం వచ్చింది. ఇక్కడ విచిత్రం ఏమిటంటే? కోరికలు తీర్చుకోడానికి ఆయన దగ్గరకి ఎవరిని రమ్మంటే వాళ్ళు వస్తారు, వాళ్ళని అనుభవించొచ్చు కానీ అనుభవించే శక్తి ఈయనకి లేదు, చాలా బాధపడ్డాడు. ఏమిటి నా పరిస్థితి ఇలా అయిపోయింది, అనుభవిద్దాం అంటే నా దగ్గర శక్తి లేకుండా పోయింది, ముసలితనం వచ్చేసింది అని విచారించాడు.

ఆయన గురువుగారైనటువంటి శుక్రాచార్యులు వారి దగ్గరికి వెళ్ళాడు. ఆయన్ని అర్థించాడు. ఏమండీ నాకు ఇంకా ఎన్నో కోరికలు ఉన్నాయి, ఇంకా అనుభవించాలని ఉంది, నాకు చూస్తే శక్తి లేదు. కాస్త మీ తపఃశ్శక్తితో నాకు యవ్వనాన్ని ప్రసాదించండి అని అడిగాడు. కానీ ఆయన ఏమన్నాడంటే? బాబు సృష్టిలో ఇది ఎవరికీ సాధ్యం కాదు ఎవరికైనా సరే యవ్వనం కొన్నాళ్ళే ఉంటుంది, తర్వాత వృద్ధులు అయిపోవాల్సిందే, ఉన్న శక్తులన్నీ కోల్పోవల్సిందే, ఇది సృష్టి ధర్మం నా వల్ల కాదు అన్నాడు.

కానీ మీరు అంత గొప్ప తపః సంపన్నులు ఎందుకు నా కోరిక తీర్చలేరు అని మళ్ళీ మళ్ళీ ఆయనను బ్రతిమాలితే అప్పుడు ఆయన ఒక మార్గం చెప్పాడు. ఏమిటంటే? ఎవరైనా వాళ్ళ యవ్వనాన్ని నీకు ఇవ్వడానికి

సిద్ధపడి, నీ వార్ధక్యాన్ని వాళ్ళు తీసుకుంటే అప్పుడు ఈ ఏర్పాటు నేను చేయగలను అన్నాడు. అప్పుడు ఈయన తన కొడుకులు అందరిని అడిగితే ఆఖరి కొడుకు దీనికి అంగీకరించాడు.

శుక్రాచార్యులు వారి తపఃశ్శక్తి చేత ఈయన వార్ధక్యం ఆ కొడుక్కి మార్చి, కొడుకు యవ్వనాన్ని ఈయనకి ఇవ్వడం జరిగింది. అప్పుడు మళ్ళీ ఎంతో మంది స్త్రీలతో ఎన్నో రకాల భోగాలు ఇంకా బాగా అనుభవించాడు. ఇలా అనుభవిస్తే మళ్ళీ కొన్నాళ్ళకి వార్ధక్యం వచ్చింది. అప్పుడు ఆయన ఆలోచించాడు! అన్నీ ఉన్నాయి కానీ అనుభవించే శక్తి లేదు. ఈ కోరికలు ఎన్ని తీర్చుకున్నా ఇంకా మళ్ళీ మళ్ళీ పుడుతూనే ఉంటాయి. వీటికి పరిమితి అంటూ లేదు. మరి దీనికి పరిష్కారం ఏమిటి? అని ఆలోచించాడు. ఈ జీవితం వుంటే ఇలాగే వుంటుంది. అందుచేత ఇటువంటి జీవితం లేకుండా ఉండే స్థితి నేను సంపాదించాలి. ఇలాంటివి ఎన్ని తీర్చుకున్నా, ఎన్ని నెరవేర్చుకున్నా సాధ్యం కాదు, దీనికి అంతం అంటూ ఉండదు అనేటటువంటి నిర్ణయానికి వచ్చి అప్పుడు రాజ్యం వదిలి ఆయన వానప్రస్థం స్వీకరించి సాధనలు చేసి జన్మలేని స్థితి పొందడానికి ఆయన వెళ్ళడం జరిగింది.

అందుచేత గుర్తుపెట్టుకోండి కోరికలన్నవి అలా పుడుతూనే ఉంటాయి. ఒకటి తీరినా ఇంకొకటి పుడుతూ ఉంటుంది. అవి తీర్చుకోవాలనే భ్రాంతితో జీవితాన్ని కష్టాలపాలు చేసుకోకూడదు. సంసారాన్ని నరక ప్రాయం చేసుకోకూడదు. ఎవ్వరైనా సరే కోరికల్ని అదుపు చేసుకునే ప్రయత్నం చేయాలి. పత్రి గారు అదే చెప్తారు. కోరికలు లేకుండా చేసుకోవడం కాదు కోరికల్ని అదుపు చేసుకోండి అన్నారు.

మీకు కారు కొనుక్కోవాలనే కోరిక పుట్టింది. కానీ ఆ శక్తి లేదు సరే నాకు లేకపోతే ఇప్పుడు నష్టం ఏముంది అని మీరు మనసుకు సర్ది చెప్పుకోగలిగితే మంచిదే. అలాగే బంగారం కొనుక్కోవాలనుకొన్నారు కానీ ఆ

శక్తి లేదు, సరే నాకు ఉంటే ఏమిటి? లేకపోతే ఏమిటి? అని మీరు సర్దుకోగలిగితే ఏ ఇబ్బందీ ఉండదు. లేకపోయినా దాన్ని తీర్చుకోవాలని ప్రయత్నం చేస్తే జీవితంలో చాలా ఇబ్బందులు పడతారు, నష్టపోతారు కూడా.

ఇప్పుడు ఎంతో మంది ఇలా కోరికలు తీర్చుకోవడానికే తప్పులు చేస్తున్నారు, చేయకూడని పనులు చేస్తున్నారు, అధర్మంగా వ్యవహరిస్తున్నారు.

తర్వాత ఎన్నో నష్టాలకి, కష్టాలకి గురి అవుతున్నారు. అందుచేత ప్రతి ఒక్కరు కోరికల్ని అదుపు చేసుకునే ప్రయత్నం చేయాలి. ఆ మార్గమే పత్రిగారు మనకి ఇచ్చినటువంటి "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

ఎవరైతే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం తీవ్రంగా చేస్తారో వారి మనసు వారి అదుపులోకి వస్తుంది. మనసు ఎప్పుడైతే వారి అదుపులోకి వచ్చిందో మనసుకు సంబంధించిన గుణాలన్నీ ఒక రకంగా అరిషడ్వర్గాలన్నీ అంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అదుపులో ఉంటాయి. అవి అదుపులో ఉంటే జీవితం లాభదాయకంగా ఉంటుంది. ఇవి అదుపులో లేకపోతే జీవితమంతా కష్టాలు, నష్టాలు.



# దైవం కోరికలు తీరుస్తాడా?

మనకి పెద్దలు **"చేసుకున్న వాడికి చేసుకున్నంత మహదేవా"** అని చెప్తూ ఉంటారు. అంటే ఎవరు ఏది చేసుకుంటారో వారు అదే పొందుతారు. ఎంత చేసుకుంటారో అంతే పొందుతారు. ఏదీ చేసుకోకపోతే, ఏదీ రాదు. మంచి చేస్తే మంచే పొందుతారు, చెడు చేస్తే చెడే పొందుతారు.

మనకి శాస్త్రాల్లో **"చేసుకున్న వాడికి చేసుకున్నంత మహదేవా"** అన్నారే కానీ ఎక్కడా **"కోరుకున్న వాడికి కోరుకున్నంత మహాదేవ"** అని అనలేదు. ఇది మనం గుర్తుంచుకోవాలి. దైవం మనకి కోరికలు తీరుస్తాడు అని అనుకుంటారు, దైవమే కోరికలు తీర్చేవాడు అయితే మరి శాస్త్రాల్లో ఈ రకమైనటువంటి వాక్యం పెద్దలు చెప్పరు.

అందుచేత మనం చేసుకునే దాన్ని బట్టే మనకి లభించేది ఉంటుంది అని స్పష్టంగా తెలుస్తుంది. అందుచేత మనం చేసుకోవడం మీద దృష్టి పెట్టాలి కానీ కోరుకోవడం మీద దృష్టి పెట్టకూడదు. కారణం కోరుకోవడం మీద దృష్టి పెడితే, కోరికలు తీరకపోతే ఎంతో నిరుత్సాహపడతారు, ఎంతో బాధపడతారు. చివరకు ఆ దేవుడి మీదే నమ్మకం కోల్పోవాల్సి వస్తుంది.

కొన్నాళ్ళు చూసి ఈ దేవుడిని మనం నమ్ముకుంటే మన పరిస్థితి ఇంతే, వాళ్ళ దేవుడు ఇంకా బాగా చూస్తున్నాడట, అడిగింది ఇస్తున్నాడట అంటూ  ఈ దేవుడిని వదలి, ఇంకో దేవుడి దగ్గరకు వెళతారు. మతాలు మారడం, దేవుడిని మార్చడం అన్నది లోకంలో మనం చూస్తూనే ఉన్నాం.

అందుచేత ఎప్పటినుంచో నమ్మిన ఆ దేవుడిని మార్చేసి కొత్త ఫోటోలు పెడతారు. భారతదేశంలో చూస్తే గుడికి వెళ్ళడం మానేసి చర్చిలకి వెళ్తున్నారు.

ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా గమనిస్తే చర్చిలు వదిలేసి మళ్ళీ హిందూ

మతంలోకి ఎంతోమంది మారుతూ ఉండడం జరుగుతుంది.

అందుచేత మీరు ఒకటే గుర్తుపెట్టుకోండి ఇక్కడ కోరికతో సంబంధం లేదు, మీరు చేయవలసింది చేస్తే ఖచ్చితంగా కోరక పోయినా పొందవలసింది పొందుతారు. చేయవలసింది చేయకుండా పొందవలసింది పొందలేరని తెలుసుకోండి.

చూడండి చదువుకునే పిల్లల్లో ఒకడు రోజూ పూజ చేస్తూ, ప్రార్థిస్తూ దేవుడిని నాకు క్లాసులో ఫస్ట్ రావాలి అని కోరుకుంటాడు. దేవుడిని నేను కోరుకున్నాను కాబట్టి క్లాసులో ఫస్ట్ వస్తుంది, ఇంక నేను చదవవలసిన పనేముంది అని చదవకుండా రోజూ పడుకుంటాడు.

ఇంకొకడు దేవుడిని అసలు కోరడు, పూజ చేయడు. రోజూ కష్టపడి రాత్రి, పగలు చదువుతాడు. ఇప్పుడు వీళ్ళిద్దరిలో ఎవరికి ఫస్ట్ వస్తుందంటే? ఖచ్చితంగా కష్టపడి చదివిన వాడికే ఫస్ట్ వస్తుందని చెప్తారు. కారణం వాడు కోరలేదు, పూజ చేయలేదు. చదవని వాడికి సున్నాలు రావడానికి కారణం వాడు చదవలేదు కాబట్టి. వాడు ఊరికే దైవాన్ని కోరుతూ కూర్చున్నాడు. అంటే ఇక్కడ కృషి బట్టి ఫలితం ఉందా? కోరికను బట్టి ఫలితం ఉందా? అంటే కృషిని బట్టే ఫలితం ఉంది అన్నది అర్థమవుతుంది. దేవుడి విషయంలో చూస్తే మరి కృషి చేసిన వాడికే మంచి జరుగుతుంది, కానీ కృషి చేయకుండా ఊరికే కోరుతూ కూర్చుంటే ఏమీ లాభం లేదు.

ఇంకొక ఉదాహరణ చూద్దాం. మీరు నది దాటాలి. ఆ నది ఒడ్డున కూర్చుని ఒక దేవుడి ఫోటో పెట్టి పూజ చేస్తూ నన్ను నది దాటించు స్వామి అని కోరితే ఎప్పటికైనా దాటగలరా? ఎన్ని రోజులైనా, ఎన్ని సంవత్సరాలైనా మీరు దాటలేరు.

కానీ ఎవరు దాటగలరంటే? కొంత కృషి చేసినవారు, కొంత

ప్రయత్నం చేసిన వారు దాటగలరు. అంటే పడవలోనైనా వెళ్ళాలి, లేదా ఈత కొట్టుకుంటూ నైనా వెళ్ళాలి, లేకపోతే లోతు తక్కువ ఉన్న ప్రాంతం నుంచైనా దాటడానికి ప్రయత్నం చేయాలి, అలా ఏదో ఒక ప్రయత్నం చేయాలి. అంతేకానీ ఏమీ లేకుండా కూర్చుని దేవుడ్ని నన్ను నది దాటించు అంటే ఇవతల గట్టు నుంచి అవతలకి ఆటోమేటిక్ గా ఎలా వెళ్ళిపోతారు? అంటే ఇక్కడ కృషి చేయడం ముఖ్యం అన్నది తెలుసుకోవాలి.

అలాగే మీరు ఒక ఎత్తైన కొండ ఎక్కాలి. మరి ఆ కొండ దగ్గరికి వెళ్లి దేవుడి ఫోటో పెట్టి స్వామి నన్ను ఆ కొండపైకి చేర్చు అని ప్రార్థిస్తే కొండపైకి వెళ్తారా? ఎప్పటికీ వెళ్ళలేరు. కానీ ఎవరైతే కాస్త కృషి చేస్తారో, కష్టపడతారో, ప్రయత్నం చేస్తారో మెల్లిగా ఇవ్వాళ కాకపోతే రేపైనా ఆ కొండ శిఖరానికి చేరుకోగలుగుతారు. అంతేకానీ కృషి చేయకుండా ఏ ఫలితము రాదు.

అంతేకాదు మీరు క్రికెట్ ఛాంపియన్ అవ్వాలన్నా, లేకపోతే ఇంక ఏ ఆటల్లో మంచి నైపుణ్యం సంపాదించాలన్నా, రోజూ గుడికి వెళ్లి పూజ చేస్తూ నన్ను గొప్ప ఛాంపియన్ చేయి అని కోరితే మీరు అవుతారా అంటే? ఎప్పటికీ అవ్వలేరు. కానీ మీరు రోజు ప్రాక్టీస్ చేస్తే ఖచ్చితంగా ఛాంపియన్ అవుతారు.

అందుచేత దైవం విషయంలో కోరికలు కోరడం వల్ల ఏ ప్రయోజనం లేదు, కృషి అన్నది చాలా ముఖ్యం. భగవంతుడు కోరికలు తీర్చే వాడైతే అందరి కోరికలు తీరుస్తాడు. ఎవరికి ఏది కావాలంటే అది ఇచ్చేవాడు. ఇంక కృషి చేయవలసిన పనేముంది? అందుకే దేవుడు ఎవరు ఎంత కృషి చేసుకుంటే వారు అంత ఫలితం పొందే ఏర్పాటు సృష్టిలో చేశాడు.

అందుచేత ఎవరైతే కృషి చేస్తారో అది పొందేటటువంటి ఏర్పాటు

ప్రకృతిలో చేయడం జరిగింది. అందుచేత ప్రతి ఒక్కరు ఇది గుర్తుపెట్టుకోండి కోరినందు వల్ల ఏమీ ప్రయోజనం లేదు అంతా నష్టమే కానీ కృషి చేస్తే ఖచ్చితంగా చేసిన కృషిని బట్టి పొందే ఫలితం ఆధారపడి ఉంటుంది.

సృష్టిలో ఉన్న కర్మ సిద్ధాంతం గురించి భాయ్ గురుదాస్ చెబుతూ **"మంచి చేస్తే చెడు లభించదు, చెడు చేస్తే మంచి లభించదు"** అన్నారు.

సహజంగా **"మీరు మంచి పనులు చేస్తే చెడు రమ్మన్నా రాదు. చెడు చేస్తే మంచి మీరు కోరుకున్నా రాదు".** సహజంగా లోకంలో చెడు చేస్తారు దేవుడిని మంచి కోరుకుంటారు. మరి చెడు చేసి మంచి రమ్మంటే ఎలా వస్తుంది? ఆయన ఖచ్చితంగా చెప్పాడు నువ్వు మంచి పొందాలంటే మంచే చేయాలి అని.

కనుక ప్రతి ఒక్కరు కోరడం మీద దృష్టి పెట్టడం కాదు చేసుకోవడం మీద దృష్టి పెట్టండి. ఇదే పత్రి గారు చెప్తూ ఉంటారు.

బ్రహ్మర్షి వశిష్టుల వారు ఏమన్నారంటే? **"ఎవడు ఎలా చేసుకుంటాడో వాడు దాని ఫలితాన్ని అలాగే అనుభవిస్తాడు"** అని అన్నారు.

మంచి చేస్తే మంచి అనుభవిస్తాడు, చెడు చేస్తే చెడు అనుభవిస్తాడు. ఏ మహానుభావులు చెప్పినా ఈ విషయమే చెప్తున్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే?

**"చేసుకున్న కర్మ కంటే వేరుగా దైవం కానీ, ప్రారబ్ధం కానీ ఏదీ లేదు"** అని ఆయన చాలా స్పష్టంగా చెప్పారు.

అంటే ఎవరికైనా ఏదైనా మంచి జరిగితే వెంటనే దేవుడి దయవల్ల అనుకుంటారు, మంచి జరగకపోతే దేవుడికి ఇంకా దయ కలగలేదు అనుకుంటారు. అంటే లోకంలో మంచి జరిగినా దేవుడే, చెడు జరిగినా దేవుడే అనేటటువంటి అభిప్రాయం ఉంది. కానీ వశిష్టుల వారు ఏమన్నారంటే?

మీరు చేసుకున్న కర్మ కంటే వేరుగా దైవం అంటూ ఏదీ లేదు అని చెప్పారు.

ఇక్కడ గుర్తుపెట్టుకోండి జీవితంలో ఒకరికి మంచి జరిగింది, అనుకోని లాభం వచ్చింది, ఇంకా కొన్ని భోగాలు వచ్చాయి అంటే గతంలో వాడు పుణ్యకార్యాలు, దానాలు, సత్కర్మలు చేసుకోవడం వల్ల దాని ఫలితం ఇప్పుడు వాడు అనుభవిస్తున్నాడు, ఈ విషయం వాడికి తెలియదు. గత జన్మలో ఏం జరిగిందో వాడికి తెలియదు. అందుచేత వాడు అంతా బాగా జరుగుతుంటే, జీవితం సాఫీగా ఉంటే, అన్నీ అనుకూలంగా ఉంటే, అంతా దేవుని దయ అనుకుంటాడు.

అలాగే ఇంకొకడు తప్పులు చేశాడు, పాపాలు చేశాడు, హింస చేశాడు, జీవితంలో మాంస భక్షణ, జీవ హింస ఇవన్నీ చేశాడు. వాడు భవిష్యత్తులో కాని, మరుజన్మలో కాని కష్టాలూ, బాధలూ అనుభవిస్తాడు. అలా కష్టాలు, దుఃఖం వచ్చినప్పుడు సహజంగా దేవుడికి దయ లేదు అనుకుంటాడు.

వాడు ఎంత కోరుతున్నా, ఏం చేసినా, ఎన్ని గుళ్ళు తిరుగుతున్నా, ఎక్కడికి వెళ్ళినా ఆ కష్టాలు అలా వస్తూనే ఉంటాయి. అప్పుడు వాడు ఏమిటో దేవుడికి నా మీద ఇంకా దయ కలగలేదు అంటాడు. ఇక్కడ వాడికి చెడు జరిగినప్పుడు ఆ దేవుడికి దయ కలగలేదు అంటున్నాడంటే వీడి జీవితం అంతా ఆ దేవుని బట్టి ఆధారపడి ఉంది అని వాడు భావిస్తున్నాడు. కానీ వశిష్టుల వారు ఏం చెప్పారంటే "నువ్వు చేసుకున్న కర్మ కంటే వేరుగా దైవం అంటూ ఏమీ లేదు" అన్నారు. అందుచేత నువ్వు పాపం చేసి దేవుడికి దయ కలగలేదు అనుకోవడం నీ అవివేకమే.

అంతేకాదు ఆయన ఇంకా ఏమన్నారంటే? నువ్వు చేసుకున్న దాని కన్నా వేరుగా ప్రారబ్ధం ఏమీ లేదు అన్నారు. మరి ప్రారబ్ధం అంటే ఏమిటి?

మీరు జన్మ తీసుకున్నాక ఎన్నో పుణ్యాలు చేస్తారు, పాపాలు చేస్తారు, మంచి చేస్తారు, చెడు చేస్తారు. మరి కర్మ ఫలితాలు అనుభవించవలసినవి అనుభవించగా మిగిలినవి మీరు శరీరం వదిలినప్పుడు మీ అకౌంట్లో రికార్డు అవుతాయి. దాన్నే "ఆకాశిక్ రికార్డ్స్" అంటారు. హిందూ ధర్మ శాస్త్రాల్లో దీన్నే "చిత్రగుప్తుని చిట్టా" అంటారు. యమ ధర్మరాజు దగ్గర ఉండేటటువంటి చిత్రగుప్తుడు దగ్గర ఉండే పుస్తకం అంటారు.

అంటే ప్రతి ఒక్కళ్ళకి ఒక ఖాతా ఉంటుంది. అందులో మీరు చేసిన కర్మలన్నీ రికార్డు అవుతాయి. అలా రికార్డు అయిన వాటన్నిటిని సంచిత కర్మలు అంటారు. మరల మీరు జన్మ తీసుకునేటప్పుడు ఆ కర్మల నుంచి కొన్ని కర్మలు ఎంచుకొని మళ్లీ భూమి మీదకి శరీరం తీసుకుని వస్తారు. అలా అనుభవించడానికి తెచ్చుకున్న కర్మలు ఏవైతే ఉన్నాయో వాటినే ప్రారబ్ధ కర్మలు అంటారు.

చాలామందికి ఇది అర్థం కాక ఈ ప్రారబ్ధం అనే మాట ఆనవాయితీగా వాడుతూ ఉంటారు. ఎవరైనా తన కూతురు కష్టాలు పడుతుంటే ఏమిటో దాని ప్రారబ్ధం అలా తగలబడింది, దాని జీవితం అలా నాశనం అయిపోయింది అన్నీ కష్టాలే అంటూ ఉంటారు.

కాని ఇక్కడ ప్రారబ్ధం అన్నది దేన్ని బట్టి ఉంది అంటే గతంలో, గత జన్మల్లో వారు చేసుకున్నటువంటి ఆ పాప కర్మల, ఆ చెడు కర్మల, ఆ దుష్కర్మల ఫలితమే ఇప్పుడు కష్టాల రూపంలో అనుభవించవలసి వస్తుంది. అందుచేత వారు చేసుకున్న కర్మల కంటే కూడా వేరుగా ప్రారబ్ధం కానీ, దేవుడు కానీ ఏమీ లేదు. ఆ కర్మల్నే నువ్వు దేవుడు అనుకుంటున్నావు. ఆ కర్మల్నే నువ్వు ప్రారబ్ధం అని అనుకుంటున్నావు అని వశిష్టుల వారు చెప్పడం జరిగింది.

అంతే కాదు చాలామంది ఏమిటో దేవుడు నా రాత ఇలా రాశాడు

అంటారు. ఇంకా కొంతమంది బ్రహ్మ నా రాత ఇలా రాశాడు అని కూడా అంటారు. పత్రిగారు ఏమంటారంటే? ఎవరూ నీ రాత రాయరు. నువ్వు చేసుకున్న కర్మల్లో నుంచి, నువ్వు జన్మ తీసుకునే ముందు, నువ్వు కోరుకున్న కర్మలే నీ జీవితంలో వ్రాయబడతాయి అన్నారు.

అందుకే పత్రి గారు మాటలు మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా మాట్లాడు. **"నీ మాటలు కూడా కర్మలే". " నీ నోటి మాటే నీ నుదిటి వ్రాత"** అని చెప్తారు. నువ్వు ఏం మాట్లాడుతావో వెంటనే అది రికార్డు అయి పోతుంది. ఆ టైం వచ్చినప్పుడు దాని యొక్క ఫలితం అనుభవిస్తారు. అందుచేత మీ వాక్కుని చాలా జాగ్రత్తగా ఉపయోగించమంటారు, ఎరుకతో మాట్లాడమంటారు. ఎవరినీ కామెంట్ చేయొద్దు, విమర్శించద్దు అంటారు, నీ నోట అపస్వరాలు రాకూడదు అంటారు.

ఇక్కడ ఏ దేవుడూ ఎవరి జీవితంలోనూ అసలు వేలు పెట్టడు. ఆయన అందరికీ స్వేచ్ఛను ఇచ్చాడు. నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో అంటాడు. అందుకే మీరు చూడండి అర్జునుడు మహాభారత యుద్ధ సమయంలో తన తాతను, బంధువులను, తన గురువును చంపడం ఇష్టం లేక వాళ్ళందరినీ చూసి కృష్ణుడి ముందు నేను యుద్ధం చేయలేను అని అక్కడే చతికిల పడిపోయాడు. అప్పుడు కృష్ణుడు గీత బోధ చేశాడు. అపారమైన జ్ఞానాన్ని అర్జునుడికి బోధించాడు .

ఆఖరిలో ఏమన్నాడంటే? నేను బోధించానని నేను చెప్పినట్టు నువ్వు చేయవలసిన పనేమీ లేదు, నీ ఇష్ట ప్రకారం నువ్వు చేసుకో. **"యధా ఇచ్ఛసి తథా కురు"** అని ఆయన చెప్పడం జరిగింది. అంటే చెప్పడం వరకు నా వంతు చెప్పాను, ఇప్పుడు యుద్ధం చేయాలనుకుంటావా చెయ్యి, లేదు వెళ్ళిపోవాలనుకుంటావా వెళ్ళిపో అది నీ ఇష్టం అన్నాడు.

భగవద్గీతలో చెప్పేది సత్యం. అందుచేత మీకు మంచి చేయడానికైనా, చెడు చేయడానికైనా స్వేచ్ఛ ఉంది అంతా మీ ఇష్టమే. కానీ దాని ఫలితం కోరే హక్కు మీకు లేదు. ఇది ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకోవాలి.

ఇది నా ఇష్టం అని ఇష్టం వచ్చినట్టు చేస్తే కుదరదు, సృష్టికి అనుగుణంగా చేయాలి, అది ధర్మ యుక్తంగా వుండాలి, అది భవిష్యత్తులో నీకు లాభం కలిగించే విధంగా ఉండాలి, దాని ఫలితం నీకు కష్టాలు తెచ్చే విధంగా ఉండకూడదు.

అందుచేత ఊరికే నీ ఇష్టం వచ్చినట్టు కోరితే వచ్చేదేమీ లేదు. కోరిక తీరకపోతే ఎంతో నిరుత్సాహపడి, నష్టపోయినట్టు ఫీల్ అవుతావు. అందుచేత కోరడం మీద కాదు, చేయడం మీద దృష్టి పెట్టాలని తెలుసుకోండి.

మరి ఈ కోరికల గురించి భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు ఏమి చెప్పారో చూద్దాం. ఆయన ఏమన్నారంటే? నిష్కామ కర్మ చేయమన్నారు. అంటే కోరకుండా ఏ పనైనా చేయమన్నారు.

**శ్లో॥ యుక్తః కర్మ ఫలం త్యక్త్వా శాన్తి మాప్నోతి నైష్ఠికీమ్ ।**
**అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥ (భ.గీ.5-12)**

తా:- నిష్కామ కర్మయోగి, తాను చేసే కర్మలు పరమేశ్వర ప్రిత్యర్థమే అని, తన లాభం కొరకు కాదని అభిప్రాయముతో కర్మఫలాన్ని వదిలినప్పుడు మోక్షరూపమగు శాంతిని బొందుతున్నాడు. అలా కాక ఫలప్రాప్తి కొరకు కర్మలను చేయువాడు, అట్టి ఫలము నందు ఆసక్తి కలవాడై సంసార బద్ధుడగుచున్నాడు.

నువ్వు పూజ చేయాలంటే చెయ్యి. కానీ కోరికల కోసం చేయొద్దు. నువ్వు చేసిన దానికి ఏది ఇవ్వాలో ఆయనకు తెలుసు, నువ్వు కోరక పోయినా కూడా చేస్తే ఆయన ఇవ్వాల్సింది ఇస్తాడు. సృష్టిలో ఆ ఏర్పాటు ఉంది. దానికి కోరవల్సిన పని లేదు అని తెలుసుకోవాలి.

కామము అంటే కోరిక, మరి నిష్కామము అంటే కోరిక లేకుండా చేయాలి అని చెప్పారు.

**శ్లో॥ యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితః।**

**జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం త మాహుః పణ్డితం బుధాః॥ (భ.గీ.4-19)**

అంటే ఎవరి యొక్క సమస్త కర్మలు అంటే చేసే పనులు, కోరికలు, సంకల్పాలు లేకుండా ఉంటాయో, జ్ఞానం అనే అగ్ని చేత వారి కర్మలన్నీ దగ్ధమై ఉంటాయో, అట్టి వానిని పండితుడని విజ్ఞులని చెబుతారు. ఇక్కడ పండితుడు అంటే జ్ఞానంలో పండినవాడు అని అర్థం. అందుచేత ఎవరు చేసే కర్మలైనా సరే కోరిక, సంకల్పం అన్నవి లేకుండా ఉండాలి.

కోరిక అంటే కృషి చేయకుండా దేవుని కోరడం. సంకల్పం అంటే కోరుకున్న దాన్ని సాధించడం కోసం చేసేటువంటి కృషి. అలా కృషి చేస్తూ కూడా మనం ఏదైనా కోరుకుంటే దాని వల్ల కూడా ప్రయోజనం ఏమీ లేదు. చేయాల్సింది చెయ్యి, రావాల్సింది అదే వస్తుంది అని శ్రీకృష్ణుల వారు స్పష్టంగా చెప్పడం జరిగింది.

**శ్లో॥ కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదాచన ।**

**మా కర్మఫలహేతుర్భూ ర్మా తే సంగోఽ స్త్వకర్మణి ॥ (భ.గీ.2-47)**

తా:- నీకు కర్మ చేయడానికే అధికారం వుంది. అంతేకాని నీకు కర్మ ఫలాన్ని కోరే అధికారంం లేదు. అంతేకాదు కర్మఫలానికి కారణభూతుడవు కాకుము. కర్మలు మానుట యందు కూడా ఆసక్తి చూపించకు.

అంతే కాదు కోరికల గురించి ఆయన ఇంకా ఏమన్నారంటే? కర్మ చేయడానికే నీకు అధికారం ఉంది కానీ కర్మ ఫలితం ఆశించడానికి నీకు అధికారం లేదు అన్నారు. మీరు చూడండి చాలామంది గుడికి వెళ్తారు. వెళ్లి కొంతమంది పళ్ళు ఇస్తారు, కొంతమంది ధనం ఇస్తారు, కొంతమంది

బహుమతులు ఇస్తారు. ఇచ్చి కోరికలు కోరతారు. ఇక్కడ ఇవ్వడం వరకే నీకు అధికారం ఉంది కానీ కోరడానికి నీకు అధికారం లేదు అని శ్రీకృష్ణుల వారు భగవద్గీతలో చెప్పడం జరిగింది.

**శ్లో॥ న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః।**
**న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥ (భ.గీ.2-14)**

తా:- భగవంతుడు మానవులకు కర్తృత్వమును గానీ, కర్మములను గానీ, కర్మ ఫల సంబంధముగానీ కలుగజేయుట లేదు, ఎందుచేతనంటే! ప్రకృతిలో కలిగిన జన్మాంతర సంస్కారం వల్ల అలా ప్రవర్తిస్తున్నాడు.

ఆయన ఏం చెప్పాడంటే ఏ పని చేసినా కర్తృత్వ భావం లేకుండా చేయమన్నారు. కర్తృత్వ భావం అంటే నేను చేస్తున్నాను అన్న భావం కూడా లేకుండా చేయమన్నారు. సాధారణంగా మనమంతా ఏం చేస్తామంటే? నేను చేస్తున్నాను అని చెప్పుకుంటాం, నేను ఇది ఇచ్చాను, నాకు ఇది కావాలి అంటాం. అసలు నేను అన్నదే తీసేయమన్నారు. నువ్వు ఏది చేయాలంటే అది చెయ్యి. కానీ కర్తృత్వ భావం అన్నది లేకుండా చేయమన్నారు.

చాలామంది చూడండి గుళ్ళకి వెళ్తారు, పూజ చేయిస్తూ ఉంటారు. పూజ చేయించే ముందు సంకల్పం చెప్పిస్తారు. అంటే నేను ఈ పూజ చేస్తున్నాను, అష్టోత్తరం చేస్తున్నాను, అభిషేకం చేస్తున్నాను. అందుచేత నాకు ఈ రకమైనటువంటి లాభాలు కలిగేటట్టు చేయి అని కోరుతారు. పూజారులు ఆయురారోగ్య ఐశ్వర్యాభి సిత్యర్థం, ఇష్ట కామ్యాభి ఫల సిత్యర్థం అన్నప్పుడు వీరికి ఇంకేమైనా కోరికలు ఉంటే అవి కూడా చెప్పుకుంటారు.

అక్కడితో ఊరుకోరు. ఆ పూజారుల చేత ముందే గోత్ర నామాలు కూడా చెప్పిస్తారు. అంటే పేరు, గోత్రం కూడా చెప్పిస్తారు. ఎందుకు అంటే ఈ గోత్రం గల, ఈ పేరు గల నేను ఈ లాభాలు ఆశించి ఇది ఇస్తావని ఈ

పూజ చేస్తున్నాను అని చెప్తారు. కానీ భగవద్గీతలో ఆయన చాలా స్పష్టంగా కర్తృత్వ భావం లేకుండా చేయి అన్నారు. నేను అన్నది తీసేయాలి అన్నారు.

అంతేకాదు ఆయన ఇంకా ఏమన్నారంటే అన్నిటికంటే కర్మఫల త్యాగం గొప్పది అన్నారు. మనం ఏ కర్మ చేసినా ఫలితం గురించి చేస్తున్నాం. కానీ ఆయన ఏమన్నారంటే? నువ్వు ఏ కర్మ చెయ్యి ఆ కర్మ ఫలితం వదిలేయమన్నారు. ఇది అన్నిటికంటే గొప్పది అని చెప్పారు. మరి 12వ అధ్యాయంలో 12 శ్లోకం ద్వారా ఏమి చెప్పారంటే?

**శ్లో॥ శ్రేయో హి జ్ఞాన మభ్యాసాత్ జ్ఞానా ద్ధ్యానం విశిష్యతే ।**
**ధ్యానా త్కర్మ ఫలత్యాగ స్త్యాగా చ్ఛాంతి రనంతరమ్ ॥ (భ.గీ.12-12)**

తా:- అంటే అభ్యాసం కంటే జ్ఞానము శ్రేష్టమైనది, జ్ఞానము కంటే ధ్యానము శ్రేష్ఠమైనది, ధ్యానము కంటే కర్మఫల త్యాగం ఇంకా గొప్పది. అటువంటి కర్మఫల త్యాగము వలన శాంతి లభిస్తుంది అని ఇక్కడ చెప్పడం జరిగింది.

అంటే మనము చేసేటటువంటి కర్మల యొక్క ఫలితం త్యాగం చేయడం గొప్ప అన్నారు. అంటే నువ్వు ఏది చేసినా ఏదీ కోరవద్దు అన్నారు. మరి భగవంతుడు కోరికలే వద్దంటే మానవులు కోరికల గురించే ఆరాధిస్తున్నారు.

అసలు కోరికలు లేకుండా ఎవరు ఆరాధిస్తారు? చిన్న కష్టం వచ్చిందంటే చేతులు రెండూ జోడిస్తారు. అందుచేత కోరికలు లేకుండా ఎవ్వరూ ఏమీ చేయట్లేదు. మరి దాని వల్ల ఏమి ప్రయోజనం లేదు. ఆఖరికి ఈ ధ్యానంలోకి వచ్చిన వాళ్ళు కూడా చాలామంది రోగాలు తగ్గుతాయని, కోరికలు నెరవేరుతాయని చేస్తున్నారు. చెప్పేవాళ్ళు కూడా నీ సమస్య పోవాలని, మీ అమ్మాయికి పెళ్ళవ్వాలని, మీ అబ్బాయికి ఉద్యోగం రావాలని, మేడ కట్టాలని,

లేదా కారు కొనాలని సంకల్పం పెట్టుకొని ధ్యానం చెయ్యి. నీకు ఏ కోరిక ఉంటే ఆ కోరిక కోరుకొని సంకల్పించుకో నీ కోరిక నెరవేరిపోతుంది అని చెప్తారు కానీ ఇటువంటి వాటి వల్ల ఏమి ఫలితం రాదు.

అందుచేత పత్రి గారు కోరుకోమని చెప్పరు, చేయవలసింది ఏమిటో చెప్తారు. మరి మీరు కోరకపోయినా మీకు రావలసిన ఫలితం మీకు ధ్యానం చేయడం వల్ల వస్తుంది. అందుచేత ధ్యానాన్ని చేయడానికి ప్రాముఖ్యం ఇవ్వాలి. కోరికల సంగతి నీకెందుకు? సంకల్పాల సంగతి నీకెందుకు? అని చాలా స్పష్టంగా చెప్తారు. ధ్యానం కంటే గొప్పది ఇంకేది లేదు అని ఉత్తరగీతలో కూడా శ్రీకృష్ణ భగవానుడు చెప్పారు. ఆయన ఏమన్నారంటే?

**"పూజా కోటి సమం స్తోత్రం"** అన్నాడు.

అంటే కోటి పూజలు ఒక స్తోత్రానికి సమానం అని చెప్పారు. అంటే నువ్వు కోటి గంటలు పూజ చేస్తే ఒక గంట స్తోత్రం చదివిన దానితో సమానం. అంటే ఒక జన్మంతా పూజ చేసినా రాని ఫలితం ఒక గంట స్తోత్రం చదివితే వస్తుంది. అంత గొప్పది స్తోత్రం అన్నారు. ఆయన ఇంకా ఏమి చెప్పారంటే?

**"స్తోత్ర కోటి సమో జపం"** అన్నారు.

అంటే ఇలాంటి కోటి స్తోత్రాలు ఒక జపానికి సమానం అన్నారు. అంటే కోటి గంటలు స్తోత్రాలు చదివితే ఒక గంట జపం చేసిన దానితో సమానం. దీన్ని బట్టి మీరు ఒక్కసారి అర్థం చేసుకోండి ఒక గంట జపం చేస్తే ఒక జన్మంతా స్తోత్రం చదివినట్లు అన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే?

**"జపకోటి సమం ధ్యానం"** అన్నారు.

అంటే కోటి గంటలు జపం చేస్తే ఒక గంట ధ్యానంతో సమానం అని చెప్పారు. మరి కోటి గంటలు జపము అంటే ఒక జన్మంతా పడుతుంది. జన్మంతా నువ్వు జపం చేసినా రాని ఫలితం ఒక గంట ధ్యానంలో వస్తుంది.

మరి దీన్ని బట్టి ధ్యానం ఎంత గొప్పదో శ్రీ కృష్ణ భగవానుడు చెప్పినటువంటి ఈ శ్లోకం ద్వారా మనం తెలుసుకోవచ్చు. చేయవలసింది చేస్తే పొందవలసింది పొందుతారు. కాబట్టి అన్నిటికంటే శక్తివంతమైన ఆ ధ్యానం చెయ్యి అని చెప్తారు. పత్రిగారి దగ్గరికి ఎవరు ఏ సమస్యతో వచ్చినా ధ్యానం చేసుకో అంటారు. ఇది ఎవరైతే అర్థం చేసుకుంటారో వారికి ఇంకేమి అక్కర్లేదు, కోరికల మీద, సంకల్పాల మీద దృష్టి పెట్టక్కర్లేదు. చేయవలసింది చేస్తే చాలు ఆ ఫలితం తేలిగ్గా పొందగలుగుతారు.

శ్రీ కృష్ణుడు గంట ధ్యానాన్ని ఒక జన్మ జపము తోటి, కోటి జన్మల స్తోత్రాలతోటి, కోటి కోట్ల జన్మల పూజతోటి ఎందుకు సమానమని చెప్పారు? ఎందుకు ఇంత తేడా ఉంది అంటే? ఈ పూజలు దేహంతో చేస్తారు. స్తోత్రాలు నోటితో చేస్తారు, జపం మనసుతో చేస్తారు, ధ్యానం అన్నది మనసు లేని స్థితిలో చేస్తారు. మనసు లేకుండా ఉంటే ఏముంటుంది? అంటే ఆత్మ అంటే దేవుడే వుంటాడు. ఇక్కడ మీరు గుర్తుపెట్టుకోండి శరీరం కంటే వాక్కు గొప్పది, వాక్కు కంటే మనసు గొప్పది, మనసు కంటే ఆత్మ ఇంకా గొప్పది.

ఆత్మ అంటే సాక్షాత్తు భగవంతుడే! ఆత్మ అన్నది కోటాను కోట్ల సంవత్సరాల నుంచి వస్తూనే ఉంది, ఇంకా కోట్ల సంవత్సరాలు వుంటుంది. ఆత్మకు పుట్టుక లేదు, చావు లేదు. అటువంటి ఆత్మ సంబంధమైన సాధనే ధ్యానం. ఇది ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలి. అందుచేత మీరు ఏది చేసినా ఫలితం అడగక్కర్లేదు.

# అవసరాలకు పరిమితం అవ్వాలి

జీవితంలో ఎప్పుడు కూడా కోరికలకి బానిసలవ్వకూడదు, అవసరాలకి పరిమితమవ్వాలి. శరీరానికి కొన్ని అవసరాలు ఉంటాయి. కూడు అంటే తిండి, గూడు అంటే ఇల్లు, గుడ్డ అంటే వస్త్రం, తోడు అంటే భార్య లేదా భర్త  తప్పనిసరి.

మీరు భార్యను కోరుకోండి తప్పులేదు కానీ నాకు ఐశ్వర్య రాయ్ కావాలంటే ఎక్కడి నుంచి వస్తుంది? భర్తని కోరుకోండి అంతేకానీ షారుఖానే కావాలంటే ఎక్కడి నుంచి వస్తాడు? మీ స్థాయిని బట్టి, మీ స్థితిని బట్టి ఒక భార్యని సంపాదించుకోవచ్చు, ఒక భర్తను సంపాదించుకోవచ్చు.

అలాగే ఇల్లు. మీకు ఎండ నుంచి, వర్షం నుంచి, రక్షణ కావాలి, రాత్రి విశ్రాంతి తీసుకోవాలన్నా, భోజనం చేయాలన్నా, ఏం చేయాలన్నా ఒక ఇల్లు ఉండాలి. అందుచేత ఉండడానికి మీ స్థోమతను బట్టి ఏదో ఒక ఇల్లు సమకూర్చుకోవాలి. మరి ఇలా అవసరాలు తీర్చుకోవాలి కానీ కోరికల వెనక పరుగులు  పెట్టకూడదు.

కోరికల్లో కూడా

1. ధర్మ యుక్తమైనవి ఉన్నాయి.
2. అధర్మ యుక్తమైనవి ఉన్నాయి.

ధర్మ యుక్తంగా ఉంటే ఖచ్చితంగా దాని వల్ల మీకు నష్టం లేదు. అధర్మ యుక్తమైన కోరికల వల్ల వాటి ఫలితంగా తర్వాత కష్టాల పాలవుతారు. అందుచేత వ్యాపారం చేయాలనే కోరిక ఉన్నా, డబ్బు సంపాదించాలనే కోరిక ఉన్నా ధర్మంగా చేయండి. అంతేకానీ అధర్మంగా వ్యవహరించి, అన్యాయంగా సంపాదించి, ఇతరులని హింసించి, మోసగించి, బాధించి సంపాదిస్తే తర్వాత దీనికి పదింతలు మీరు నష్టపోవాల్సి వస్తుంది.

ఉదాహరణకు మీరు డాక్టర్ వృత్తిలో ఉంటే ధర్మయుక్తంగా చెయ్యాలి.

వాడి కేసుని రెట్టింపు చేసి చూపించి, లేని బిల్లు వేసి అన్యాయంగా అక్రమంగా డబ్బులు తీసుకుంటే భవిష్యత్తులో అంతకు అంతా అనుభవించాలి. మీ పాపాలన్నీ రికార్డు అవుతాయి, దాని ఫలితం ఘోరంగా అనుభవించాల్సి వుంటుంది.

ఎలక్షన్ లో నిలబడితే ధర్మ యుక్తంగా వుండాలి. పదవి ఉందని అధికారం చలాయించి అడ్డంగా, అక్రమంగా సంపాదించాలని అనుకుంటే దాని ఫలితం అనుభవించాల్సిందే. అందరికీ ఉపయోగపడే సేవ చేయి అది నీకేమి ఇబ్బంది కలిగించదు.

అలా ఎందులో తీసుకున్నా కూడా ధర్మయుక్తమైనటువంటి కోరికలు చెడ్డ చేయవు, పైగా లాభం కూడా కలిగిస్తాయి. అధర్మ యుక్తమైనటు వంటి పనులు మీకు నష్టాన్ని కలిగిస్తాయి.

చాలామంది కోరికల గురించి దైవాన్ని ఆశ్రయిస్తారు. కొంతమందికి వాళ్ళు అనుకున్న కోరికలు నెరవేరవు. నెరవేరనప్పుడు ఏం చేస్తారు? ఏ దిక్కు లేని వాడికి దేవుడే దిక్కు అంటూ దేవుడ్ని ఆశ్రయిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా ఎవరికి నచ్చిన దేవుడిని, ఎవరికి నచ్చిన రీతిలో వాళ్ళు ఆశ్రయిస్తారు, ఆరాధిస్తూ ఉంటారు, ఇది సహజమైపోయింది.

ఏ భగవంతుని వీళ్ళు ఆశ్రయిస్తున్నారో ఆయన సృష్టిలో కొన్ని ధర్మాలు, నియమాలు, సిద్ధాంతాలు ఏర్పాటు చేశాడు దాని ప్రకారమే సృష్టి నడుస్తుంది. ఆ ధర్మాల ప్రకారమే మీరు నడుచుకోవాలి, ధర్మయుక్తంగా ఉంటే అంతా కలిసి వస్తుంది, అధర్మయుక్తంగా ఉంటే అంతా నష్టం జరుగుతుంది.

మహాభారతం చూస్తే కౌరవులు అధర్మంగా జీవించారు, పాండవులు ధర్మంగా జీవించారు. భారత యుద్ధం అంటే వీళ్ళద్దరికీ మధ్య యుద్ధం కాదు. ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగినటువంటి యుద్ధం. మొదట్లో

అధర్మంగా వ్యవహరించిన కౌరవులు ఏదో పాండవుల రాజ్యం కూడా పొందినట్టుగా అనిపించింది, లాభం పొందినట్టుగా అనిపించింది. కానీ చివరికి సర్వనాశనమయ్యారు.

ధర్మాన్ని అనుసరించినటువంటి పాండవులు మొదట్లో నష్ట పోయినట్టుగా అనిపించింది, కానీ చివరికి మొత్తం రాజ్యాన్ని వాళ్ళు పొంద గలిగారు. ఎవరైనా అంతే అక్కడ రాజ్యాలు, రాజులు కాదు.

మీరైనా అంతే అధర్మ యుక్తంగా వ్యాపారం చేస్తే, అన్యాయంగా ఒకరిది లాక్కుంటే ఇదే జరుగుతుంది. అందుచేత ఏ దేవుడినైతే అంతా ఆరాధిస్తున్నారో ఆ దేవుడే, ఆ భగవంతుడే ధర్మాలను ఏర్పాటు చేసేసాడు, సృష్టి అంతా ఆ నియమాల ప్రకారం నడుస్తుంది.

అలాగే ఆయన కొన్ని సిద్ధాంతాలు పెట్టాడు. అందులో ఒకటి కర్మ సిద్ధాంతం. అంటే ఇప్పుడు మీరు ఏది చేస్తే అలాంటి అర్హత పొందుతారు, దాని ఫలితం తర్వాత అనుభవిస్తారు. కానీ మీరు లోకంలో చూస్తే చాలామంది దేవుళ్ళని కోరికలు కోరుతూ ఉంటారు. దేవుడు కోరికలు తీరుస్తాడా అని ప్రశ్న వేస్తే ఎందుకు తీర్చడు? అని అనేవాళ్ళు ఉన్నారు.

అంతేకాదు ఇంకా కొంతమంది అంటారు మేము పూజలు చేసాం, లేదా ప్రార్థన చేసాం, లేదా నమాజు చేసాం కోరికలు కొన్ని తీరాయి అంటారు. అన్నీ తీరాయి అన్న మాట అనరు. మరి కొన్ని ఎందుకు తీరాయి? కొన్ని కోరికలు ఎందుకు తీరలేదు? అలాగే కొంతమందికి తీరాయి, చాలామందికి తీరలేదు. మరి వీళ్ళకి ఎందుకు తీరాయి? చాలామందికి ఎందుకు తీరలేదు? దీనికి కారణం కొంచెం మీరు లోతుగా విశ్లేషణ చేస్తే అర్థమవుతుంది.

సృష్టిలో కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయి. అందులో ముఖ్యమైనది కర్మ సిద్ధాంతం. గతంలో మీరు చేసుకున్న దాని ఫలితమే ఇప్పుడు మీరు అనుభవిస్తూ ఉంటారు. గతం అంటే ఈ జన్మలో గత జీవితం అవ్వచ్చు లేదా గత జన్మల్లో

అవ్వచ్చు. అప్పుడు మీరు చేసుకున్నటువంటి పుణ్య కర్మల ఫలితం వల్ల మీరు అనుకోకుండా ఇప్పుడు అనుభవిస్తారు. అది ధనరూపేణా కావచ్చు. ఇంకో రూపేణా కావచ్చు అది జరుగుతుంది. మరి అలా కొన్ని జరిగినప్పుడు నేను దేవుడిని కోరుకున్నాను, ఆ దేవుడు నా కోరిక తీర్చాడు అని భావిస్తూ ఉంటారు.

అలాగే ఇంకా కొంతమందికి గతంలో  చేసినటువంటి పాపాల ఫలితంగా ఇప్పుడు కష్టాలు, రోగాలు, చాలా సమస్యలు వస్తాయి. అవి తట్టుకోలేక పూజలు, ప్రార్థనలు చేస్తూ ఉంటారు. ఇలా చేస్తూ ఉంటే కొంతమందికి అవి తీరుతాయి, కొంతమందికి తీరవు. మరి ఈ పాపాలు ఎక్కువ చేసేవాళ్ళు ఉన్నారు, తక్కువ చేసేవాళ్ళూ ఉన్నారు. ఎక్కువ చేసేవాళ్ళు ఎక్కువ రోజులు అనుభవించాలి, తక్కువ చేసేవాళ్ళు తక్కువ రోజులు అనుభవిస్తే సరిపోతుంది.

అంటే మాంసం తినడమే చూద్దాం. కొంతమంది రోజూ మూడు పూట్ల తింటారు, కొంతమంది రోజుకు ఒకసారే తింటారు. లేకపోతే వారానికి ఒకసారి తింటారు, లేదా నెలకు ఒకసారి తింటారు, ఇంకా కొంతమంది ఎప్పుడో ఫంక్షన్ల లో తింటారు. ఇలా ఎక్కువ తిన్నవాళ్ళూ ఉంటారు, తక్కువ తిన్నవాళ్ళూ ఉంటారు. ఎక్కువ  పాపం చేస్తే ఎక్కువ కష్టం అనుభవించాలి. తక్కువ చేస్తే తక్కువ కష్టం అనుభవించాలి. కష్టం వాడికీ వస్తుంది, వీడికీ వస్తుంది, కానీ ఇద్దరూ దేవుడిని ప్రార్థిస్తారు.

తక్కువ చేసిన వాడికి కొద్ది రోజుల్లోనే ఆ కష్టం పోతుంది. వీడు నేను దేవుడిని ప్రార్థించాను అందుకే నా కష్టం పోయింది, ఆయన అనుగ్రహించాడు, ఆయన దయ వల్ల నాకు కష్టం పోయింది అని ఆయన మీద ఇంకా నమ్మకం పెంచుకుంటాడు. అదే ఎక్కువ చేసిన వాడు ఎంత ప్రార్థించినా, వీడిలాగా ఏం చేసినా పోదు, వాడు నిరుత్సాహ పడతాడు.

ఒక్కొక్కసారి అది సంవత్సరాల తరబడి ఉంటే ఇంక ఆ దేవుడిని వదిలేసి కొత్త దేవుడిని ఆశ్రయిస్తాడు. ఆ మతాన్ని వదిలేసి కొత్త మతాన్ని

తీసుకుంటాడు. మరి దేవుడిని ఆరాధించడం వల్ల కోరిక తీరుతుంది అంటే దానికి కారణం ఇదే. ఇది చాలా మందికి అర్థం కాదు.

ఆయన ఎవ్వరి కోరికలూ తీర్చడు. కోరికలు తీర్చేవాడైతే అందరి కోరికలు తీరుస్తాడు. ఆయనకు అందరూ సమానమే! ఎవ్వరి మీద రాగద్వేషాలు ఉండవు. తన వాళ్ళ మీద అనురాగము, తనవాళ్లు కాదనుకున్న వాళ్ళ మీద ద్వేషము ఏమీ ఉండవు, ఆయనకు అందరూ ఒకటే అందరూ సమానమే. అంతా ఆయన రూపాలే కాబట్టి ఆయనలో ఏ రకమైన తేడా వుండదు.

ఆయన ఎవరు ఏది చేసుకుంటే అది పొందే ఏర్పాటు చేశాడు. అందుచేత పొందాలంటే కోరుకోవడం కాదు చేసుకోవాలి, చేసుకుంటే పొందొచ్చు. ఇది అర్థమైతే ఖచ్చితంగా ఆ భగవంతుని అభిప్రాయానికి అనుగుణంగా మీరు జీవిస్తారు, అలా జీవిస్తే ఖచ్చితంగా లాభం పొందుతారు, అందుచేత దేవుడు కోరికలు తీర్చడు అని ఖచ్చితంగా చెప్పొచ్చు.

మీరు చూడండి ఇప్పుడు భూమ్మీద మీరు చూస్తే ఎందరో మానవులు ఉన్నారు, అందరూ ఆ భగవంతుని నమ్మేవారే. ఆయన గొప్పవాడు, శక్తివంతుడు, ఆయనకి అందరూ సమానమనే అంటూ ఉంటారు. మరి దేవుడుకి అందరూ సమానమైనప్పుడు అందరి జీవితాలు ఒకే రకంగా ఉన్నాయా? అంటే లేవు. అసలు ఒకరి జీవితానికి ఇంకొకరి జీవితానికి సంబంధం లేదు.

కొందరి దగ్గర కోట్లు ఉండి బాగా జీవిస్తున్నారు, కొంతమంది పూర్తిగా బికారుల్లా ఉండి అడుక్కుంటున్నారు, కొందరు బాధలతో, కష్టాలతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ఆరోగ్యంగా ఉన్నారు, కొంతమంది రోగాలతో ఉన్నారు. కొంతమంది మంచి తెలివి తేటలతో ఉన్నారు, కొంతమంది ఏ తెలివి తేటలు లేకుండా ఉన్నారు.

ఒకరికి చదువు వస్తుంది, ఇంకొకరికి చదువు రాదు. ఒకరికి మంచి ఉద్యోగం ఉంది, ఇంకొకరికి ఉద్యోగమే లేదు. ఒకరికి మంచి హోదా ఉంది,

ఇంకొకరికి మంచి హోదా లేదు. ఒకరికి పదవి ఉంది, ఇంకొకరికి పదవి లేదు. ఒకరు పాటలు పాడడంలో నైపుణ్యం చూపిస్తారు, ఇంకొకరు ఆటల్లో నైపుణ్యం ప్రదర్శిస్తారు. ఇలా చూస్తే ఎన్నో రకాల తేడాలు కనిపిస్తున్నాయి.

కొంతమంది అంగవైకల్యంతో ఎన్నో లోపాలతో ఉన్నారు. మరి నిజంగా అటువంటి లోపాలు ఉన్నవాళ్ళు నాకు ఈ లోపాలు లేకుండా చేయమని కోరుకుని సరి చేసుకోవచ్చు కదా? ఎందుకు చేయలేరు? కొంతమందే ఎందుకు బాగున్నారు? అందరూ ఎందుకు బాగోలేదు? అందరూ మానవులేగా ఇన్ని తేడాలు ఎందుకు ఉన్నాయి? మరి దేవుడికి అంతా సమానం అయితే, దేవుడు అందరి కోరికలు తీరిస్తే ఇలాంటి తేడాలు ఎందుకు ఉంటాయి? అంటే దీన్ని బట్టి దేవుడు కోరికలు తీర్చట్లేదని మనం ఖచ్చితంగా చెప్పొచ్చు. అందుచేత మనం గతంలో చేసుకున్న దాన్ని బట్టే మన జీవితం ఆధారపడి ఉంది అని తెలుసుకోవాలి.

అందుకే "చేసుకున్న వాడికి చేసుకున్నంత మహాదేవా" అన్నారు కానీ "కోరుకున్న వాడికి కోరుకున్నంత మహాదేవా" అనలేదు. అంటే మంచి చేసుకున్న వాడికి మంచి జరుగుతుంది. చెడు చేసుకున్న వాడికి చెడు జరుగుతుంది కానీ ఏది కావాలంటే అది, ఎంత కావాలంటే అంత కోరి పొందే ఏర్పాటు లేదు. అందుచేత కోరితే దేవుడు అన్నీ ఇస్తాడు అన్న భ్రమల్లో ఉండద్దు.

ఉదాహరణకి మన అందరికీ ఏ.టీ.ఎం తెలుసు ఎనీ టైం మనీ. బ్యాంక్ ఏ.టీ.ఎం లోకి ఎవరైనా వెళ్ళొచ్చు. అక్కడ ఆ ఏ.టీ.ఎం లో కార్డు పెట్టి కావాల్సినంత డబ్బు తీసుకుంటుంటారు. మరి అందరూ తీసుకోగలరా అంటే? తీసుకోలేరు. బ్యాంకులో వీడి ఎకౌంట్లో డబ్బులు ఉంటేనే ఆ కార్డు పెట్టి ఎప్పుడైనా సరే డబ్బు తీసుకోగలరు. అంటే ఆ కార్డు కి అర్హత ఉండాలి. ఆ అర్హత ఉన్నవాడికే ఆ డబ్బు వస్తుంది. అర్హత లేకపోతే ఆ కార్డుకి డబ్బు

రాదు.

మరి రాలేదని అక్కడే కూర్చుని ఆ ఏ.టీ.ఎం ని పూజ చేస్తే వస్తుందా? అంటే రాదు. హారతి ఇస్తే వస్తుందా? అంటే రాదు. కొబ్బరికాయ కొడితే వస్తుందా? అంటే రాదు. ఎవరికి వస్తుంది? అంటే అర్హత ఉన్నవాడికి వస్తుంది. అంతే కాదు ఎంత అర్హత ఉంటే అంతే వస్తుంది. ఈ అర్హత ఎలా వస్తుంది అంటే? బ్యాంకులో డబ్బు వేసుకుంటే వస్తుంది. అంతకుముందు ఎంత వేసుకుంటాడో అంతే పొందే అర్హత ఉంది. అందుచేత వాడు అంతే తీసుకోవాలి. ఇది మరి బ్యాంకు వారు చేసినటువంటి ఏర్పాటు.

అంటే 5000 వేసుకుంటే 5000 వస్తుంది. 10,000 వేసుకుంటే 10,000 వస్తుంది. అంతేకానీ 5000 వేసి 10,000 రమ్మంటే రాదు. 5000 కు మించి ఒక్క రూపాయి రమ్మన్నా కూడా రాదు.

మానవుడి యొక్క మేధస్సుతో ఇటువంటిది ఏర్పాటు చేశారు. అక్కడ మేనేజర్ ఉండడు, క్యాషియర్ ఉండడు, అకౌంటెంట్ ఉండడు. ఎవ్వరూ లేకపోయినా 24 గంటల్లో ఏ టైంలో వెళ్ళినా డబ్బు వస్తూ ఉంటుంది. అలాంటి ఏర్పాటు చేశాడు.

ఏమండీ కొంచెం ఆలోచించండి మానవుడే ఇంత చేయగా లేనిది, ఏకంగా ఈ సృష్టినే నడిపిస్తూ సృష్టికి ఆధారమైన, సృష్టికి కారకుడైన అనంత శక్తి కలిగినటువంటి భగవంతుడు ఏర్పాటు చేయలేడా? ఖచ్చితంగా చేస్తాడు.

మరి మానవుడు ఒక బుల్లి ఏ.టీ.ఎం ఏర్పాటు చేస్తే భగవంతుడు అతి పెద్ద ఏ.టీ.ఎం ఏర్పాటు చేశాడు. ఈ భూమే ఒక ఏ.టీ.ఎం. ఈ భూమి మీద నువ్వు ఏది చేసుకుంటే అది పొందే ఏర్పాటు ఆయన చేశాడు. బ్యాంకులో డబ్బు వేసుకుంటే ఏ.టీ.ఎం లో తీసుకునే అర్హత వస్తుంది. ఈ భూమి అనే ఏ.టీ.ఎం లో చేసుకుంటే పొందే అర్హత వస్తుంది. ఏది చేసుకుంటే అది వస్తుంది. మంచి చేస్తే మంచి, చెడు చేస్తే చెడు, ఆనందం ఇస్తే ఆనందం

వస్తుంది.

మానవుని మేధస్సుతో ఏదో డబ్బు వరకే వాళ్ళు కనిపెట్టగలిగారు. కానీ భగవంతుడికి అఖండ మేధస్సు, అనంతమైన శక్తి కాబట్టి అన్నీ కలిపే ఏర్పాటు చేశాడు. అందుచేత ఎవరికి ఏది కావాలంటే అది పొందొచ్చు కానీ అది పొందాలి అంటే ముందు అర్హత వుండాలి. అర్హత ఎలా వస్తుంది అంటే చేసుకుంటే వస్తుంది.

చూడండి బ్యాంకు ఏ.టీ.ఎం లో మేనేజర్, ఎవరూ ఉండరు, ఇక్కడ కూడా అంతే భగవంతుడు ఉండవలసిన పనేమీ లేదు ఏర్పాటు అయిపోయింది. అందుచేత ఏ.టీ.ఎం కి కార్డు తీసుకెళ్తే డబ్బు తెచ్చుకున్నట్టే ఇక్కడ కూడా అర్హత సంపాదించి తెచ్చుకోవచ్చు.

అందుచేత సృష్టి నియమాలకు అనుగుణంగా ప్రవర్తిస్తే మీరు లాభం పొందుతారు. అలాకాకుండా గుడ్డిగా కోరికలు కోరితే నష్టపోతారు, నిరుత్సాహ పడతారు, ఆ దేవుడి మీద కోపం పెరుగుతుంది, నమ్మకం కోల్పోతారు.

చాలామంది ఏదో చిన్న కష్టం రాగానే, చిన్న నష్టం జరగగానే నా కష్టం పోవాలని, నాకు నష్టం జరగకూడదని, నా జీవితం సాఫీగా ఉండాలని దేవుని ప్రార్థిస్తారు కోరుకుంటూ ఉంటారు. మరి మనకి వచ్చే ఇబ్బందుల గురించి దేవుడికి మీరు చెప్తే కానీ తెలియదా అంటే? మీరు చెప్పినా చెప్పకపోయినా మీ కష్టాల గురించి, మీ నష్టాల గురించి, మీ ఇబ్బందుల గురించి ఆయనకి తెలుసు.

ఇక్కడ మీరు చేయవలసింది ఏమిటంటే అసలు మీకు ఆ కష్టాలు ఎందుకు వచ్చాయి? ఆ ఇబ్బందులు ఎందుకు వచ్చాయి? అన్నది తెలుసుకోవాలి. ఆ కష్టాలు ఎలా వచ్చాయి అంటే?

ఆయన చేసిన ఏర్పాటు ప్రకారం వచ్చాయి. మరి అలాంటి ఏర్పాటు ఎందుకు చేశాడో! అలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నాడో! ఆలోచిస్తే

తెలుస్తుంది.

భగవంతుని సృష్టిలో అంతా న్యాయమే కానీ అన్యాయం ఉండదు, అంతా లెక్క ప్రకారమే జరిగిపోతుంది. సృష్టిలో ఏది జరుగుతున్నా ఆయన చేసినటువంటి ఏర్పాటును బట్టే జరుగుతుంది. అది ప్రత్యేకించి ఒకరిని ఉద్దేశించి చేసేది కాదు. అందుచేత భగవంతుని సృష్టిలో ఏది జరిగినా అంతా మన మంచికే అని తెలుసుకోవాలి, ఇది జ్ఞానం ఉన్నవాళ్ళకి అర్థమవుతుంది, అజ్ఞానులకి అర్థం కాదు.

కష్టాలు, రోగాలు, బాధలు వస్తే అవి నాకు మంచి ఎలా అవుతాయండి? అంటారు, ఎంతో బాధపడతారు. కానీ ఆ భగవంతుని నిర్ణయాన్ని అందరూ గౌరవించాలి విమర్శించకూడదు. అవి ఎంత బాధని కలిగించేవైనా సరే అంతా మంచికేనని తెలుసుకోవాలి. ప్రతిదానికి ఏదో ఒక కారణం ఉంటుంది అని తెలుసుకోవాలి.

మీరు కొంచెం ఓపికతో ఎదురు చూడాలి. ఆత్మజ్ఞానులు ఎదురు చూస్తారు, అజ్ఞానులు భగవంతుని నిర్ణయాన్ని విమర్శిస్తూ ఉంటారు. మరి దేవుడు ఇలా చేసినా మళ్ళీ ప్రార్థిస్తున్నారు అంటే దేవుడు మంచివాడనేగా! మరి మంచివాడైనప్పుడు ఇలా ఎందుకు చేస్తాడు? కొంచెం ఆలోచించాలిగా! ఏం జరిగినా మన మంచికే అనేది మనకి అర్థమవ్వడం కోసం పత్రి గారు "చైనాలో ఒక రైతు కథ" కూడా చెప్పారు.

ఒక రైతుకి ఒక గుర్రం ఉండేదట. ఆ గుర్రం ఒక రోజు తప్పించుకుని ఆ ప్రక్కనే ఉన్న అడవిలోకి వెళ్ళిపోయిందట. అడవిలోకి వెళ్ళిపోయినా ఆ రైతు కొంచెం జ్ఞాని కావడం వల్ల దాని గురించి పెద్దగా పట్టించుకోలేదు, బాధపడలేదు. కానీ ఊళ్లో వాళ్ళంతా వచ్చి ఏమిటి నీ గుర్రం వెళ్ళిపోయిందా? ఎంత దురదృష్టం! ఎంత నష్టం జరిగింది! అన్నారట. వాళ్ళు ఎన్ని అన్నా కూడా ఆయన ఏమీ బాధపడలేదు.

10, 15 రోజులు అయ్యేసరికి ఆ వెళ్ళిపోయిన గుర్రం ఇంకో 10

గుర్రాలతో ఆయన ఇంటికి వచ్చిందట. అప్పుడు కూడా ఆ రైతు సంబరపడలేదు, ఎగిరి గంతేయ లేదు. ఒక గుర్రం పోయింది అనుకున్నాను, నాకు 10 గుర్రాలు వచ్చాయి అని ఏమీ అనుకోలేదు, ఇది కూడా ఎందుకో జరిగింది అని మామూలుగానే ఉన్నాడు.

మళ్లీ ఆ చుట్టూ ఉన్న స్నేహితులు, రైతులు అంతా వచ్చారు. అందరూ ఏమన్నారంటే? ఒరేయ్ నువ్వు నష్టపోయావు అనుకున్నాం, నువ్వు నిజంగా నష్టపోలేదు. ఇంకా ఎక్కువ లాభం పొందావు. మాకు ఒక్కొక్క గుర్రమే ఉంది. నీకు ఇప్పుడు 10 గుర్రాలు అయ్యాయి అన్నారు. అయినా సరే ఆయన ఏమీ మాట్లాడలేదు.

ఇలా ఉంటూ ఉండగా కొన్నాళ్ళకి ఆ కొత్తగా వచ్చిన గుర్రాల్లో ఒక గుర్రాన్ని ఎక్కి ఈ రైతు కొడుకు స్వారీకి వెళ్ళాడట. స్వారీకి వెళ్ళి ఆ గుర్రం మీద నుంచి పడి కాలు విరగ్గొట్టుకున్నాడు. ఆ రైతుకి భగవంతుని నిర్ణయం మనం గౌరవించాలన్న సంగతి తెలుసు కాబట్టి, జ్ఞాని కాబట్టి ఏం మాట్లాడలేదు.

కానీ ఈ సంగతి తెలిసిన ఊళ్లో వాళ్ళంతా వచ్చి ఏదో పది గుర్రాలు వచ్చాయని నువ్వేదో అదృష్టవంతుడు అనుకున్నాం, గుర్రాలు వస్తే ఏమిటి ఉపయోగం! ఇప్పుడు నీ కొడుకు కాలే విరిగిపోయింది కదా! ఇంతకన్నా నష్టం ఏముంది అని అన్నారట. అయినా కూడా రైతు ఏమీ మాట్లాడలేదు.

కొన్నాళ్ళకి ఆ రాజ్యానికి యుద్ధం వచ్చింది. రాజుగారు ఆ రాజ్యంలో ఉన్నటువంటి యువకుల్ని అందరినీ సైన్యంలోకి తీసుకుపోయారు. రైతు ఉండే ఊరిలో కూడా అందరినీ తీసుకెళ్ళారు. కానీ ఈ రైతు కొడుకుకి కాలు విరగడం వల్ల వీడు యుద్ధానికి పని చేయడని వాడిని వదిలేసి మిగతా అందరినీ తీసుకెళ్ళారు. అప్పుడు కూడా ఇది ఎందుకు జరుగుతుందో అని ఆయన మాట్లాడలేదు.

కానీ మళ్లీ రైతు స్నేహితులు అంతా వచ్చి ఒరేయ్ నీ కొడుకు కాలి

విరిగింది, మా కొడుకులు ఎంతో బాగున్నారని నువ్వు దురదృష్టవంతుడివి అనుకున్నాం కానీ, ఇప్పుడు మా కొడుకుల్ని యుద్ధంలోకి తీసుకుపోయారు. వారు బ్రతికుంటారో చస్తారో కూడా మాకు తెలియదు. నీ కొడుకు హాయిగా నీ దగ్గర ఉన్నాడు. ఆ కాలు విరగడం వల్ల నీకు మంచే జరిగింది అన్నారు. మరి ఈ కథ చూస్తే ఏది జరిగినా మన మంచికే అన్నది మనకి అర్థమవుతుంది.

ఇది మనం అర్థం చేసుకుంటే భగవంతుడి నిర్ణయాన్ని సంతోషంగా స్వీకరిస్తాం, విమర్శించం, తిట్టం. ఆయన ఎప్పుడూ తప్పు నిర్ణయం చేయడు. అంతా మంచికే అన్నది మనం కొంచెం జ్ఞానం సంపాదించుకుంటే అర్థమవుతుంది.

మరి పురాణాల్లో కూడా చెప్పబడినటువంటి ఇంకొకక కథ తెలుసు కుందాం. ఒక రాజుగారు ఒక పండు కోస్తున్నారు. కోస్తూ ఉంటే పొరబాటున ఆయన వేలు తెగి చాలా రక్తం వచ్చింది. ఆ వేలుకి కట్టేదో కట్టారు. రాజు బాధపడుతుంటే ప్రక్కనే మంత్రిగారు బాధపడకండి ఏది జరిగినా మంచికే అన్నాడు. రాజుగారికి చాలా కోపం వచ్చింది, ఏమిటి నా వేలు తెగి ఇంత బాధపడుతుంటే ఇది నా మంచికే అంటావా? అని ఆ మంత్రి మీద కోపం వచ్చి వీడిని తీసుకెళ్లి జైల్లో పెట్టండి అన్నాడు, మంత్రిని జైల్లో పెట్టారు. జైల్లో పెడితే ఇది కూడా ఒకందుకు మంచిదే అని అన్నాడు, రాజుకి ఇంకా కోపం వచ్చింది.

ఇలా ఉంటూ ఉండగా ఒకసారి రాజుగారు వేటకి వెళ్ళారు. ఆ వేటకి వెళ్ళినప్పుడు సైన్యానికి దూరంగా ఈయన ఒక్కడే విడిపోయాడు. అప్పుడు ఆ అడవిలో ఉన్నటువంటి కోయవాళ్ళు ఏదో నరబలి ఇద్దామని చూస్తుంటే రాజుగారు చాలా పుష్టిగా, బాగా కనిపించాడు. సరే రాజుని బలి ఇద్దామని తీసుకెళ్ళారు. తీరా అక్కడికి తీసుకెళ్లి బలిచ్చే సమయానికి వాళ్లకి ఆయన వేలికి ఉన్న కట్టు కనిపించింది. అది చూసిన వాళ్ళు ఇలాంటి వాడిని మనం

బలి ఇవ్వకూడదు. ఇటువంటి వాళ్ళు బలి ఇవ్వడానికి పని చేయరు అని చెప్పి ఆయన్ని వదిలేశారు.

అలా రాజు రాజ్యానికి వచ్చాక అప్పుడు “ఏది జరిగినా మన మంచికే” అని మంత్రి అన్నమాట అర్థమయింది. ఇప్పుడు ఈ దెబ్బ తగలడం వల్లే కదా వాళ్లు నన్ను ప్రాణాలతో వదిలేశారు. కనుక ఇది నా మంచికే జరిగింది అని అర్థం చేసుకొని వెంటనే మంత్రి గారిని జైలు నుంచి పిలిపించాడు. పిలిపించి నువ్వు చెప్పింది కరెక్టే ఇది నా మంచికే జరిగింది. కానీ నిన్ను జైల్లో పెట్టడం వల్ల నీకు జరిగిన మంచి ఏమిటి? అని అడిగాడు.

అప్పుడు మంత్రి గారు మీరు నన్ను జైల్లో పెట్టారు కాబట్టే ఒక్కరే అడవికి వెళ్ళారు. నన్ను జైల్లో పెట్టకపోతే నేను ఖచ్చితంగా మీ కూడా ఉండేవాడిని. వాళ్లు మన ఇద్దరిని పట్టుకునేవారు. మీకు వేలు తెగింది కాబట్టి మిమ్మల్ని వదిలేశారు. కానీ నేను అంతా బాగానే ఉన్నాను కాబట్టి నన్ను బలిచ్చేవారు. ఇలా మీరు నన్ను జైల్లో పెట్టడం వల్లే నేను జీవించి ఉన్నాను. మరి ఇది నాకు మంచిదే కదా! అన్నాడు. అప్పుడు రాజు అంగీకరించాడు ఏది జరిగినా మన మంచికే అని.

ఇటువంటి విషయాలు తెలుసుకోవాలనే, గ్రహించాలనే పెద్దలు ఇలాంటి కథల ద్వారా చెప్పారు. అందుచేత ఏదైనా కష్టం వస్తే ఊరికే ఏడుస్తూ కూర్చోవడం కాదు. ఏదైనా మంచికే అని తెలుసుకోవాలి. రోగం వచ్చింది, ఒక కష్టం వచ్చింది దాంట్లో నుంచి నువ్వు కొంత నేర్చుకుంటావు, అనుభవం పొందుతావు అది నీకు ఎంతో లాభం కలిగిస్తుంది.

పత్రి గారు చెప్పారు ఒక ఆమెకి బిడ్డ పుట్టిన వెంటనే చనిపోతే అందులో మంచి ఏమిటి అని అనుకుంటారు? అలా పోవడం వల్ల ఆవిడ ఎందుకు ఇలా జరిగిందని ఎంతో విచారణ చేస్తుంది. దాని నుంచి ఎంతో నేర్చుకుంటుంది, ఎన్నో తెలుసుకోవడానికి ప్రయత్నం చేసి తెలుసుకుంటుంది,

అది ఆవిడకి మంచిదే. అందుచేత అన్నిటిని భగవంతుడికి వదిలేయాలి, ఆయన నిర్ణయాన్ని గౌరవించాలి.

భగవంతుడి నిర్ణయాన్ని కాదని కోరికలు కోరితే ఏం జరుగు తుందో? ఎంత నష్టపోతామో? ఈ కథ ద్వారా తెలుసుకుందాం.

ఒక ఊరిలో ఇద్దరు దంపతులు ఉన్నారు. వాళ్ళకి పాపం ముక్కులు చాలా తప్పడగా వుంటాయి. అసలు ముక్కు ఉండదు, ఊరికే రంధ్రాలు ఉంటాయి అంతే. అందరూ వాళ్ళ ముక్కులను చూసి ఏమిటి వీళ్ళు ఇలా ఉన్నారు అని నవ్వేవారు! అప్పుడు ఆ దంపతులు అందరూ బాగున్నారు మా పరిస్థితే ఇలా ఉంది, భగవంతుడికి మాపై దయ లేదు, భగవంతుడు మమ్మల్ని ఎందుకిలా పుట్టించాడు? అని చాలా బాధపడేవారు.

అప్పుడు ఎలాగైనా అందులోనుంచి బయటపడాలని, ఏ భగవంతుడు అయితే మనల్ని ఇలా చేశాడో ఆ భగవంతుడినే మనం ప్రార్థిద్దాం, తపస్సు చేద్దాం అని చెప్పి వాళ్ళు ప్రక్కనే ఉన్న అడవికి వెళ్లి తపస్సు చేశారు. వాళ్ళ కోరిక బలమైంది కాబట్టి గట్టిగా చేశారు. అప్పుడు దేవుడు ప్రత్యక్షమై ఏమిటి మీ కోరిక అన్నాడు?

అప్పుడు వాళ్ళు మాకు ఈ ముక్కులు కాదు, మంచి ముక్కులు కావాలి అన్నారు. ఆయన తథాస్తు అన్నాడు. తీరా ఇంటికి వెళ్లి చూస్తే వాళ్ళకి ఒళ్ళంతా ముక్కులే. వాళ్ళు అడగడం మాకు ఒక్కొక్కళ్ళకి మంచి ముక్కు ఇవ్వండి అని అడగాలి. కానీ మాకు ఈ ముక్కులు వద్దు మంచి ముక్కులు కావాలన్నారు. మరి ఇప్పుడు ఒళ్ళంతా ముక్కులే. అవి చూసి అందరూ ఇంకా ఎక్కువ నవ్వడం మొదలు పెట్టారు.

అప్పుడు ఇంకా అవమానం పొందారు. వీళ్ళు మళ్లీ బాధపడి ఇదేంటి దేవుడు ఇలా చేశాడు అని అనుకుంటూ మళ్లీ వెళ్లి తపస్సు చేశారు. చేస్తే దేవుడు మళ్లీ ప్రత్యక్షమయ్యాడు. మరి ఈ సారి ఏమని కోరుకున్నారంటే?

మాకు ఈ ముక్కులు వద్దు అని వరం కోరారు. ఆయన కాదంటాడా? తథాస్తు అన్నాడు. తథాస్తు అనగానే వీళ్ళ ముక్కులన్నీ పోయాయి. అంతకు ముందు ఉన్న ఒక్క ముక్కు కూడా పోయింది.

మరి ఇప్పుడు ముక్కు లేక ఊపిరాడట్లేదు, నోటితో గాలి పీల్చు కోవడానికి చాలా ఇబ్బంది వచ్చింది. ఈ బాధపడలేక మళ్లీ తపస్సు చేసారు. దేవుడు ప్రత్యక్షం అయితే చివరికి మహాప్రభూ మాకు ఏ ముక్కులూ వద్దు మా పాత ముక్కులే మాకు ఇవ్వండి అన్నారు. మరి దేవుడు చేసిన నిర్ణయాన్ని వీళ్ళు గౌరవించి ఉంటే ఈ గొడవ అంతా ఉండేది కాదు కదా?

అది అర్థం చేసుకోకుండా ఇంకా గొప్పది ఏదో పొందొచ్చు అని అనుకుంటే, ఏదో కోరుకుంటే నష్టపోయేది మీరే. ఆ సృష్టికర్త అన్నీ ఆలోచించే చేస్తాడు. ఎవరికి ఏది ఇవ్వాలో, ఎవరికి ఏది ఇవ్వకూడదో ఆయనకి అన్నీ తెలుసు. ఆయన నిర్ణయాన్ని గౌరవించి, దానికి అనుగుణంగా జీవించే ప్రయత్నం మనం చేయాలి కానీ ఊరికే అది కావాలి ఇది కావాలి అని కోరితే చివరికి మీరే నష్టపోతారు. అందుకే మీరు ఎప్పుడూ కూడా భగవంతుని నిర్ణయాన్ని విమర్శించకూడదు, కోరరాని కోరికలు కోరకూడదు. కోరితే నష్టపోయేది మీరే అని తెలుసుకోవాలి.

## "ఉన్నదానితో తృప్తిపడాలి"

అలాగే భగవంతుని నిర్ణయాన్ని కాదని మీరు కోరుకుంటే ఎలా నష్టపోతారో ఇంకొక కథ ద్వారా తెలుసుకుందాం

ఒక ఊరిలో చాలా పేదవాడు వున్నాడు. వాడు ఈ పేదరకం పోవడం కోసం తపస్సు చేస్తే ఆ దేవుడు ప్రత్యక్షమై ఏం కావాలి అంటే? నేను ఏది ముట్టుకున్నా బంగారం అయిపోవాలి అన్నాడు. ఓ.. తథాస్తు అన్నాడు. ఓ.. భలేగా ఉంది అనుకుంటూ మెల్లిగా ఒక టేబుల్ ముట్టుకున్నాడు బంగారం అయిపోయింది. ఒక కుర్చీ ముట్టుకున్నాడు బంగారం అయిపోయింది, ఇలా

అన్నిటినీ బంగారం చేశాడు.

కాసేపటికి వీడికి ఆకలి వేసి భోం చేద్దాం అని కంచం ముట్టుకుంటే అదీ బంగారం అయిపోయింది. అన్నం ముట్టుకుంటే అన్నం, కూర ముట్టుకుంటే కూర బంగారం అయిపోయాయి. ఇదేంట్రా బాబు తినడానికి కూడా లేకుండా అయిపోయింది నా బ్రతుకు అని మళ్లీ తపస్సు చేసి నాకు ఇలాంటి వరం ఏమీ వద్దు, నాకు ఇదివరకు జీవితమే ఇవ్వండి, నాకు అది చాలు, అప్పుడే బాగుంది. ఇప్పుడు ఏ వరం వచ్చినా నాకేమి ఉపయోగం లేకుండా పోయింది అని మళ్లీ పాత జీవితమే కోరాడు.

అలాగే ఉన్నదానితో తృప్తి పడకుండా అత్యాశకు పోతే వచ్చే నష్టమేమిటో ఒక కథ ద్వారా తెలుసుకుందాం.

అలాగే ఇంకొక పేదవాడు ఏం చేశాడంటే వాడి ఇంటికి ఎవరో స్వామీజీ వస్తే ఆయన్ని కూర్చోబెట్టి, సపర్యలు చేసి, భోజనం పెట్టి ఆయన్ని చాలా సంతోష పెట్టాడు. ఆ స్వామీజీ నాకు ఇవన్నీ చేశావు నాకు చాలా సంతోషంగా ఉంది. నీవు ఏదైనా ఒక కోరిక కోరుకో ఇస్తాను అన్నాడు. అప్పుడా పేదవాడు నేను ఏది కోరుకుంటే అది బంగారం అయ్యేట్టు, నా పేదరికం పోయేటటువంటి వరం ఏదైనా ఇవ్వండి అన్నాడు.

అప్పుడు ఆయన ఒక దండం ఇచ్చాడు. ఈ దండాన్ని నువ్వు దేనికి తగిలిస్తే అది బంగారం అవుతుంది, నీ కరువు తీరిపోతుంది అంటే వాడు చాలా సంతోషించాడు. అయితే ఇది ఆరు మాసాలే పనిచేస్తుంది, ఆరు మాసాలు దాటితే దాని శక్తి కోల్పోతుంది అని స్వామీజీ చెప్పాడు. అప్పుడు పేదవాడు సరే స్వామి ఈ లోపల నా కరువు తీర్చుకుంటా అన్నాడు. స్వామీజీ వెళ్లిపోయాడు.

ఈ పేదవాడు ఒకటి రెండు ఇనప సామాన్లు ముట్టించాడు, అవి వెంటనే బంగారం అయిపోయాయి చాలా సంతోషించాడు. వీడికి ఏమని అనిపించింది అంటే మన ఇంట్లో ఎక్కువ సామాన్లు లేవు కదా! బయట

బజార్లో ఎక్కువ ఇనుప సామాన్లు కొనుక్కుంటే వాటన్నిటిని మార్చుకోవచ్చు కదా! అని బయట బజార్లోకి వెళ్ళాడు. ఆ ఇనుప సామాన్లు అమ్మేవాడు నాయనా ఇప్పుడు ఇనుము కొంచెం రేటు ఎక్కువగా ఉంది, నువ్వు ఒక నెల పోయిన తర్వాత వస్తే నీకు బాగా రేటు తగ్గుతుంది అని చెప్పాడు.

ఆ పిచ్చివాడు పోనీలే ఇప్పుడు ఈ డబ్బుతో కొద్దిగా తెచ్చుకునే బదులు, కొన్నాళ్ళు ఆగితే అదే డబ్బుతో ఇంకా ఎక్కువ తెచ్చుకోవచ్చు కదా అని నెల ఆగాడు. మళ్లీ వెళ్లి అడిగితే ఇంకా తగ్గలేదు నాయనా ఇంకో రెండు మాసాలు పోవాలి అన్నాడు. ఎక్కువ తెచ్చుకుంటే ఎక్కువ బంగారం చేసు కోవచ్చనే ఆశతో అలాగే చూస్తూ ఉన్నాడు. చివరికి ఆరు మాసాలు అయిపోయింది.

వీడు ఇనుము తెచ్చి వాటిని ముట్టించినా అవి అలాగే ఉన్నాయి కానీ ఏమీ మారలేదు. అప్పుడే ఉన్నంత మట్టుకు బంగారం చేసుకుంటే బాగుండును, ఇనుమంతా కొనేసి అంతా మార్చేద్దాం అనుకున్నాడు, అత్యాశకు పోయి ఎంత నష్టపోయాను అని చాలా బాధపడ్డాడు.

ఇలా అక్కర్లేని కోరికలు కోరితే ఎంతో నష్టపోతారు. అందుచేత ఉన్నదానితో తృప్తి పడాలి. ఎవరైతే భగవంతుడు ఇచ్చిన దానితో తృప్తిపడి జీవిస్తూ.. అందులో కొంత లోక కళ్యాణం కోసం ఖర్చు పెడతారో వారి జీవితం ధన్యం అవుతుంది, అలా కాకుండా అత్యాశకు పోయి లేనిపోని కోరికలు కోరితే కొత్త కొత్త కష్టాల్లో పడతారు, ఇంకొక కథ చూద్దాం.

ఒక ఊరిలో ఒక రైతు ఉన్నాడు. ఆ రైతుకి 100 ఎకరాల పొలం ఉంది.. ఆ పనులన్నీ చేయించాలంటే పని వాళ్ళని పెట్టుకుని చేయించుకోవాల్సి వస్తుంది. వాళ్ళు సరిగ్గా వినరు, సమయానికి రారు. వీడు ఒక్కడే అయి పోయాడు. చాలా యాతన పడుతున్నాడు. ఏదో ఎకరమో, అర ఎకరమో అయితే వాడే చేసుకుని పాట్లు పడేవాడు. మరి 100 ఎకరాలు పనులు అవ్వాలంటే అవ్వట్లేదు.

అప్పుడు పొరుగూర్లో ఒక స్వామీజీ గారు ఉన్నారని ఎవరో చెప్తే వెళ్లి ఆయన కాళ్ళ మీద పడి నా పరిస్థితి ఇలా ఉందండి. నా పనులు తేలిగ్గా చేసుకునే మార్గం ఏదైనా చెప్పండి అన్నాడు. అప్పుడు ఆ స్వామీజీ బాబు నీకు ఈ ఇబ్బంది తొలగడానికి ఒక వరం ఇస్తాను అని ఒక రాక్షసుడిని సృష్టించాడు. వీడు నువ్వు ఏ పని చెప్పినా, ఎంత పనైనా సరే చాలా తేలిగ్గా చేసేస్తాడు. వీడు నువ్వు చెప్పిన పనులు చేస్తాడు కానీ ఒక షరతు అన్నాడు.

అది ఏమిటంటే? నువ్వు పని చెప్పకపోతే మాత్రం వాడు ముందు నిన్ను తినేస్తాడు అన్నాడు. అదేం లేదు లేండి నాకు బోలెడు పొలం ఉంది. పని చేసుకోలేక చస్తున్నాను, ఎన్ని రోజులు చేసినా తెమలట్లేదు నాకు అలాంటివాడు సరిపోతాడని వాడిని తీసుకెళ్ళాడు. వాడిని తీసుకు వెళ్ళి పొలం దున్నమన్నాడు. వీడేదో రెండు మూడు రోజులు దున్నుతాడు అనుకొన్నాడు. వాడు ఐదు నిమిషాల్లో తిరిగి వచ్చి దున్నేశా అన్నాడు. ఇంకేంటి పని అన్నాడు, మళ్లీ దానికి నాట్లు వేయమన్నాడు, అయిదు నిమిషాల్లో పూర్తి చేసి రాక్షసుడు మరల ఏం చేయాలి అన్నాడు.

అలాగే ఏమి చెబితే అవి వెంటనే చేసేస్తుంటే రైతుకి ఏమి చెప్పాలో అర్థం కాలేదు. చెప్పకపోతే రాక్షసుడు తినేస్తాడని మళ్ళీ స్వామి దగ్గకు వెళ్ళి కాళ్ళ మీద పడ్డాడు. నాకు ఏమీ వద్దు నా పాట్లు నేను పడతాను, రాక్షసుడి బారి నుంచి నన్ను కాపాడండి అని ఆ స్వామీజీని ప్రార్థించాడు. ఆ స్వామిజీ వాడికి ఒక ఉపాయం చెప్పాడు.

అప్పుడు ఆ రైతు ఇంటికి వెళ్ళి ఆ రాక్షసునితో ఒక పెద్ద తాటిచెట్టు చూపించి నేను చెప్పేదాకా ఆ చెట్టు ఎక్కి దిగుతూ వుండు అని పని చెప్పాడు. రాక్షసుడు అలా చేయలేక పారిపోయాడు. అప్పుుడు ఆ రైతు తాను చేయగలిగింది చేసుకుంటూ తృప్తిగా జీవించాడు. అందుచేత కోరికలకు బానిస కాకండి, కోరికలు అదుపు చేసుకోండి. ధ్యానం చెయ్యండి.

# కోరికల వల్ల నష్టాలు

కోరికలు అదుపు చేయ లేకపోతే చాలా నష్టపోతారు. కోరుకోవడం దానికోసం తీవ్రంగా ప్రయత్నం చేయడం, విఫలం అవుతే విపరీతంగా దుఃఖించడం జరుగుతుంది. అలా కాకుండా కోరికలనే అదుపు చేసుకొంటే ప్రశాంతంగా, సంతోషంగా వుంటారు.

యోగులు కోరికలని అదుపు చేసుకున్నవారు. వారు అవసరాలకు పరిమితం అవుతారు. జీవితంలో కూడు, గూడు, గుడ్డ, తోడు అన్నవే అవసరాలు. మానవుని అవసరాలకు సరిపడా సృష్టిలో ఇవ్వబడింది, కానీ కోరికలకు సరిపడా సృష్టిలో అమర్చబడలేదు.

భారతదేశంలో ఇప్పుడు చూస్తే 130 కోట్లు పైగా జనాభా వుంది. కానీ జనాభా పెరుగుతున్నా కూడా పంట భూమి పెరిగింది. పంట పెరిగింది. అలా అవసరాలకు తగ్గట్టుగా పెరగడం జరిగింది.

అంటే అవసరాలకి ఎప్పుడూ ఇబ్బంది ఉండదు అని తెలుసుకోవాలి. కానీ కోరికలు అదుపు చేసుకోలేకపోతేనే ఇబ్బందులు.

విచిత్రం ఏమిటంటే వారి పరిస్థితి వారికి నచ్చదు. ఎవరిని చూసినా ప్రక్కవాళ్ళని కంపేర్ చేసుకుని వాడిలా నాకు లేదు అనుకుంటూ వుంటారు. అలా వాడికి ఉన్నవన్నీ నాకు కావాలని కోరుకుంటూ, వారిలా నేను అవ్వాలని కోరుకుంటూ అంత ధనం ఉండాలని, అంత పేరు ప్రఖ్యాతలు ఉండాలని, మరి అంత వైభోగం ఉండాలని, వాడిలాంటి కార్లు ఉండాలి, వారిలాంటి బిల్డింగులు ఉండాలి అని కోరుకుంటూ వుంటారు.

కానీ  పరలోకంలో మీరు ఏమేమి నిర్ణయించుకున్నారో మీకు తెలియకపోవచ్చు గానీ మీకున్న ఆర్థిక స్థితి కానివ్వండి, కుటుంబం కానివ్వండి, భార్య కానీ, భర్త కానీ, పిల్లలు కానీ అన్నీ మీరు ముందు నిర్ణయించుకున్నవే.

చాలామందికి కొన్నాళ్ళు పోయేసరికి చేసుకున్న భార్య నచ్చదు, ఎంతసేపు ప్రక్కవాడి భార్య నచ్చుతుంది. కానీ అలాంటి భార్య ఉంటే బాగుండును అని లోపల కోరుకుంటారు.

అలా ఎంతసేపు ఎదుటి వారి లోపాలు చూస్తారు కానీ ఎదుటి వారిలో విశిష్టతలు చూడరు. సంసారం బాగుండాలి అంటే భాగస్వామిలో వున్నటువంటి విశిష్టతలు చూడగలిగితే సంసారం స్వర్గం అవుతుంది. భాగస్వామి భర్త అయినా భార్య అయినా వారిలో లోపాల మీదే మీరు దృష్టి పెడితే ఆ సంసారం నరకమవుతుంది.

ఒక కథ చూద్దాం. ఒక ఊళ్లో ఒక ఆవిడ వివాహం చేసుకుని అత్తవారి ఇంటికి వచ్చింది. భర్త బాగున్నాడు, బాగా చూసుకుంటున్నాడు, దేనికి లోటు లేదు. కానీ ఎక్కడ తేడా వచ్చిందంటే ఆవిడకి అత్తగారితో తేడా వచ్చింది. మెల్లి మెల్లిగా ఇద్దరికి అసలు పడేది కాదు. అది చివరికి తారా స్థాయికి వెళ్ళిపోయింది. అన్నిటికీ గొడవలే ఒకరినొకరు అనుకోవడం ఒకరి నొకరు తిట్టుకోవడం, ఇది చివరికి కోడలు చనిపోవాలి అని నిర్ణయించుకుంది.

ఆవిడ ఊరు బయటే ఓ గురువు గారు ఉన్నారు. ఒక్కసారి ఆయన దగ్గరికి వెళ్లి తన సమస్య చెప్పుకొని పరిష్కారం ఆయన్ను అడుగుదామని వెళ్ళింది.

అప్పుడు ఆవిడ గురువు గారి దగ్గరికి వెళ్లి ఆయన కాళ్ళ మీద పడి, ఏమండీ నా అత్తగారితో అసలు పడట్లేదు, ఇంట్లో ఉండలేకపోతున్నాను చచ్చిపోవాలని ఉందని చెప్పింది. అప్పుడు ఆ గురువుగారు ఇప్పుడు నీ కోరిక ఏమిటి? అని అడిగారు. ఏమి లేదండి నా అత్తగారిని వదిలించుకునే మార్గం ఏదైనా ఉంటే నాకు సెలవీయండి అని అంది.

అప్పుడు ఆయన చెప్పాడు నీ అత్తగారిని వదిలించుకోవాలంటే నువ్వు ఏ విషమో ఏదో పెట్టి చంపేస్తే అంతా అత్తగారిని విషం పెట్టి చంపేసింది అని అనుకుంటారు. అందుచేత నీకు మాట రాకుండా ఆవిడని వదిలించుకునే మార్గం చెప్తాను, నీకు ఒక మందు ఇస్తాను. ఈ మందు రోజూ ఆవిడకి కాఫీలోనో టీలోనో కొద్దిగా కలిపి రోజూ ఇస్తూ ఉండు.

కొన్నాళ్ళకి ఆవిడ మెల్లిగా చనిపోతుంది. ఒక్కసారి చనిపోతే నువ్వు

మందు పెట్టినట్టుగా ఉంటుంది.కానీ ఈ రకంగా చనిపోతే ఇబ్బంది వుండదు అని చెప్పాడు. ఆయన ఇంకా ఏమి చెప్పాడంటే నువ్వు ఆవిడతో గొడవ పడుతూ ఇస్తే ఏదైనా అనుమానం వస్తుంది కాబట్టి ఈ రోజు నుంచి నువ్వు ఆవిడతో ఇష్టం ఉన్నా లేకపోయినా ప్రేమగా ఆవిడను జాగ్రత్తగా చూసుకో అన్నారు. మందు ఇచ్చారు. ఆయన చెప్పిన కండీషన్ ఈ నెలంతా అత్తగారితో ప్రేమగా వున్నట్టు నటించాలి. అలాగే ఆవిడ ఇంటికి వెళ్ళిన తర్వాత ఈవిడ ప్రవర్తనలో మార్పు వచ్చింది.

అత్తగారు నేనే మీకు కాఫీ పెట్టిస్తాను అంటూ ఆ కాఫీలో మందు కలుపుతూ రోజూ ఇచ్చేది. చాలా ప్రేమగా ఉంటుంది, అన్నీ చూసుకుంటుంది. కోడలు 10 రోజులు ప్రేమగా ఉండేసరికి అత్తగారిలో కూడా మార్పు వచ్చింది. కోడలిని బాగా చూసుకోవడం మొదలయింది. ఇలా 20 రోజులు అయ్యేసరికి ఇద్దరి మధ్య మంచి సఖ్యత వచ్చింది.

ఇదివరకు ఇద్దరూ గొడవలు పడేవారు. ఇప్పుడు ఆ గొడవలు లేవు. మెల్లిగా నెల అయ్యేసరికి ఎటువంటి స్థితి వచ్చిందంటే ఒకరినొకరు విడి పోలేనటువంటి స్థితి వచ్చేసింది. ఆవిడేమో ఈవిడ్ని కూతురులా చూసు కుంటుంది. ఈవిడేమో ఆవిడ్ని తల్లిలా చూసుకుంటుంది. అంత బాగా అత్తగారు చూస్తున్నారు. ఈవిడకి నెల అవ్వగానే ఒక డౌట్ వచ్చింది. అరే బాగా చూసుకునే అత్తగారిని చంపుతున్నానే. ఇటువంటి అత్తగారు చావకూడదు. కానీ మందు ఇచ్చేశానే ఎలాగా? అనుకుంటూ అత్తగారు చావకూడదు, ఉండాలి అని పరిగెత్తుకుంటూ గురువు గారి దగ్గరికి వెళ్ళింది.

గురువుగారితో ఆవిడ రాక్షసి కాదండి చాలా మంచి ఆవిడ నన్ను చాలా బాగా చూసుకుంటుంది, ఆవిడ చావకూడదు. కానీ మీరు చెప్పినట్టుగానే మందు ఇచ్చేశాను, మరి ఆవిడ చచ్చిపోతే నా పరిస్థితి ఏమిటి? ఇలాంటి అత్తగారిని ఏదో రకంగా మీరే బ్రతికించాలి అంది. అప్పుడు ఆ గురువుగారు అమ్మ నువ్వు ఏం కంగారుపడకు, ఆవిడ ఏమి చావదు నేను ఆవిడకి బలం

మందు ఇచ్చాను అన్నారు. నీ సంసారంలో మార్పు రావడం కోసమే అలా చేసాను అన్నారు.

నువ్వు ఇదే రకంగా ఉన్నట్లయితే నీ సంసారం సాఫీగా సాగుతుంది. లోపము ఎదుటి వాళ్ళలో ఉండదు నీలోనే ఉంటుంది అన్నది తెలుసుకో అని ఆ గురువుగారు చెప్పారు.

అలాగే ఎవ్వరైనా సరే భార్య ప్రవర్తన బాగోలేదు అంటే నీలో ఎక్కడో ఏదో లోపం వున్నట్టు. దాన్ని సరిచేసుకునే ప్రయత్నం చేయండి. మీరు మీ భార్యని ప్రేమిస్తే మీ భార్య మిమ్మల్ని ఎందుకు ప్రేమించదు? అలాగే మీరు మీ భర్తని ప్రేమిస్తే, మీ భర్త మిమ్మల్ని ఎందుకు ప్రేమించడు. ఇది బాగా గుర్తుపెట్టుకోండి.

అందుచేత సృష్టిలో పురుషులు ఎంతమంది ఉంటారో స్త్రీలు అంత మందే ఉంటారు. వారు పైన నిర్ణయించుకున్న ప్రకారం వారికి ఎటువంటి భార్య రావాలో, ఎటువంటి భర్త రావాలో వాళ్లే ఎంచుకుంటారు. ఇలాంటి భార్యతో ఈ రకమైన అనుభవాలు, అలాంటి భర్తతో ఆ రకమైన అనుభవాలు పొందడం కోసం అలా నిర్ణయించుకొని వస్తారు. ఇది అర్థం చేసుకోవాలి. చేసుకున్నాక నేను కోరుకున్న భార్యలా ఈవిడ లేదు, నేను కోరుకున్న భర్తలా ఈయన లేడు, నా కోరిక తీరలేదు అని అనుకుంటారు అది మూర్ఖత. అందుకే కోరికలకు బానిస అవ్వకూడదు, అవసరాలకు పరిమితం అవ్వాలి. ఇక్కడ ప్రతీ ఒకరికి ఒక తోడు అవసరం. అలాగే ఫైవ్ స్టార్ మీల్స్ రోజూ అక్కర్లా, ఒక ప్లేట్ మీల్స్ వుంటే నీ అవసరం తీరిపోతుంది.

అవసరాలు ఏమిటో తెలుసుకోకుండా కోరికలు కోరితే అన్నీ ఇబ్బందులే అంతా నష్టమే. ఇది అర్థం కానివారు కోరికలు కోరుతూ వుంటారు. కోరి ఇబ్బందుల్లో పడతారు, కష్టాల పాలవుతారు, చేయకూడని పనులు చేస్తారు, తప్పులు చేస్తారు, పాపాలు చేస్తారు, అధర్మంగా వ్యవహరిస్తారు చివరికి వాటి వల్ల కష్టాలు తెచ్చుకుంటారు, ఎంతో నష్టపోతారు. కానీ ఇంత నష్టం ఎందుకు జరుగుతుంది? కోరికల వల్ల అని తెలుసుకోవాలి.

# దేవుడు కోరికలు తీరుస్తాడా?

చాలామంది ఉద్దేశం దేవుడిని కోరితే కోరికలు తీరిపోతాయని. మరి కొంచెం ఆలోచించండి. అందరూ దేవుడిని కోరేవాళ్లే! కానీ దేవుడు మానవుని కోరికలన్నీ తీర్చగలడా? ఒక్కసారి ఆలోచించండి. మీరు అనొచ్చు అనంత శక్తి స్వరూపుడు మన కోరికలు ఆయన ఎందుకు తీర్చలేడు అని.

పత్రి గారు అందుకే అంటారు ముందు బుద్ధి పెంచుకోండి ఏ పని చేసేటప్పుడైనా నీ బుద్ధి బాగా పని చేస్తే ఆలోచించి ఏది చేయాలో అది చేస్తావు, ఏది చేయకూడదో అది చేయవు. బుద్ధితో నువ్వు ఆలోచిస్తే దేవుడు మానవుల కోరికలు అన్నీ తీర్చగలడా? ఆయనకు ఆ శక్తి ఉందా? అన్నది అర్థమవుతుంది. ఎందుచేతనంటే కోరడం తేలిక, తీర్చడమే కష్టం.

కొన్ని ఉదాహరణలు చెప్తాను. నాకు చావు లేని వరం ఇవ్వమని తపస్సు చేసిన వారు అడుగుతారు. దేవుడు ఇవ్వగలడా? ఎందుకంటే పురాణాల్లో రాక్షసులు విపరీతమైన తపస్సు చేసి ఆ దేవుళ్ళను ప్రసన్నం చేసుకుని ప్రత్యక్షం చేసుకుంటారు. నీకేం వరం కావాలి కోరుకో నాయనా అంటే? నాకు చావు లేని వరం ప్రసాదించమని అడగడం జరుగుతుంది. అప్పుడు వాళ్ళ కోరిక దేవుడు తీర్చగలడా? అంటే లేదు కదా?

అది నా చేతిలో లేదు. అది తప్ప ఇంకేదైనా కోరుకో అని అనేవారు. మరి నిజంగా దేవుడు కోరికలు తీర్చే వాడు అయితే ఈ కోరిక ఎందుకు నా చేతిలో లేదు అన్నాడు? అంటే దీన్ని బట్టి అన్ని కోరికలు దేవుడు తీర్చలేడు అని అర్థమవుతుంది. ఇంకేదైనా కోరుకోమంటే వీళ్ళ తెలివి ఉపయోగించి కోరుకునేవారు. దేవతల చేత కానీ, మానవుల చేత కానీ, జంతువుల చేత కానీ, ఎవ్వరి చేత కూడా చావు లేని వరం ఇవ్వమనేవారు.

దేవుళ్ళు ఇచ్చేవారు వాడిని నరసింహావతారంతో వాడిని సంహ

రించడం. అలాగే ఇంకొకడు ఎవరి నెత్తి మీద నేను చెయ్యి పెడితే వాడు భస్మం అయిపోవాలి లాంటి వరం శివుడు ఇచ్చాడు. అప్పుడు వాడు నీవు ఇచ్చిన వరం పని చేస్తుందో లేదో ఒక్కసారి నీ నెత్తి మీదే చెయ్యి పెట్టి చూస్తాను అంటే శివుడు పారిపోయాడు.

అప్పుడు విష్ణుమూర్తి మోహిని రూపంలో వచ్చి మొత్తం మీద వాడి చేత నాట్యం చేయించి వాడి చెయ్యి వాడి నెత్తి మీద పెట్టేటట్టు చేసి వాడినే భస్మం చేశాడు. ఇలా ఎంతో మంది రాక్షసులు వాళ్ళ తెలివిని ఉపయోగించి ఎన్ని కోరుకున్నా చివరికి చనిపోవాల్సి వచ్చింది.

ఇంకా కొన్ని ఉదాహరణలు: కొంతమంది ముసలితనం రాకూడదు అని కోరుకుంటే ఆ వరం దేవుళ్ళు ఇవ్వగలరా? ఇది కూడా సృష్టి సిద్ధాంతానికి విరుద్ధమే! కారణం ఏ సృష్టికర్త అవుతే సృష్టిని సృష్టి చేశాడో సృష్టి చేసినప్పుడు కొన్ని నియమాలు పెట్టాడు. ఆ సృష్టికర్త నియమాల్ని ఏ దేవుళ్ళు ధిక్కరించలేరు, అతిక్రమించలేరు. ఏ దేవుళ్ళైనా సరే సృష్టి నియమాలను అనుసరించి ప్రవర్తించవలసిందే. మన భారతదేశ రాజ్యాంగం ప్రకారం చీఫ్ మినిస్టర్లు అయినా, ప్రైమ్ మినిస్టర్లు అయినా పని చేయవలసిందే తప్ప రాజ్యాంగాన్ని అతిక్రమించి ఎవరు ఏమి చేయలేరు. అలాగే ఆ సృష్టికర్త పెట్టినటువంటి ఆయా నియమాలకు విరుద్ధంగా ఏ దేవుడు కూడా ఏమి చేయలేడు.

అందుచేత గుర్తుపెట్టుకోండి దేవుడు కోరికలన్నీ తీర్చగలడా? అంటే తీర్చలేడు అన్నది అర్థంవుతుంది. మరి ఇంకా చూసుకుంటే ఎలక్షన్లు జరుగుతున్నాయి అనుకోండి మనం చూస్తున్నాం, ముగ్గురు, నలుగురు, ఐదుగురు, ఆరుగురు కూడా ఎలక్షన్లో నిలబడుతున్నారు. అందరూ వారికి నచ్చిన దేవుడిని నన్ను గెలిపించు స్వామి, నేను గెలిచేటట్టు చూడు స్వామి అని ప్రార్థిస్తారు. మరి నిజంగా అందరూ కోరుకుంటారు, అందరూ భక్తితోటే కోరుకుంటారు. మరి అందరిని ఆ దేవుడు గెలిపించగలడా? లేదు, అని

ఎవరైనా చెపుతారు.

కారణం ఒక్కడే గెలుస్తాడు కానీ నిలబడినోళ్ళంతా ఎలా గెలుస్తారు?. అందరూ ఎమ్మెల్యేలు అయిపోతారా? అంటే ఒక్కడే కదా అయ్యేది.

మరి దేవుని అందరూ కోరారుగా, అంటే దేవుడు అందరినీ నెగ్గించలేదు అన్నది మనకు అర్థమవుతుంది. అలాగే ఆ ఊర్లో నాకు 100 ఎకరాలు కావాలని అందరూ కోరుకుంటారు. అలా 100 ఎకరాలు అందరికీ ఇవ్వగలడా? దేవుడు ఎంత శక్తి స్వరూపుడైనా అసలు ఆ ఊరిలో వున్న పొలం 2000 ఎకరాలు. ఆ ఊరి జనాభా 3000. ఒక్కొక్కడికి 100 ఎకరాలు దేవుడు ఎక్కడి నుండి తెస్తాడు?

అలాగే నా ఇంట్లో సామాన్లన్నీ బంగారం అయిపోవాలి అని కోరుకుంటే? అయిపోతాయా? అలాగే అందరూ అంబానీలు అయిపోవాలను కుంటే అందరూ అయిపోతారా? ఆలోచించండి దేవుడు చేయగలడా? ప్రపంచంలో ఉన్నవాళ్ళంతా అంబానీలు ఉంటే పని చేసేవాడు ఎవరు ?

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. అందుచేత మానవుల కోరికలు తీర్చే శక్తి భగవంతునికి లేదని కచ్చితంగా చెప్పొచ్చు

అందుచేత దేవుని కోరితే మన కోరికలన్నీ తీరిపోతాయి అనుకోవడం మూర్ఖత. అందుచేత కోరికలు అదుపు చేసుకోవాలి? కోరికలకు పరిమితి ఉండాలి? ఎలాంటి కోరికలు కోరుకోవాలో తెలుసుకోవాలి? కోరికల్ని అదుపు చేసుకునే మార్గమే పత్రి గారు మనకు చెప్తున్నారు అదే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

ఇది అర్థం కావడానికి ఒక కథ చెప్పుకుందాం. పూర్వకాలంలో అంటే ఈ సృష్టి ఏర్పడక ముందు ఆ భగవంతుడు ఒక్కో జీవిని సృష్టించు కొచ్చాడు. ముందు వృక్ష జాతిని, తర్వాత క్రిమి కీటక జాతిని, తర్వాత పక్షి

జాతిని, తర్వాత జంతు జాతిని, సృష్టి చేసి ఆఖరిలో మానవజాతిని సృష్టించాడు.

అన్ని జాతులు సృష్టించినా కూడా ఆయనకి సంతృప్తి కలగలేదు. మానవజాతిని సృష్టించాక ఆయన చాలా సంతృప్తి పడ్డాడు. అబ్బా ఇప్పటికీ నేను అనుకున్నట్టు సృష్టి చేయగలిగాను, అద్భుతమైన మానవుని నేను సృష్టించగలిగాను. ఏ జీవిలోనూ లేని విశిష్టతలన్నీ మానవుల్లో ఉన్నాయి. ఏ జీవి కూడా సాధించలేనిది మానవుడు సాధించగలడు అటువంటి మానవుని సృష్టి నేను చేసాను అని అనుకున్నాడు.

ఎందుచేతనంటే ఏ జీవి దేవుడిగా ఎదగలేదు ఆ శక్తి ఒక్క మానవుడికే ఉంది. అలాంటి మానవుడిని నేను సృష్టించగలిగాను అని ఆయన చాలా సంబరపడ్డాడు. అందుచేత ఈ మానవులంతా ఎంతో సంతోషంగా సంబరాలు చేసుకుంటూ ఉంటారు అని అనుకున్నాడు.

ఆయన ఏమనుకున్నాడు అంటే వాళ్ళ యొక్క ఆనందాన్ని తాను ప్రత్యక్షంగా అనుభవించడానికి ఆయన భూమి మీదకి వెళ్లి వాళ్ళని అడిగి తెలుసుకుందాం అని అనుకున్నాడు. ఆయన భూమ్మీదకు వచ్చి ఒక మానవుని పిలిచాడు. నాయనా నిన్ను సృష్టించింది నేనే, మరి నా సృష్టి ఎలా ఉంది? సంతృప్తిగా ఉందా? అని అడిగాడు.

అప్పుడు వాడు ఆశ్చర్యపోయి ఏమండీ మమ్మల్ని సృష్టించిన మీరు కనిపిస్తే మాకు అంతకన్నా ఏం కావాలి? చాలా సంతోషంగా ఉంది కానీ ఒక్కటే లోపం వుందండి నాకు బట్టతల వుంది. కొంచెం జుట్టు ఉంటే బాగుంటుంది అన్నాడు .

ఓ అంతే కదా అని చెప్పి వాడికి జుట్టు ప్రసాదించాడు దేవుడు. సరే మళ్ళీ ఇంకోడి దగ్గరికి వెళ్ళాడు వాడి దగ్గరికి వెళ్తే ఏమయ్యా అన్నీ బాగున్నాయా? అంటే? అన్నీ బాగున్నాయి కానండి నేను కొంచెం నల్లగా ఉన్నాను తెల్లగా ఉంటే బాగుండు అన్నాడు. అంతేనా అని చెప్పి వాడికి

కూడా తెల్లని రంగు ఇచ్చి వాడి కోరిక తీర్చి మళ్ళీ ఇంకో చోటుకి వెళ్ళాడు.

ఇంకో చోటుకు వెళ్తే అక్కడ కూడా వాడు ఏమన్నాడంటే అన్నీ బాగున్నాయి కానండి నేను కొంచెం లావుగా ఉన్నాను కొంచెం సన్నగా ఉంటే బాగుంటుంది అన్నారు. ఓసి ఇదేనా అని చెప్పి వాడి కోరిక తీర్చి వెళ్ళాడు. ఇంకొకడు వేలు వంకర అన్నాడు, ఇంకొకడు కాలు వంకర అన్నాడు, అలా ఒకడు అది, ఒకడు ఇది లేదు అన్నారు. ఇంకొకడు నా గొంతు బాగాలేదు అంటాడు. ఇంకోడు నా కన్ను సరిగ్గా లేదు అంటాడు. ఇలాగ ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క లోపం చెప్తున్నారు. ఈ విషయం మొత్తం ఆ ఊర్లో అందరికీ తెలిసిపోయింది. దేవుడు వచ్చి వారిలో ఉన్న లోపాలన్నీ సరిచేస్తున్నాడని తెలుసుకుని ఆ ఊరిలో ఉన్న జనమంతా తండోప తండాలుగా దేవుడి దగ్గరికి వచ్చారు, వచ్చి నాకు అది లేదు ఇది లేదు అంటూ కోరడం మొదలుపెట్టారు.

దేవుడికి బుర్ర తిరిగి పోయింది. ఏంట్రా బాబు వీళ్ళు ఎంతో సంతోషిస్తారు అని అనుకుంటే చివరికి ఏదో ఒక లోపం చెప్తూ ఉన్నారు. నేను సృష్టి చేసినా వీళ్ళు ఎవరికీ తృప్తి లేదు వీళ్ళ కోరికలు తీర్చడం నా వల్ల కాదు అని చెప్పి ఆయన పారిపోయాడు.

వాళ్ళ పాట్లు వాళ్ళే పడాలి వీళ్ళ కోరికలు తీర్చి వీళ్ళని సంతృప్తి పరచాలంటే ఎవరి వల్ల కాదు, వీళ్ళ కోరికలు చూస్తుంటే నాకే ఆశ్చర్యం వేస్తుంది అని పారిపోయాడు. ఆయన పారిపోయి ఓ గుహలో దాక్కున్నాడు.

దాక్కుంటే మానవులు అందరూ వెళ్లి మొత్తం మీద ఆయన్ను పట్టేశారు. పట్టేస్తే అమ్మ బాబోయ్ అని ఒక కొండ మీదకి వెళ్లి దాక్కున్నాడు. అక్కడికి వెళ్తే అక్కడ పట్టేసుకున్నారు. ఒక సరస్సులోకి వెళ్లి దాక్కున్నారు అక్కడికి వెళ్తే అక్కడ పట్టేశారు.

ఇలా చూస్తే వదలట్లేదు వీళ్ళు దేవుడు వచ్చాడు దేవుడిని మనం పట్టుకుంటే మన కోరికలు తీరిపోతాయని ఎక్కడున్నా వీళ్ళు మొత్తం మీద

పట్టేసుకుంటున్నారు. అప్పుడు దేవుడు బాగా ఆలోచించాడు. వీళ్ళ బాధ నుంచి తప్పించుకోవాలంటే ఒక తెలివైన ఉపాయం ఆలోచించాలి లేకపోతే వీళ్ళు నన్ను వదలరు అని ఆయన ఆలోచించాడు? భూమిమీద ఎక్కడున్నా కూడా వీళ్ళు పట్టేస్తారు, వీళ్ళు పట్టుకోకుండా ఉండాలి అంటే వీళ్ళల్లోనే నేను దాక్కుంటే వీళ్ళు నన్ను ఎలా పట్టుకుంటారు? అని మానవుల శరీరంలో దాక్కున్నాడు. పిచ్చోళ్లు బయట వెతుకున్నారు. కానీ ఎవ్వరూ లోపల వెతకలేదు. ఆయన వారి లోపల దాక్కుని ఒక నిర్ణయం చేసుకున్నాడు.

ఎవరైతే కోరికలున్నీ వదిలేసి తన కోసం ప్రయత్నం చేస్తారో వారికి కనిపించాలి అని అనుకున్నాడు. కోరికలతో ఉన్న వాళ్ళెవరికీ కనిపించ కూడదు అని చెప్పి అనుకొన్నాడు. అలా మానవులు అన్ని చోట్లా అంటే కాశీ, జెరూసలేం, మక్కా, తిరుపతి, శ్రీశైలం ఇలా అన్నీ తిరుగుతున్నారు.

కానీ ఎక్కడా దేవుడు లేడు, వీళ్ళకి కనిపించట్లేదు. ఎన్ని యుగాల నుంచి వెతుకుతున్నా ఆయన బయట ఎవరికీ దొరకలేదు? కారణం ఆయన బయట లేడు, మానవుని లోనే ఉన్నాడు. అందుచేత దేవుని పట్టుకోవాలంటే బయట తిరగడం కాదు తనలోకి వెళ్ళాలి. అది వీళ్ళకి తెలీదు తనలో ఉన్నాడు అన్న సంగతి తెలియక అక్కడున్నాడు, ఇక్కడ ఉన్నాడు అంటూ అన్ని తిరుగుతున్నారు.

ఆయన ఏ గొడవ లేకుండా నిశ్చింతగా సాక్షీభూతంగా వారిలోనే ఉన్నాడు. కానీ ఎవరైతే మేధస్సుతో, తమ జ్ఞానంతో, తమ బుద్ధితో ఈ విషయం తెలుసుకొని కోరికలు లేకుండా అంతరంలోకి వెళ్ళగలుగుతారో ఆ దేవుడు కనిపిస్తాడు, ప్రత్యక్ష మవుతాడు, సాక్షాత్కారం అవుతాడు. కానీ ఇక్కడ ఒక కండిషన్ పెట్టాడు ఏమిటంటే కోరికలు, సంకల్పాలు లేకుండా వెళ్ళాలి. మరి అలా అంతరంలోకి వెళ్ళగలిగే మార్గమే బ్రహ్మర్షి పత్రి గారు మనందరికీ చెప్పడం జరిగింది అదే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

ఈ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ద్వారా మీ లోపలికి వెళ్లి ఆ దైవాన్ని దర్శించవచ్చు. ఎవరైతే కోరికలు, సంకల్పాలు లేకుండా ధ్యానం చేస్తారో ఖచ్చితంగా వాళ్ళు ఆ దేవున్ని ప్రత్యక్షం చేసుకుంటారు, జన్మని ధన్యం చేసుకుంటారు. వాళ్ళకి ముక్తి, అంటే జన్మ లేని స్థితి పొందగలుగుతారు.

"శ్వాస మీద ధ్యాస" తప్ప ఇంకేం చేసినా అంతరంలోకి వెళ్ళలేరు, ఆ దైవాన్ని దర్శించలేరు అందుచేత ఇది ఒక్కటి ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకోండి చాలా మంది "శ్వాస మీద ధ్యాస" ఎందుకు అంటారు, కానీ ఎన్ని చేసినా దైవాన్ని పొందందే మోక్షం రాదు, దుఃఖం పోదు.

అలా ఎవరైతే ఏ కోరిక, సంకల్పం లేకుండా మరి ధ్యానం చేస్తారో ఖచ్చితంగా ఆ దైవ దర్శనం కలుగుతుంది. అందుచేత పత్రి గారు చాలా అద్భుతమైన మార్గం ఇచ్చారు. అందుచేత దైవాన్ని తెలుసుకునే మార్గమే "శ్వాస మీద ధ్యాస". అందుచేత కోరికలు నష్టమే అని తెలుసుకోండి.

విచిత్రం ఏంటంటే కోరికలు ఒకటి తీరితే మళ్లీ కొత్తది పుడుతుంది. పుట్టినవాడికి చనిపోయేదాకా కోరికలు పుడుతూనే ఉంటాయి. మరి అటువంటి కోరికలు అలా పుడుతూ ఉంటే మానవుడు పరిస్థితి ఏమిటో కొంచెం ఆలోచించాలి?

చూడండి మోటార్ సైకిల్ లేనివాడు ముందు ఓ మోటార్ సైకిల్ కొనుక్కుంటే చాలు అంటాడు. చివరకు కొన్నాడు. కానీ రెండు ఏళ్ళు తిరుగుతాడు. మెల్లిగా మోటార్ సైకిల్ కాదు కారు ఉండాలంటాడు. సరే ఏదో రకంగా కారు కొన్నాడు. మళ్లా ఆ కారు సరిపోదు పెద్ద కారు కావాలి. అలా 10 లక్షల రూపాయలు, అది కొంటే పాతిక లక్షలు, అది కొంటే 50 లక్షలు, అది కొంటే కోటి రూపాయలు.

కారు అయిపోతే ఏరోప్లేన్ చూడండి ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నాడు. దేనితో తృప్తి పడడు. అసలు ఈ కోరికలకు అంతం వుండదు.

అసలు మానవుడు ఇన్ని తప్పులు చేయడానికి, ఇంత అధర్మంగా ప్రవర్తించడానికి, ఇన్ని అక్రమాలు చేయడానికి కోరికలే కారణం. అందరికంటా బాగా సంపాదించాలనే కోరిక, అందరికంటా గొప్పగా ఉండాలనే కోరిక, అందరిలోనూ గర్వంగా ఉండాలనే కోరిక, ఇలా ఈ కోరికలు నెరవేర్చు కోవడానికి ఎన్నో పాట్లు పడుతున్నారు. తప్పులు, పాపాలు అధర్మ యుక్తమైన పనులు చేస్తున్నారు అంటే మూల కారణం కోరికలే. కానీ సృష్టి సిద్ధాంతం ఏమిటంటే తప్పులు చేస్తే, పాపాలు చేస్తే, అధర్మంగా వ్యవహరిస్తే దాని ఫలితం తప్పకుండా అనుభవించి తీరాలి.

అలాంటి వారు ఇందులో నుంచి బయట పడలేక, ఎలా బయట పడాలో తెలియక చచ్చిపోతే మంచిది అనుకుంటారు.

విచిత్రం ఏమిటంటే ఏ లోటూ లేకపోయినా గొప్పల కోసం ఇంకా తప్పులు చేస్తారు. వాడు 10 కోట్ల ఇల్లు కడితే వీడు పాతిక కోట్లు, ఇంకోడు 100 కోట్లు కడతాడు. ఇంకోడు 1000 కోట్లు కడతాడు. దానికోసం ఎన్ని తప్పులు చేస్తారో! మరి కష్టాలు రావా? దాని ఫలితం నష్టమే కదా? ఈ నష్టం అంతా కోరికల వల్లనే కదా?

ఉన్నది చాలు అనే తృప్తితో కోరికలు పెంచుకోకపోతే ఏ ఇబ్బంది లేదు. కానీ కోరికల వల్లే ఈ నష్టం అంతా! చేసినప్పుడు ఏమీ ఉండదు, అనుభవించేటప్పుడు మాత్రం జీవితం దుర్భరమవుతుంది.

చాలామందికి ఇది కూడా ఒక సందేహమే! ఈ జన్మలో నేను చేస్తే వచ్చే జన్మలో అనుభవించడం ఏంటి? ఇంతకుముందు జన్మలో చేస్తే ఈ జన్మలో నేను అనుభవించడం ఏంటి? అంటారు.

ఇదే విషయం ఒకసారి నేను పత్రి గారిని అడిగాను ఏమండీ ఈ శరీరంతో తప్పులు చేస్తే ఇంకో శరీరం అనుభవించడం ఏమిటి అని? తర్వాత వచ్చే శరీరానికి తెలియదు కదా? ఈ శరీరంతో చేస్తే ఈ శరీరం అనుభవించాలి,

కానీ కొత్త శరీరం అనుభవించడం ఏమిటి? అని. అప్పుడు పత్రిగారు ఏమయ్యా ఒకడు నీ దగ్గర పదివేలు అప్పు తీసుకున్నాడు. అప్పు ఇచ్చావు నువ్వు.

నువ్వు అప్పు ఇచ్చినప్పుడు వాడు షర్టు ఫ్యాంట్ తో వున్నాడు. ఆరు మాసాలు పోయాక నువ్వు వాడిని అడుగుదామని వెళ్ళావు. అప్పుడు వాడు లుంగి బనియన్ తో ఉన్నాడు. నువ్వు బాకీ ఇమ్మని అడిగావు. వాడు ఏమన్నాడంటే? నేను షర్టు ఫ్యాంట్‌లో ఉండగా నువ్వు ఇచ్చావు, ఇప్పుడు నేను లుంగి బనీయన్‌లో ఉన్నాను, నేను ఇవ్వాల్సిన అవసరం లేదు అని అంటే నువ్వు ఊరుకుంటావా? ఊరుకోవు కదా?

ఏమిత్రా నువ్వు షర్టు ఫ్యాంట్లో వున్నా నువ్వే, లుంగి బనియన్ అయినా నువ్వే. నా బాకీ ఎగ్గొడతాను అంటావా? షర్టు మార్చేస్తే బాకీ ఎగ్గొట్టేస్తావా? అంటాడు. అలాగే నువ్వు ఆత్మ. నీ దేహాన్ని మార్చావు అంతే. శరీరం లాంటి బట్ట మార్చావు అంతే. అందులోనైనా నువ్వే, ఇదైనా నువ్వే. అందుచేత అనుభవించాలి అన్నారు.

మరి భగవద్గీతలో ఉంది కదా!

**శ్లో॥ వాసాంసి జీర్ణాని యదావిహాయ నవాని గృహ్ణాతి నరూపరాణి**
**తథా శరీరాని విహాయ జీర్ణాని అన్యాని సంయాతి నవాని దేహి**

(భ.గీ. 2-22)

తా:- మానవుడు చిరిగిపోయిన పాతబట్టలు వదలి, కొత్తబట్టలు ఎలా ధరిస్తున్నాడో, అలాగే ఆత్మ ముసలిదై పోయిన పాత శరీరాన్ని వదిలి కొత్త శరీరాన్ని ధరిస్తుంది.

అందుచేత అందులో ఉన్నది వాడే ఇందులో వున్నది వాడే. చేసింది వాడే కాబట్టి ఖచ్చితంగా అనుభవించాలి. కుదరదు అంటే లాభం లేదు.

అందుచేత కోరికల గురించి తప్పులు చేయడం, పాపాలు చేయడం. భవిష్యత్తులో జీవితాన్ని నష్టపెట్టుకోవడమే. అందుచేత మొదటినుంచి నేను

చెప్తున్నాను కోరికలకు బానిస అవ్వకండి, కోరికల్ని అదుపు చేసుకోండి, కోరికల గురించి తప్పులు పాపాలు చేయొద్దు, అధర్మంగా వ్యవహరించ వద్దు. సృష్టి విరుద్ధంగా ప్రవర్తించొద్దు, కారణం దాని ఫలితం దుర్భరంగా ఉంటుంది.

వాడికంటే గొప్పగా ఉండాలి, వాడిని మించిపోవాలి అని కోరికల కోసం పాపాలు చేస్తే నష్ట పోయేది మీరే. చాలామంది చేసే తప్పులన్నీ గొప్పల కోసమే, గొప్పగా ఉండాలనే కోరిక, గొప్పగా అనిపించుకోవాలనే కోరిక. అందుచేత ఇటువంటి కోరికలు నష్టాన్నే కలిగిస్తాయి కానీ లాభాన్ని కలిగించవు. అందుచేత కోరికలు అదుపు చేసుకోండి. కోరికలు అదుపు చేసుకునే మార్గమే పత్రి గారు మనకు ఇచ్చినటువంటి "శ్వాస మీద ధ్యాస" ధ్యానం. శ్వాస మీద ఎంత ధ్యాస పెడితే నెమ్మది నెమ్మదిగా కోరికలకు కారణమైనటు వంటి మనసు మీ అదుపులోకి వస్తుంది. మనసు అదుపులోకి వస్తే కోరికలు మీ అదుపులోకి ఉంటాయి. అప్పుడు అన్నిటికీ పరిమితం అవుతారు, ధర్మంగా జీవిస్తారు, అన్యాయాలు అక్రమాలు చేయరు, అప్పుడు ఏ నష్టము జరగదు. లేకపోతే కోరికల వల్ల అంతా నష్టమే. ఇది బాగా గ్రహించాలి.

# ఏ జన్మలోనూ కోరికలు తీరవు

పత్రీజీ ఒక సందర్భంగా ఏమన్నారంటే? ఏ జన్మలోనూ ఎవరి కోరికలు తీరవు అని చెప్పారు.

అందుచేత మొత్తం మానవ జన్మలను మూడు భాగాలుగా విభజించుకోవచ్చు. ప్రారంభ జన్మలు, మధ్యస్థ జన్మలు, చివరి జన్మలు.

1. ప్రారంభ జన్మలు అంటే జన్మ ఎత్తగానే వుండే 100 నుంచి 150 జన్మలు.

2. మధ్యస్త జన్మలు అంటే 150 నుండి 300 జన్మలు.

3. చివరి జన్మలు అంటే 300 నుండి 400 జన్మలని విభజించుకోవచ్చు.

పత్రిగారు ఏం చెప్పారంటే? **"ప్రారంభ జన్మల్లో కోరింది రాదు, అర్హతను బట్టి వస్తుంది"** అన్నారు.

అంటే కోరుకున్నది ఎవ్వరికీ రాదు, కానీ అర్హతను బట్టి, అంటే గత జన్మలలో చేసుకున్న దానిని బట్టి వస్తుందని అన్నారు.

అలాగే మధ్యస్థ జన్మలలో కూడా **"కోరింది రాదు, కావలసింది వస్తుంది"** అన్నారు.

అక్కడ కోరికలు నెరవేరవు, కానీ కావలసింది వస్తుంది. అది కూడా మీరు పైన నిర్ణయించుకుని వచ్చిన ప్రకారమే జరుగుతుంది.

చివరి జన్మల్లో అంటే ఆఖరి జన్మలలో కూడా **"కోరింది రాదు, ఏదైతే లోక కళ్యాణానికి వారికి ఏది అవసరమో అదే వస్తుంది"** అన్నారు.

అక్కడ కూడా కోరింది రాదు, మీరు లోక కళ్యాణకరమైన పని చేస్తున్నప్పుడు ఏది అవసరమో! ఎంత అవసరమో! అంతే వస్తుంది.

అలా మానవుని జీవితంలో ఎన్ని జన్మలు ఎత్తినా కోరింది ఎప్పుడూ రాదు అని తెలుసుకోవాలి. అందుచేత కోరితే నష్టపోవడమే తప్ప అంతకన్నా

ఏమీ లేదు. ఇది పత్రి గారు ఇచ్చిన సందేశం.

## "ప్రారంభ జన్మలలో వున్నవారు"

ప్రారంభ జన్మల్లో కోరింది రాదు అర్హతను బట్టి వస్తుంది అని తెలుసుకున్నాం. అంటే ఈ సృష్టిలో ఎవరైనా ఏదైనా పొందాలి అంటే ముందు అర్హత సంపాదించు కోవాలి.

అర్హత సంపాదించుకోకుండా నువ్వు తప్పులు చేసినా, పాపాలు చేసినా, మోసాలు చేసినా, అన్యాయాలు, అక్రమాలు చేసినా, దోపిడీలు, దొంగతనాలు చేసినా, ఖూనీలు చేసినా, ఏం చేసినా కూడా అంతకు పదింతలు కోల్పోతావు తప్ప ఏమి రాదు .

వాళ్ళని చూసి వీళ్ళని చూసి పోటీ పడి ఏదో మించి పోదామని, లేకపోతే ఏదో గొప్పవాడిని అయిపోదామని కోరుకుని చెయ్యకూడని పనులు చేస్తే నీ కోరికలు తీరవు సరి కదా! నువ్వు మోసం చేసి పోగేసినా తర్వాత దానికి పదింతలు నువ్వు కోల్పోతావు అన్న సంగతి తెలుసుకోవాలి.

మరి అనుకున్నది జరగాలి అంటే సృష్టిలో ఒక మార్గం ఉంది అదే అర్హత సంపాదించుకోవడం.

నువ్వు ఎంత అర్హత సంపాదిస్తే అంతా పొందగలుగుతావు. అర్హత లేకపోతే ఏది పొందవు, ఎన్ని తిప్పలు పడినా రాదు. కానీ ఎంత ఎక్కువ అర్హత సంపాదిస్తే అంత ఎక్కువ పొందుతావు.

మరి ఈ అర్హత ఎలా వస్తుంది ?

అంటే **"ఇస్తే వస్తుంది, ఏది ఇస్తే అదే వస్తుంది, ఎంత ఇస్తే అంతే వస్తుంది, ఏది ఇవ్వకపోతే ఏది రాదు".** ఇవ్వాలి అంటే ధనం ఒక్కటే కాదు, ఏదైనా ఇవ్వవచ్చు.

చూడండి కష్టాలు వద్దని కోరుకుంటారు. కానీ కష్టాలు వద్దని కోరుకుంటే రాకుండా వుండవు. దానికి కూడా అర్హత సంపాదించాలి. అర్హత

ఎలా వస్తుంది నువ్వు గతంలో ఎవ్వరిని కష్టపెట్టకుండా, కష్టాలకు గురి చేయకుండా ఉంటే నీకే కష్టం రాదు.

చాలా మంది ధనం కోరతారు. ధనం ఇస్తే వస్తుంది, అంటే ఇంతకుముందు అంటే గతంలో ఇతరులకు కానీ, లోక కళ్యాణం కోసం కానీ నువ్వు ధనాన్ని దానం చేస్తే, ధనాన్ని ఖర్చు చేస్తే అప్పుడు నువ్వు ధనం పొందగలుగుతావు. అంతే కానీ ఊరికే కోరుకున్నంత మాత్రాన రాదు.

ఎందుచేతనంటే? ఆలోచించండి ధనం ఎవరు కోరరు. గుడికి వెళ్ళి అంతా కోరుకుంటారు, చర్చికి వెళ్లి కోరుకుంటారు, మసీదుకి వెళ్లి కోరు కుంటారు. మరి అంతా కోటీశ్వరులు అయిపోతున్నారా? లేదు కదా? మరి కొంతమందే ఎందుకు అవుతున్నారు? అంటే అర్హత సంపాదించారు కాబట్టి.

అర్హత అంటే ఇవాళే సంపాదించక్కర్లలేదు. గతంలో కూడా సంపాదించి వుండొచ్చు. అందుకే మీరు చూడండి, దేవుడికి అందరూ సమానం అయినా ఒకడు పుట్టగానే అపర కోటీశ్వరుడి కుటుంబంలో పుడతాడు, అంటే పుట్టగానే అపరకోటీశ్వరుడు అయిపోయాడు, ఇంకొకరు పుట్టగానే పేదవాడి కుటుంబంలో పుడతాడు, ఒకడు అడుక్కునేవాడికి పుడతాడు. మరి దేవుడికి అందరూ సమానమే కదా? మరి వాడు అలా ఎందుకు పుట్టాడు? వీడు ఇలా ఎందుకు పుట్టాడు?అంటే అర్హతను బట్టే అని తెలుసుకోవాలి.

అర్హత లేకపోతే ఎంత కష్టపడినా, ఏం చేసినా ఏమీ రాదు. ఎవరైనా సరే ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది సృష్టిలో అర్హత సంపాదించుకోవాలి. అంతేకానీ రాత్రి, పగలు కష్టపడితే రాదు. అలా అయితే అంతా కష్టపడతారు, ఎవడు కష్టపడరు? అందుచేత అర్హత సంపాదించి ధనవంతులు కండి.

అందుకే చూడండి ప్రభుత్వాలు ఎంత చేసినా ధనవంతులు ధనవంతులులాగే ఉంటున్నారు, పేదవారు పేదవారిలాగే ఉంటున్నారు. ఎన్ని చట్టాలు తెచ్చినా, ఎన్ని రిజర్వేషన్లు పెంచినా, ఎన్ని ఏర్పాట్లు చేసినా ఏం

చేసినా ధనవంతులు ధనవంతుల్లాగే ఉన్నారు, పేదవారు పేదవారిలానే వుంటున్నారు కారణం అర్హత లేదు కాబట్టి.

## "మధ్యస్థ జన్మలలోకి వచ్చినవారు"

మధ్యస్థ జన్మల్లోకి వచ్చిన వారు సహజంగా పైన అన్ని నిర్ణయిం చుకుని, భూమి మీదకి వచ్చాక ఏం చేయాలి? ఏం సాధించాలి? ఏ అనుభవాలు పొందాలి? ఏ పాఠాలు నేర్చుకోవాలి? అని ఒక ప్రణాళిక ప్రకారం నిర్ణయించుకొని భూమి మీదకి వస్తారు. కానీ భూమి మీదకి వచ్చాక అసలు మీరు ఎవరో, ఏమి నిర్ణయించుకున్నారో మీ ప్రణాళిక ఏంటో అన్నీ మర్చిపోతారు.

సహజంగా జన్మించిన తర్వాత ఎవరైనా సరే ధనానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. ధన సంపాదన దేనికి అంటే సుఖపడటానికి. దానికి కావలసింది ధనం కాబట్టి, తాను జీవించాలన్నా, సుఖపడాలన్నా, బాగా బ్రతకాలన్నా కావలసింది ధనం కాబట్టి ధన సంపాదనకే ప్రాముఖ్యం ఇస్తారు. ఎవరైనా సరే వాళ్ళకు ఉన్నటువంటి అవకాశాలను బట్టి వ్యాపారమో, వృత్తో, లేకపోతే ఉద్యోగమో ఏదో ఒకటి చేస్తూ ధనం సంపాదిస్తారు.

అంతేకాదు ఆ ధన సంపాదనకు వ్యాపారం చేయాలని, ఉద్యోగం చేయాలని, ఒక మంచి ప్రొఫెషన్ చేయాలని, రాజకీయాల్లో ఎదగాలని, లేకపోతే డాక్టర్ అవ్వాలని, ఐఏఎస్ అవ్వాలని ఇలా ఎన్నెన్నో కోరుకుంటూ వుంటారు. విచిత్రం ఏమిటంటే వాళ్ళు కోరుకున్నది అవ్వదు, వాళ్ళు కోరుకని ఎన్ని ప్రార్ధనలు చేసినా, ఆరాధనలు చేసినా, ఎన్ని చోట్లకు తిరిగినా ఎన్ని మొక్కులు మొక్కుకున్నా ఏం చేసినా కోరుకున్నది అవదు, వాళ్ళు ఒకటి అనుకుంటే ఇంకోటి అవుతుంది.

పత్రి గారు చాలాసార్లు ఆయన జీవిత చరిత్ర చెప్తూ నాకు డాక్టర్ చదవాలని ఉండేది, కొద్ది మార్కుల్లోనే అవకాశం కోల్పోయాను అన్నారు. అంటే ఆయన డాక్టర్ కావాలని కోరుకుంటే ఆ ప్రకృతి అవకాశం కలిగించలేదు,

దాంతో ఆయన నిరుత్సాహ పడి చనిపోదామని ట్యాంక్‌బండ్ దగ్గరికి వెళ్లి తెల్లవారు జామున దూకి చనిపోదాం అనుకుంటే ఆ టైమ్‌లో నీళ్ళు బాగా చల్లగా వున్నాయి, చన్నీళ్లు నాకు పడవంటూ ఆయన దూకడం మానేసారు.

ఆయన కుటుంబంలో ఆయన అన్నగారు గొప్పగా చదివి మంచి ఉద్యోగం చేస్తే, ఈయన సామాన్యమైన ఉద్యోగం చేస్తూ హైదరాబాద్‌లోనే మెల్లి మెల్లిగా ఈ ధ్యాన మార్గంలోకి రావడం జరిగింది.

ఈ మార్గంలో ఆయన అవసరమైనవన్నీ, ఆయనకు కావలసినవన్నీ నేర్చుకున్నారు, సంగీతం నేర్చుకున్నారు, ఫ్లూట్ నేర్చుకున్నారు. ఇలా కావలసిన విద్యలన్నీ ఈ మార్గంలో నేర్చుకున్నారు.

నా వరకు చూస్తే నా జీవితంలో కూడా నేను కోరుకున్నది రాలేదు కానీ నాకు కావలసిందే నాకు ఇవ్వబడింది. పత్రి గారు చెప్పినటువంటి స్టేట్మెంట్ మధ్యస్థ జన్మల్లో "కోరింది రాదు కావలసిందే వస్తుంది" అన్నది నా జీవితంలో నిజమైంది.

నేను వ్యాపారం చేస్తూ ఇంకా ఇంకా పెద్ద పెద్ద వ్యాపార సంస్థలు పెట్టాలని నేను చూశాను కానీ అది కొంతవరకే నడిచింది, తర్వాత నాకు తెలియకుండానే ఆ వ్యాపారాలు దెబ్బ తినడం మొదలైంది. ఏంటో అర్థం కాలేదు. అప్పటిదాకా అనుకున్నవన్నీ అయ్యేవి. అప్పుడు ఎందుకు రివర్స్ అవుతున్నాయో నాకు అర్థం కాలేదు .

ఎన్ని చేసినా, ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా కలిసి రాలేదు. అప్పటిదాకా తిరుగు లేకుండా కలిసి వచ్చేది. అంటే నాకు కావలసింది ధనం కాదు అన్నది నాకు తెలియదు కానీ ఆ నడిపించే ప్రకృతికి నాకు ఏది కావాలో తెలుసు. అందుచేత నన్ను వ్యాపారం నుంచి ఆధ్యాత్మికం వైపు నడిపించడం జరిగింది.

అందుచేత ప్రాపంచిక మార్గంలోకి వెళ్దామన్నా లాభం లేదు. ఒకవేళ వెళ్తే అక్కడ రివర్స్ అవుతూనే ఉంటుంది. వెళ్ళవలసిన దానిలోకి వెళ్తేనే తప్ప

ఇంక ఎందులోకి వెళ్ళినా అది దెబ్బ కొడుతూనే ఉంటుంది, నాకు అదే జరిగింది. వ్యాపారం చూస్తే వ్యాపారం డౌన్ అయింది, పాలిటిక్స్‌లోకి వెళ్తే మొదట్లో బాగానే ఉంది కానీ తర్వాత రివర్స్ అయింది, తర్వాత కుటుంబంలో కూడా మొదట్లో సాఫీగా సాగింది, కానీ తర్వాత అక్కడా రివర్స్ అయింది.

ఇలా రివర్స్ అవుతూ, అవుతూ అనుకోకుండా పత్రి గారి యొక్క పరిచయం ఏర్పడింది. పత్రిగారి సాంగత్యంతో ఈ ధ్యాన మార్గంలోకి ఆకర్షితుడిని అయ్యాను. ఎప్పుడైతే ఇందులో ఆకర్షితునయ్యానో ఒక్కొక్కటి వదిలి పెట్టేసాను, దీంట్లో ఎదగడం మొదలపెట్టాను. ప్రాపంచికంలో తగ్గినా ఇందులో ఎదుగుతున్నాను, ఇందులో అన్ని నాకు అనుకూలిస్తున్నాయి. ఎక్కడికైనా వెళ్లి చెప్పాలంటే దానికి తగ్గ అనుకూలమైన వాతావరణం, జ్ఞానాన్ని పెంచుకోవడానికి కావాల్సిన వాతావరణం, ధ్యానం చేయడానికి కావల్సిన వాతావరణం ఏర్పడి అన్ని అనుకూలించాయి.

ఈ ధ్యాన మార్గంలోకి వచ్చినటువంటి ఎంతో మందిని నేను గమనించాను చాలామంది ఈ విషయమే చెప్పారు.

అందుచేత ఎవరైనా మిమ్మల్ని మీరు చూసుకోవచ్చు మీరు ఏ ఏ స్టేజిలో ఉంటే ఖచ్చితంగా దాని ప్రకారం జరుగుతుంది. మీరు ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి రావలసి ఉన్నప్పుడు ప్రాపంచిక మార్గంలో మీరు ఎన్ని కోరుకున్నా ఎన్ని చేద్దాం అనుకున్నా, మీరు రావలసిన మార్గంలోకి వస్తే తప్ప మీకేమి కలిసిరావు.

మీరు ఇంకా మూర్ఖంగా ప్రవర్తిస్తే ఇంకా దెబ్బలు తగులుతాయే కానీ ఏమీ ఉపయోగం లేదు. అందుచేత ఇది అర్థం చేసుకుని ఈ మార్గంలో మీరు పయనించి కృషి చేస్తే ఖచ్చితంగా బాగా ఎదుగుతారు.

అలాగే ప్రారంభ జన్మల్లో ఉన్నవాళ్ళు గమనించవలసింది ఏమిటంటే కోరుకున్నది రాదు, ఇది తెలుసుకోకుండా ప్రయత్నిస్తే మీరు దెబ్బ తినడమే తప్ప కోరికలు అన్నవి ఎక్కడా తీరవు, ఎప్పుడూ తీరవు .

అంతా అది కోరుకుంటారు, ఇది కోరుకుంటారు. కానీ అర్హతను బట్టే వస్తుందని తెలుసుకోండి. ఇది బాగా బాగా గుర్తుపెట్టుకోవాలి ప్రతి మీకు ఏది అర్హత ఉంటే అదే వస్తుంది. అందుచేత ఏది మీకు అనుకూలిస్తూ ఉంటే దానికి అనుగుణంగా జీవించాలి. మీ ఇష్టం వచ్చినట్టు చేద్దాం అంటే కుదరదు.

ఇప్పుడు మీరు ఆత్మ ఎదుగుదలకే కృషి చేయాలి. దేహం కోసం కాదు, దేహ సుఖాలు కాదు. కావాల్సింది జ్ఞానం కాబట్టి ఆధ్యాత్మిక మార్గంలో ఎదగడానికి కావలసినవన్నీ నీకు సమకూరుతూ ఉంటాయి. ఎవరవైతే ఈ విషయాలు తెలుసుకుంటారో ఆ ప్రకృతికి అనుగుణంగా వారు జీవించ గలుగుతూ వుంటారు. దానికి అనుగుణంగా ప్రవర్తిస్తారు. అప్పుడు ఏ ఇబ్బందులు ఉండవు.

ఖచ్చితంగా నువ్వు అక్కడ వేసుకున్న ప్రణాళిక ప్రకారమే ఇక్కడ చేయవలసిందిఇ వస్తుంది. నీ ప్రణాళిక ప్రకారమే నువ్వు జీవించవలసి వస్తుంది. నువ్వు భిన్నంగా ప్రవర్తిస్తే నీకు అన్నీ ఎదురు దెబ్బలే. మీరు సృష్టికి అనుగుణంగా ప్రవర్తిస్తే మీకు ఏ ఇబ్బందులు వుండవు, సాఫీగా ఉంటుంది.

చూడండి ప్రారంభ జన్మల్లో ఎంతసేపు ఎంజాయ్ చేయాలి, అనుభవించాలి అన్నదాని మీదే దృష్టి వుంటుంది. అంటే ఖానా పీనా సోనా తప్ప ఇంకేం వుండదు. వాళ్ళు ధ్యానంలోకి వచ్చినా కూడా ధ్యానంలో నిలబడలేరు. వారికి శారీరక లాభాలు కావాలి, కోరికలు తీర్చుకోవాలని చూస్తారు.

కొంచెం ఎదిగితే నేను గొప్పగా ఉండాలి. అందరికంటే ఆధిక్యంలో ఉండాలి. పంచాయతీ ప్రెసిడెంటో లేకపోతే కౌన్సిలర్ ఏదో ఒకటి ఆరాటపడతారు. ఏ సొసైటీనో పెట్టి అందులో వాడు ఓ ప్రెసిడెంటో, సెక్రెటరీ అవడానికి ప్రయత్నం చేస్తూ ఉంటాడు. లేకపోతే ఎమ్మెల్యే గానో, మినిస్టర్ గానో తపన పడుతూ ఉంటాడు.

ఇంకా ఇంకా జన్మలు పెరిగితే అవి కూడా అవసరం లేదు ఎంతసేపు సేవల మీద దృష్టి ఉంటుంది. వాడికి మంచి చేయాలి, వీడికి మంచి చేయాలి, పుణ్య కార్యాలు చేయాలి అంటూ రకరకాల సేవా కార్యక్రమాలు చేస్తూ వుంటారు.

ఇంకా ఎదిగాక నేను దేహం కాదు నేను ఆత్మను అన్న స్థితికి వచ్చాక గురువులని ఆశ్రయిస్తారు. జ్ఞానం కోసం ప్రయత్నిస్తూ ఉంటారు.

ప్రపంచవ్యాప్తంగా ఏది అవసరమైనా దైవాన్ని ఆశ్రయించడమో, ప్రార్థించడమో, అర్థించడమో చేస్తారు. చిన్న కష్టం వచ్చినా దైవాన్ని కోరుతూ ఉంటారు. ఏ మాత్రం జీవితంలో చిన్న అసౌకర్యం కలిగిన వెంటనే మనసులో స్వామి నాకు ఈ ఇబ్బంది తొలగించు అని కోరుకుంటారు, పైకేమీ అనరు, లోపల మటుకు అనుకుంటూ ఉంటారు.

ప్రతి ఒక్కరికి ఒక్కొక్క దేవుడు అంటే ఇష్టం. చాలామంది వారికి ఇష్టమైన దేవున్ని పదే పదే స్మరిస్తూ ఉంటారు, జపిస్తూ ఉంటారు.

సాయిబాబా అయితే బాబా బాబా బాబా అంటూ, వెంకటేశ్వర స్వామి అయితే స్వామి బాలాజీ బాలాజీ అంటూ, యేసు అయితే యేసయ్య యేసయ్య అంటూ ఇలా లోపల అనుకుంటూ ఉంటారు.

వారి యొక్క ఉద్దేశం అలా కోరితే ఆయన కోరింది తీరుస్తాడు అనుకుంటారు. అంతేకానీ తనకి ఆ పరిస్థితి ఎందుకు వచ్చింది? ఆలోచించరు.

ఆ ఇబ్బంది ఎందుకు వచ్చింది? ఆ రకమైన కష్టం ఎందుకు వచ్చింది? ఆ నష్టం ఎందుకు జరిగింది? అన్నది ఆలోచించరు. పత్రిగారు ఎన్నో సార్లు చెప్పారు నీ జీవితంలో ఏది జరిగినా దానికి నువ్వే కారణం ఇంకొకళ్ళు ఎవ్వరూ కారణం కాదు అన్నారు.

మీ జీవితంలో వాళ్ళని వీళ్ళని కారణాలుగా చెప్పుకుంటారు. కానీ ఏది జరిగినా నువ్వే కారణం. నువ్వు చేసే కర్మలను బట్టే నీ భవిష్యత్తు ఆధారపడి

ఉంది. అందుచేత చేసే కర్మల మీద దృష్టి పెట్టాలి. అప్పుడు నీ భవిష్యత్తు బాగుంటుంది. నువ్వు కర్మల మీద నువ్వు దృష్టి పెట్టకుండా ఏ దేవుడి మీద దృష్టి పెట్టినా ఎవరిని ఆశ్రయించినా, ఏ గురువుని పట్టుకున్నా ఏమి ప్రయోజనం లేదు.

ఒకవేళ ఏ పెద్ద గురువుని ఆశ్రయించినా, వారు మీ కోరికలు తీర్చరు, మీకు ఎలా జీవించాలో నేర్పుతారు, ఎలా ప్రవర్తించాలో చెప్తారు.

మీ మాట ఎలా ఉండాలి ? మీ ఆలోచన విధానం ఎలా ఉండాలి? మీ చేతలు ఎలా ఉండాలి? అన్నవి చెప్పడమే కాదు ఆ స్థితి మీరు రావాలి అంటే ఏం చేయాలో కూడా వాళ్ళు బోధిస్తారు.

వారిని కనక అనుసరిస్తే ఖచ్చితంగా మీ భవిష్యత్తు బాగా తీర్చిదిద్దుకుంటారు. గురువులు ఎంతో అనుభవంతో ఎంతో జ్ఞానంతో అన్ని కూలంకషంగా చర్చించి తెలుసుకొని అధ్యయనం చేసి జ్ఞానం సంపాదించు కున్నారు. అందుచేత ఏం చేస్తే బయట పడతాం అన్నది వాళ్ళకి అవగాహన వుంటుంది. అవే మనందరికీ చెప్తారు.

ఆ పరిస్థితి ఎందుకు వచ్చిందో చెప్తారు. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే ఏం చేయాలి ఎలా జీవించాలో చెప్తారు. దానికి ఎలాంటి సాధనలు చేయాలో చెప్తారు. వారిని అనుసరిస్తే ఖచ్చితంగా భవిష్యత్తు బాగుంటుంది.

కొంచెం ఆలోచించండి ఈ కోరికలకి మూలం ఏమిటి? ఎందుకు ఇలా కోరికలు కలుగుతున్నాయి? అని ఆలోచిస్తే కోరికలకు కారణం మనసే. మనసు అందరికీ ఉంటుంది. కానీ అందరి మనసు ఒకే రకంగా ఉండదు. రకరకాలుగా ఉంటుంది. ఒక్కొక్కళ్ళ మనసు ఒక్కో రకంగా ఉంటుంది.

ఎవరి మనసు అయితే తమో గుణంలో, రజోగుణంలో ఉంటుందో అదుపులో ఉండదు. వాళ్ళ కోరికలు విజృంబించి ఉంటాయి, అదుపులో ఉండవు. వారు కోరిక మీదే దృష్టి పెట్టి అనుకున్నది నెరవేర్చుకోవడానికి

పట్టుదలకి, పంతాలకి పోతారు. చివరికి చాలా నష్టం పొందాల్సి వస్తుంది.

అందుచేత కోరికల మూలమైన తమో గుణం, రజోగుణాల్ని అధిగమించే ప్రయత్నం చేయాలి. ఆ గుణాల్ని అధిగమించడానికి మార్గమే పత్రి గారు చెప్తున్న సాత్వికమైన శాకాహారం, "శ్వాస మీద ధ్యాస" ధ్యానం. ఇవి ఎవరు చేస్తారో ఖచ్చితంగా అందులోనుంచి బయటపడతారు, కోరికలకు బానిస అవ్వరు, తృప్తిగా ఉంటారు, ఆశపడరు, హాయిగా జీవిస్తారు, అధర్మంగా వ్యవహరించరు, చేయకూడని పనులు చేయరు.

చాలామంది అడుగుతారు నా సంసారం చూసుకోవద్దా సంపాదించద్దా? ఆ కోరిక కూడా తప్పేనా? సంసారం చూసుకోవాలనే కోరిక కూడా తప్పేనా? ఇలాగ అడుగుతూ ఉంటారు. అన్నీ చేయొచ్చు, అన్నీ కోరుకోవచ్చు, కానీ కోరికలకు బానిస అవ్వకూడదు. అదుపులో ఉంచుకోవాలి.

## "చివరి జన్మలలోకి వచ్చినవారు"

అలాగే చివరి జన్మలో వచ్చినవారు శుద్ధ సాత్వికం, నిర్గుణ స్థితుల్లో వుంటారు. చివరి జన్మల్లోకి వచ్చేసరికి ఏం జరుగుతుంది అంటే అక్కడ కూడా కోరింది రాదట. సహజంగా చివరి జన్మల్లో ఉన్నవాళ్ళు లోక కళ్యాణం కోసమే చూస్తారు.

లోకానికి మేలు చేయడానికి, లోకానికి లాభం కలిగించే పనులు చేయడానికి చూస్తారు. అటువంటి వాళ్ళు పరిస్థితుల ప్రభావంతో కోరుకున్నా కూడా కోరుకున్నవి అవ్వవు. ఏం జరుగుతుంది అంటే అక్కడ కూడా "కోరింది రాదు. లోక కళ్యాణకరమైన పనులకు ఏది అవసరమో అవే వస్తూ వుంటాయి".

దీనికి కారణం వాళ్ళు చివరి చివరి జన్మలోకి రావడమే. ఎవరైతే లోక కళ్యాణకరమైన పనులు చేస్తూ ఉంటారో వాళ్ళ ప్రణాళికే వేరు, వాళ్ళ ఆశయమే వేరు, వాళ్ళు వచ్చిందే వేరు.

పత్రిగారు ఖచ్చితంగా చెప్పారు ఎవ్వరైనా సరే తమ ప్రణాళిక

ప్రకారమే జీవించాలి విరుద్ధంగా జీవించకూడదు. ఏది అనుకుని వస్తారో అది సాధించాలి. అది కాకుండా విరుద్ధంగా జీవిస్తే మరల దాన్ని సాధించడానికి ఇంకొక జన్మ తీసుకోవాల్సి వుంటుంది, ఒక జన్మ వృధా చేసుకున్న వాళ్ళు అవుతారు. వచ్చింది ఒకటి, చేసేది ఇంకొకటి అవుతుంది. వచ్చింది చేయకపోతే ఏమవుతుంది ? మళ్లీ రావాలి.

ఇప్పుడు పరీక్షల్లో ఏది ఇస్తారో అది వ్రాయాలి. ఇంకోటి రాస్తే పరీక్ష ఎలా పాస్ అవుతాడు. మళ్లీ పరీక్ష రాయాలి మళ్ళీ ఒక సంవత్సరం చదవాలి.

అదే రకంగా ఈ భూలోకం అన్నది ఒక పాఠశాల. పాఠాలు నేర్చు కోవడానికి వచ్చాం. ఏది నేర్చుకోవడానికి వచ్చామో అది నేర్చుకోకపోతే మరలా వచ్చి నేర్చుకోవాలి, ఏది అనుభవించడానికి వచ్చామో అది అనుభవించకపోతే మళ్లీ అనుభవించాలి, తప్పించుకోవడానికి లేదు. అందుకే పత్రి గారు అంటారు నీవు కష్టాలు అనుభవించలేక ఆత్మహత్య చేసుకుంటే మళ్లీ అలాంటి జీవితమే వస్తుందంటారు.

ఎలాంటి కష్టాల్లోనుంచి బయట పడాలని ఆత్మహత్య చేసుకుంటారో మరలా అలాంటి జీవితాన్ని తీసుకుని అలాంటి కష్టమే అనుభవించాలి. తప్పించుకోవడానికి చూసినందుకు కాస్త పెనాల్టీ పడి ఇంకా ఎక్కువ బాధలు అనుభవించాలి. వారి పరిస్థితి "పెనం నుంచి పొయ్యిలో పడినట్టు అవుతుందని" అంటారు.

అందుచేత నీ ప్రణాళికలో అవి ఎంచుకున్నావు, ఆ కష్టాల ద్వారా కొన్ని పాఠాలు నేర్చుకుంటావు, అందుచేత ఈ కష్టాలు నుంచి నేనేం నేర్చుకోవాలి అని ఆలోచిస్తే అర్థమవుతుంది. అంతకు ముందు ఎవరినో ఇబ్బందులకు గురి చేశావు, అందుచేత అలాంటి జన్మే వచ్చింది అని తెలుసుకోవాలి. ఇలా ప్రతి దాంట్లోను అనుభవం ఉంటుంది.

అలా ఏదైనా సరే ప్రణాళిక ప్రకారం మీరు ఎంచుకున్నటు వంటి జీవితం ప్రకారం జీవించాలి. చివరి స్థితికి వచ్చినప్పుడు ఇంక చేయవలసింది లోక కళ్యాణకరమైన పనులు.

లోక కళ్యాణం కోసం వారు పాటుపడేటప్పుడు వారికి ఏది కావాలో అది వస్తుంది సహజంగా ఆ స్థాయిలో ఉండేటువంటి స్వామీజీలైనా గురువులైనా ఎవరైనా సరే సంపాదన మీద, వాళ్ళకి ఆశ కోరికలు ఉండవు. వాళ్ళు అందరికీ ఆ జ్ఞానాన్ని బోధించడమే వారి యొక్క లక్ష్యం.

చివరి జన్మలో లోక కళ్యాణం కోసం కావలసినవి సమకూరుతూ ఉంటాయి. అందుచేత కోరికల మీద దృష్టి పెట్టకండి. కోరికల గురించి ఊరికే తపన పడకండి. దేవుళ్ళు కోరికలు తీర్చడానికే ఉన్నారు అన్న భావం వదిలేయండి. భగవంతుని సృష్టిలో ఉన్న ఏర్పాటే అంత.

మానవులు కోరిందల్లా దేవుళ్ళు ఇవ్వరు. ఎందుకంటే మీకు ఉదాహరణ చెప్తాను.

మీరు మామూలు పూజలు, ప్రార్థనలు చేసి ఊరికే అడుగుతారు. అలా కాదు. పూర్వకాలం ఎంతో మంది రాక్షసులు తపస్సు చేసేవారు వాళ్ళు మామూలు తపస్సు కాదు తీవ్ర తపస్సు చాలా తీవ్రంగా చేశారు. దానినే ఘోర తపస్సు అనేవారు.

మొత్తం మీద వాళ్ళ యొక్క పట్టుదలకి మెచ్చి ఆ దేవుళ్ళు ప్రత్యక్షమయ్యేవారు కొంతమంది బ్రహ్మను గురించి కొంతమంది, శివుడు గురించి కొంతమంది, విష్ణువు గురించి చేసేవాళ్ళు. దేవుళ్ళందరికంటే గొప్పవారు కాబట్టి వాళ్ళ గురించి తపస్సు చేసేవారు అలా చేస్తే మొత్తం మీద వాళ్ళ తపస్సుకు మెచ్చి వాళ్ళు ప్రత్యక్షమయ్యేవారు.

నాయనా ఏమిటి నీ కోరిక అంటే చాలామంది నాకు చావు లేని

వరం ఇవ్వండి స్వామి అనేవారు. మరి అంత తపస్సు చేశాడే అంత కష్టపడ్డాడే దేనికోసం? అంటే కోరిక కోసం మరి ఆ కోరిక తీర్చేవారా అంటే ఒకటే చెప్పారు నాయనా అది మా చేతిలో లేదు అది తప్ప ఇంకేదైనా కోరుకో అనేవారు.

మరి ఇంత కష్టపడి ఇంత చేసి ఇంత మెప్పించి వాళ్ళని ప్రత్యక్షం చేసుకున్నా కోరింది రాలేదు కదా, ఇది గుర్తుపెట్టుకోవాలి. కారణం వాళ్ళ యొక్క కోరిక చావకుండా వుండిపోవడానికి.

నా చేతిలో లేదని వాళ్ళే అంటే ఏం చేయగలరు, కాస్త వాళ్ళ మేధస్సు ఉపయోగించి రకరకాలుగా కోరుకునేవారు.

కోరిక నెరవేరలేదు మరి అంత తపస్సు చేసిన వాళ్ళ కోరికలే నెరవేరకపోతే, సామాన్యుల కోరికలు ఎక్కడ నెరవేరుతాయి? అందుచేత సృష్టి నియమాలను అనుసరించి ప్రతి ఒక్కళ్ళు జీవించాలి, ప్రయత్నించాలి.

ఏదైనా ఉద్భవించింది కొంతకాలమే పోషింపబడుతుంది మళ్ళా అంతమైపోతుంది. మీరు చూసుకోండి కావాలంటే ప్రకృతిలో ఏదైనా సరే ఎన్ని జాతులు ఉన్నాయో, 84 లక్షల రకాలు అన్ని పుడుతూ ఉంటాయి, పెరుగుతూ ఉంటాయి ,చివరికి అంతమైపోతూ ఉంటాయి.

దీన్నే పుట్టేదాన్నే ఉద్భవించేదాన్నే బ్రహ్మ తత్వం అంటారు, పోషింప బడేదాన్ని విష్ణుతత్వం అంటారు, లయమయ్యేదాన్ని శివ తత్వం అంటారు, ఇది సృష్టిలో ఉన్నది. అక్కడ బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ఉన్నారా అన్నది కాదు అక్కడ ఈ రకమైన తత్వం ఉంది.

అందుచేత ఒకటే గుర్తుపెట్టుకోండి కోరికలు తీర్చుకోవడం, కోరికల మీద దృష్టి కాదు.

రమణ మహర్షి గారు చెప్పినట్టు, పత్రి గారు చెప్పినట్టు, ఇంకా పెద్దలు చెప్పినట్టు ,శంకరాచార్యుల వారు చెప్పినట్టు ముందు ఈ ప్రశ్నలు

వేసుకోండి.

కోరికలు కాదు. నేను ఎవరు? నేను ఎక్కడి నుంచి వచ్చాను? దేనికోసం వచ్చాను? ఏమి చేయడానికి ఏమి సాధించడానికి వచ్చాను? ముందు ఈ ప్రశ్నలు వేసుకోవాలి. వీటికి సమాధానం రాబట్టుకోవాలి.

అసలు వీళ్ళంతా ఎవరు? నా వాళ్ళు, నా వాళ్ళు అనుకుంటున్నావు, వాళ్ళకి నీకు ఎలాంటి సంబంధం? ఈ పుట్టడం ఏంటి ? చనిపోవడం ఏంటి? చనిపోయిన తర్వాత ఏమవుతాను? ఇంకా ఉంటానా? ఉండనా? చనిపోయిన వాళ్ళంతా ఎక్కడికి వెళ్తున్నారు? మళ్ళా కనపడరేంటి? అసలు వీళ్ళంతా ఎక్కడి నుంచి వస్తున్నారు? ఎలా ఉద్భవిస్తున్నారు? ఈ కష్టాలు ఏంటి, బాధలు ఏంటి? అందరి జీవితాలు ఒకే రకంగా ఎందుకు లేవు? కొంతమందికి అలా ఉంది, కొంతమందికి ఇలా ఉంది, కొంతమందికి భోగం ఏంటి? కొంతమంది రోగాలు ఏంటి? కొంతమంది ధనవంతులు ఏంటి? కొంతమంది పేదవారు ఏంటి? దేవుడికి అంతా సమానం అయితే, ఈ తేడాలు ఎందుకు ఉన్నాయి? అలా ఆలోచించవలసినవి ఎన్నో ఉన్నాయి.

అప్పటిదాకా బాగానే ఉంటుంది. జీవితంలో సడన్‌గా మార్పు వస్తుంది, సడన్‌గా రోగం వస్తుంది, సడన్‌గా చనిపోతారు. ఉండాలనే కోరు కుంటారు? మరి ఎందుకు ఉండట్లేదు, అనుకున్నది అనుకున్నట్టు ఎందుకు అవ్వలేదు, కోరుకున్నట్టు ఎందుకు ఉండట్లేదు. జీవితాలు ఎంత ప్రార్థించినా ఎంత ప్రాదేయ పడినా అనుకున్నట్టు ఉండట్లేదే? ఏమిటి దానికి కారణం?

ఎంతసేపు కోరికలు మీదే దృష్టి పెడితే జీవితం సాఫీగా ఎక్కడ ఉంటుంది, ఆ కోరికలు తీర్చుకోవడానికి చేయకూడని పనులు చేస్తూ వాటి ఫలితం మళ్లీ దుర్భరమైన కష్టాలు అనుభవించాల్సి వస్తుందే. ఎంత నష్టపోతారు. అందుచేత కోరికల మీద దృష్టి కాదు, జ్ఞానం మీద దృష్టి పెట్టండి.

# కోరికలు, సంకల్పాలు శక్తిని హరిస్తాయి

ఎవరైనా కోరికలకు బానిసై అవి తీర్చుకోవాలి అనే ప్రయత్నం చేస్తే చాలా దుఃఖ పడతారు, ఎంతో నష్టపోతారు. మీరు చూడండి ఒకడికి ఆకలి వేసింది, ఏదైనా హోటల్ కి వెళ్లి భోజనం చేయాలనుకున్నాడు, ఒక ప్రక్క ఫైవ్ స్టార్ హోటల్ వుంది అక్కడికి వెళ్తే భోజనం 1000 రూపాయలు, ఇంకొక ప్రక్క ప్లేట్ మీల్స్ 50 రూపాయలు.

గమనిస్తే ఈ 50 రూపాయల ప్లేట్ మీల్స్ తిన్నా కడుపు నిండుతుంది. 1000 రూపాయల 5స్టార్ భోజనం తిన్నా కడుపు నిండుతుంది. మీరు కోరికలకు బానిసవుతే 1000/- రూపాయలు భోజనం చేస్తారు. కానీ అలా ఎన్నాళ్ళు తినగలరు? కానీ అవసరానికి పరిమితమవుతే ప్లేట్‌మీల్స్‌తో సరి పెట్టుకుంటారు, ఎన్నాళ్ళు తిన్నా ఇబ్బందుల్లో పడరు.

అలా జీవితంలో ఏదైనా సరే, ఏ స్థాయిలో ఉన్నవాళ్ళైనా సరే అవసరాలకు పరిమితమవ్వాలి లేకపోతే చాలా నష్టపోతారు. ఉన్న దాంట్లోనే జీవించగలగాలి. నిజంగా మీ కోరికలు తీరాలంటే ప్రకృతికి అనుగుణంగా ప్రవర్తించాలి. ప్రకృతి నియమం ఏమిటంటే గతంలో చేసుకున్నది ఇప్పుడు అనుభవిస్తూ ఉంటారు, ఇప్పుడు చేసుకున్నది భవిష్యత్తులో అనుభవిస్తారు. మీరు కోరుకున్నది ఇప్పుడే జరగాలంటే జరగదు, సాధ్యం కాదు. కానీ అర్హత సంపాదించుకుంటే మీకు భవిష్యత్తులో నెరవేరుతుంది.

చాలామంది నేను చాలా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాను, ఎలా బయటపడాలో తెలియట్లేదు, చచ్చిపోదాం అనుకుంటున్నాను అని అంటూ ఉంటారు. కానీ గుర్తుపెట్టుకోండి ఆర్థిక ఇబ్బందులు అన్నవి ఊరికే వాటంతట అవి వచ్చినవి కావు. గతంలో వాళ్ళు చేసుకున్న కర్మలను బట్టే వస్తున్నాయి.

గతంలో చేయకూడని పనులు చేసి, మోసాలు చేసి, అక్రమంగా సంపాదిస్తే ఇప్పుడు దాని ఫలితంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అందుచేత మీరు కోరుకున్నట్టు జీవించాలి అంటే దానికి అనుగుణంగా ఇప్పుడు మీరు ప్రయత్నించాలి, కృషి చేయాలి. ఎందుచేతనంటే వర్తమానం మీ చేతిలో లేదు చేసినవి అనుభవించాలి తప్పదు, కానీ భవిష్యత్తు మీ చేతిలో వుంది.

చాలా మంది జాతకాలు చూపించుకుంటారు  నా భవిష్యత్తు ఎలా ఉంటుంది? నేను కష్టాల్లో నుంచి బయటపడతానా? లేదా? తెలుసుకోవాలి అనే కుతూహలం చూపిస్తారు. కానీ మీ జీవితం గురించి ఏ జాతకాలు చూపించక్కర్లేదు, భవిష్యత్తులో ఎలా ఉండాలనుకుంటారో దానికి అనుగుణంగా ఇప్పుడు మీరు కృషి చేస్తే మీరు అనుకున్నట్టు మీ భవిష్యత్తు తీర్చిదిద్దబడుతుంది.

పత్రి గారు **“ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు”** అన్నారు. అందుచేత మీ భవిష్యత్తుని మీరే సృష్టించుకోవచ్చు. మిమ్మల్ని ఎవ్వరూ అవమానించకూడదు అని అనుకుంటే మీరు ఇక నుంచి ఎవరినీ అవమానించకూడదు. మీది ఎవరూ దొంగలించకూడదు అంటే ఈ రోజు నుంచూనా మీరు ఎవరిదీ ఏ రకంగానూ అపహరించకండి. మోసంతో కానీ, మాయమాటలతో కానీ, అక్రమంగా కానీ, అన్యాయంగా కానీ ఏ రకంగానూ ఎవరిదీ అపహరించకండి.

ప్రకృతిలో మీకు ఇవ్వబడిన దానికంటే అదనంగా ఏదైనా కావాలనుకుంటే దాని కోసం కష్టపడి కృషి చేయాలి, ప్రయత్నించాలి. అలా కాకుండా అధర్మంగా పొందాలి అనుకుంటే దానికి మూల్యం చెల్లించుకోవాలి.

ఒకటే గుర్తుపెట్టుకోండి 5000 సంపాదించేవాడూ బ్రతుకుతున్నాడు, 50వేలు సంపాదించేవాడూ బ్రతుకుతున్నాడు, 5 లక్షలు సంపాదించేవాడూ బ్రతుకుతున్నాడు, 5 కోట్లు సంపాదించేవాడూ బ్రతుకుతున్నాడు. అన్ని రకాల

వాళ్ళు బ్రతుకున్నారు. ఇక్కడ బ్రతకడానికి ఐదు కోట్లే అక్కర్లేదు నెలకి 10,000 సంపాదించేవాడు కూడా బ్రతుకుతాడు. అందుచేత మీ పరిస్థితిని బట్టి అవసరాలకు పరిమితమై జీవించాలి.

పత్రిగారు ఎన్నో సార్లు మానవుడికి ఏం కావాలి? పూటకి ఒక రొట్టె ముక్క, ఆవకాయ తొక్క చాలదా? అంటారు. అలా పరిమితంగా జీవిస్తే ఏ ఇబ్బంది ఉండదు. కానీ రొట్టెతో పాటు కూర కావాలి, కూరతో పాటు స్వీటు కావాలి, స్వీటుతో పాటు హాటు కావాలి, స్వీటు, హాటే కాదు వెండి ప్లేట్లు కూడా కావాలి, ఫ్రూట్ కావాలి, ఐస్ క్రీమ్ కావాలి, నాకు ఆ వెరైటీ కావాలి, ఈ వెరైటీ కావాలి అంటారు. ఎన్ని ఉన్నా సరిపోవు.

ఇక్కడ ఒకటే గుర్తుపెట్టుకోండి ప్లేట్ మీల్స్ తిన్నవాడైనా, ఫైవ్ స్టార్ మీల్స్ తిన్నవాడైనా సాయంత్రం అయ్యేసరికి మళ్ళీ ఆకలి అంటాడు. అందుచేత ఇవన్నీ కోరికలే! మరి ఊరికే కోరితే లాభం లేదు ఈ రెండు గుర్తుపెట్టుకోండి.

1. మీరు అనుకున్న కోరికలు నెరవేరాలి అంటే ప్రకృతికి అను గుణంగా కృషి చేయాలి. కాదని కోరికలు నెరవేర్చుకోవాలని అధర్మంగా ప్రయత్నిస్తే మూల్యం చెల్లించుకోవాలి.

2. లేదా ఏవో సాధించాలని సంకల్పాలు పెట్టి ధ్యానం చేస్తే వారు ధ్యానం ద్వారా సంపాదించిన శక్తిని నష్టపోతారు.

అందుచేత తెలుసుకోండి ఊరికే సంకల్పం పెట్టి ధ్యానం చేసినంత మాత్రాన కోరుకున్నది జరగదు. ఒకవేళ సంకల్పం పెట్టి కోరినా మీరు ధ్యానం ద్వారా సంపాదించిన శక్తి వుంటే జరుగుతుంది. చూడండి మీరు మూడేళ్ల నుంచో ఆరేళ్ల నుంచో ధ్యానం బాగా చేయడం వల్ల మీకు చాలా శక్తి పెరుగుతుంది. అలా పెరిగిన మీకు సంకల్పం పెట్టి ధ్యానం చేస్తే అనుకున్నది అవుతుంది, కానీ అప్పటిదాకా మీరు సంపాదించిన శక్తి అంతా కోల్పోతారు.

కొంతమంది సరిగ్గా ధ్యానం చేయని వారు వుంటారు. వారి దగ్గర పెద్ద శక్తి ఉండదు. అలాంటి వారి కోరికకి తగ్గ శక్తి లేకపోవడం వల్ల ఆ సంకల్పం నెరవేరదు.

చూడండి ధ్యానం క్లాసులో మాస్టర్లు 100, 200 మంది చేత సంకల్పం పెట్టించి ధ్యానం చేయిస్తారు. మూడు గంటలో, నాలుగు గంటలో ధ్యానం చేయించిన తర్వాత... మీలో ఎవరికి అనుకున్నది జరిగింది? అని ప్రశ్న వేస్తారు. అప్పుడు ఒకరో, ఇద్దరో లేచి నేను అనుకున్నది జరిగిందండి అంటారు. అంటే మిగతా వాళ్ళకి ఆ రోగం తగ్గలేదు, ఆ నొప్పి పోలేదు, ఆ కష్టం పోలేదు అనే కదా? అర్థం. ఎందుకు పోలేదు? ఆలోచించండి?

ఈ నొప్పులు తగ్గినవారు ధ్యానం చేసేసరికి నాకు తెలియకుండానే లోపల ఏదో మార్పు వచ్చింది. ముందు అంతా నొప్పిగా ఉంది ఇప్పుడు నాకు తగ్గిపోయింది అంటారు. మిగతా వాళ్ళు ఆశ్చర్యపోతారు. అప్పుడు వారు మాస్టర్ని ఏమండీ మాకు తగ్గలేదేంటి? అని అడుగుతారు. అప్పుడు మాస్టర్ మీకు శక్తి సరిపోలేదు శక్తిని పెంచుకోండి అని అంటాడు.

అంటే దాని అర్థం శక్తి ఉన్నవాడికి తగ్గింది, కోరిక నెరవేరింది, శక్తి లేని వాడికి తగ్గలేదు, కోరిక నెరవేరలేదు. మరి శక్తి ఉన్నవాడికి ఎందుకు నెరవేరింది? వారికి వున్న శక్తి అంతా ఖర్చయింది కాబట్టి.

వాడు ఆ కోరిక గురించి అపారమైన, విలువ కట్టలేని ఎన్నో ఏళ్ల నుంచి సంపాదించుకున్నటువంటి అద్భుతమైనటువంటి ధ్యాన శక్తిని పణంగా పెట్టాడు, అందుచేతనే వాడికి తగ్గింది.

వాడు ఎంతసేపూ కోరిక తీరడం కోసం చూసుకున్నాడు కానీ శక్తి పోతుందనే అవగాహన లేదు. ఆ మాస్టర్ కి కూడా వాడు నష్టపోతాడు అని తెలియదు. వాడికి తగ్గడం మీదే ఆ మాస్టర్ దృష్టి, నాకు తగ్గితే చాలు అన్నదే

వీడి దృష్టి. ఇద్దరికీ శక్తి యొక్క విలువ తెలీదు, ఆ శక్తి వల్ల వచ్చే లాభాలూ తెలియవు. అటువంటి శక్తి అద్భుతమైనది, విలువకట్టలేనిది, ఆ శక్తి నేను సంపాదించుకున్నాను అన్న విషయం వారికి తెలీదు. కానీ శక్తి విలువ తెలిసినవారు ఇలా శక్తిని కోల్పోరు, నష్టపోరు, సంకల్పాలు పెట్టరు.

ఎందుచేతనంటే శక్తి పెరిగే కొద్దీ వాడి బుద్ధి వికసిస్తుంది, మనసు శుద్ధి అవుతుంది, వివేకం కలుగుతుంది, మంచి చెడ్డలు తెలుసుకుంటాడు, బాగా ఆలోచిస్తాడు, సరైన నిర్ణయాలు తీసుకుంటాడు, ఏ విషయంలోనూ చేయకూడనివి చేయడు, చేయవలసిందే చేస్తాడు. జీవితంలో నష్టం అన్నది వాడికి జరగదు. అందుకే పత్రి గారు కూడా బుద్ధి బాగా వికసింపచేసుకోండి అంటారు. బుద్ధికి మించింది లేదు, బుద్ధి బాగా వికసింప చేసుకుంటే మీ బుద్ధే మిమ్మల్ని గురువై నడిపిస్తుంది,

అపారంగా శక్తి పెంచుకోవడం వల్లే బుద్ధి వస్తుంది, ఈ శక్తి ఎప్పటినుంచో ధ్యానం చేయడం వల్ల వస్తుంది. అంత విలువైన శక్తిని ఒక చిన్న అల్పమైన కోరిక గురించి కోల్పోయావంటే ఎంత నష్టపోతావో తెలుసుకో!

జీవితంలో ఎవ్వరికైనా ఒక్క కష్టమే రాదు ఎన్నో కర్మలు చేసి వచ్చారు కాబట్టి అలా కష్టాలు వస్తాయి. అందులో ఒక కష్టం గురించి నీ శక్తి అంతా ఖర్చు పెట్టేస్తే రెండు నెలలకో, ఆరు నెలలకో ఇంకో కష్టం వస్తుంది. అప్పుడు నీ పరిస్థితి ఏమిటి? అంతకు ముందు శక్తి ఉంది. ఇప్పుడు నీ దగ్గర శక్తి లేదు, సంకల్పం పెట్టి ధ్యానం చేసినా ఏమీ ప్రయోజనం లేదు, ఆ బాధ నుంచి బయట పడలేవు.

కానీ శక్తి ఉన్నవాడు ఏ కష్టాన్నైనా తట్టుకుంటాడు. ఎటువంటి పరిస్థితినైనా తన తెలివి తేటలతో అధిగమిస్తాడు. అదే శక్తి లేకపోతే విలవిల్లాడిపోతాడు.

కొంతమంది వాళ్ళ ఇంట్లో వాళ్ళ కష్టాల గురించే కాకుండా ప్రక్కవాళ్ళ కష్టం పోవాలని కూడా సంకల్పాలు పెడతారు. ఎంత విచిత్రం! మీరు సంపాదించుకున్న శక్తి యొక్క విలువ మీకు తెలియట్లేదు, తెలిస్తే ఇలా ప్రవర్తించరు. చూడండి దేవుళ్ళని అపార శక్తివంతులు అంటాం. మరి వాళ్ళకి ఆ శక్తి ఎలా వచ్చింది? మానవులుగా పుట్టి, తీవ్రంగా ధ్యానం చేసి, అపారంగా శక్తి సంపాదించి దేవుళ్ళు అయ్యారు.

పత్రి గారు చెప్తారు కృష్ణుడు నాలుగవ సంవత్సరంలో నుంచే ధ్యానం చేశాడు, శ్రీరాముడు 10వ ఏట నుంచే ధ్యానం చేశాడు, ఆంజనేయ స్వామి రెండవ ఏట నుంచే ధ్యానం చేశాడు అని. ఇలా చేసి ఆ శక్తితో వాళ్ళు దేవుళ్ళు అయ్యారు, అంతేకానీ ఊరికే అవ్వలేదు.

మరి రమణ మహర్షి కూడా అలాగే భగవానుడు అయ్యాడు. ఆయన దేహం చూస్తే అందరిలాగే ఉంటుంది, కానీ ఆయన శక్తి అపారం. ఎవరు ఏ సమస్యతో ఆయన దగ్గరికి వెళ్తే చక్కగా పరిష్కారం చెప్తారు, ఆయనకేమీ పెద్ద పెద్ద కండలు లేవు. మరి అందరూ ఆయన దగ్గరికి ఎందుకు వెళ్ళేవారు? ఆయన చెప్పేటటువంటి జ్ఞానం కోసం. అందుచేత ఎంత శక్తి పెరిగితే అంత జ్ఞానం వస్తుందని తెలుసుకోండి.

చాలామందికి కోరికల కోసం సంకల్పం పెడితే శక్తి ఎలా కోల్పోతాం అనేటటువంటి సందేహం రావచ్చు, అందుచేత అవగాహన కోసం "విశ్వామిత్రుడి కథ" తెలుసుకుందాం.

విశ్వామిత్రుడు అపారమైన శక్తి సంపాదించాలనే తపనతో తీవ్రంగా వెయ్యి సంవత్సరాలు ధ్యాన సాధన చేశాడు. ఏదైనా సృష్టించు కోగలిగేటంత శక్తి ఆయన సంపాదించాడు.

ఎప్పుడైతే అంత శక్తి సంపాదించాడో ఇంద్రుడికి భయమేసింది.

ఈయన ఇంత శక్తి సంపన్నుడు అయిపోయాడు, ఈ శక్తితో ఈయన లోకానికి మేలు చేస్తాడా? హాని చేస్తాడా? అన్న సందేహంతో విశ్వామిత్రుడికి పరీక్ష పెట్టాడు.

మేనకని పంపించాడు, మేనకని చూడగానే విశ్వామిత్రుడికి ఆవిడ మీద కోరిక కలిగింది. నన్ను వివాహం చేసుకోమని మేనకని అడిగాడు. అప్పుడు మేనక సరే చేసుకుంటాను కానీ ఒక షరతు అంది. ఏమిటది అన్నాడు? నేను ఏది కోరినా నా కోరిక తీర్చాలి. నా కోరిక నువ్వు కాదంటే మాత్రం నిన్ను వదిలేసి నా లోకానికి వెళ్ళిపోతాను అంది.

అప్పుడు విశ్వామిత్రుడు ఓ.. తప్పకుండా తీరుస్తాను. నేను అపార శక్తివంతుడిని, నీ కోరికలు తీర్చడం నాకు పెద్ద సమస్య కాదు. నీ షరతు కి నేను ఒప్పుకుంటాను అని ఆమెను వివాహం చేసుకున్నాడు. కాపురం చేస్తున్నారు. కాపురం చేస్తూ మేనక రోజూ కొత్త కొత్త కోరికలు, విచిత్రమైన కోరికలు కోరేది. ఎలాంటి కోరికలంటే మామిడి పండ్లు దొరకని కాలంలో మామిడి పండు తినాలని కోరేది, ఆయన వెళ్లి చూసేవాడు కానీ ఎక్కడా దొరకేవి కావు. లేవు అంటే ఆవిడ ఎక్కడ వెళ్ళిపోతుందో అని వెళ్లకుండా ఉండడం కోసం తన శక్తిని కొంత ఖర్చుపెట్టి అక్కడ ఒక మామిడిపళ్ళ తోటను సృష్టించాడు. ఆవిడ కోరిక తీర్చాడు.

ఆయన శక్తి ఉంది కాబట్టి ఆ పని చేసాడు. చేసినందుకు ఆయన శక్తి కొంత ఖర్చు అయ్యింది. ఇంకా కొన్నాళ్ళు పోయేసరికి ఆవిడ నాకు మీతో కలిపి ఆకాశంలో విహరించాలని ఉంది అని అంది. అది ఎంతసేపు అని ఆవిడ నడుము మీద చెయ్యి వేసి చెయ్యి పైకెత్తి అలా మొత్తం తిరిగి వచ్చారు. మనలో ఎవరైనా అలా ఎగరగలరా? లేదు. ఎందుకంటే మన దగ్గర అంత శక్తి లేదు. ఆయన దగ్గర శక్తి ఉంది కాబట్టి, ఆ శక్తి ఖర్చుపెట్టి

అలా తిరిగి వచ్చాడు.

ఇక్కడ మీరు ఒకటి గుర్తుపెట్టుకోవాలి, మీరు అలాంటి కోరికలు కోరుకుంటే మీ శక్తి అంతా ఖర్చయిపోతుంది. అందుకే గొప్ప వాళ్ళు గొప్పల కోసం, కోరికల కోసం శక్తిని ఖర్చు చేయరు. ఈ విషయం ఎప్పుడో పురాణ కథల ద్వారానే కాదు ఈ మధ్య కాలంలో రామకృష్ణ పరమహంసని గమనిస్తే కూడా తెలుస్తుంది. రామకృష్ణ పరమహంస ఎంతో ధ్యానం చేశాడు. ఆయన ఒకసారి పడవలో గంగా నది దాటుతూ ఉంటే, ఆయన్ని ఎవరో అడిగారు. ఏమండీ మీరంత తపః సంపన్నులు, మీరు తలుచుకుంటే నది మీద నడిచి వెళ్ళిపోవచ్చు కదా? ఎందుకండి ఇలా పడవలో వెళ్తున్నారు? అన్నారు.

అప్పుడు ఆయన వాడితో చెప్పాడు. నాయనా పావలా ఇస్తే నది దాటిస్తారు, దానికోసం నా విలువైన శక్తిని నేను ఎందుకు ఖర్చు పెట్టుకోవాలి అన్నాడు. అంటే దాన్ని బట్టి రామకృష్ణ పరమహంస కూడా తన శక్తిని నిలబెట్టుకోవడం కోసం, ఉన్న శక్తి ఖర్చు పెట్టుకోకుండా ఉండడానికే ప్రాముఖ్యం ఇచ్చాడు అన్నది మనం అర్థం చేసుకోవచ్చు.

చాలామంది గొప్ప కోసం నది మీద నడిచి వెళ్తూ ఉంటారు. కానీ రామకృష్ణ పరమహంస గొప్ప ప్రదర్శించడం కోసం తన శక్తిని ఖర్చుపెట్టలేదు. దీన్ని బట్టి ఎవ్వరైనా సరే ఏదైనా అతీతమైనటువంటి కోరిక తీర్చుకోవాలంటే తన శక్తిని కొంత ఖర్చు పెట్టాలి అన్నది తెలుసుకోవాలి.

అలాగే విశ్వామిత్రుడు ఆవిడ కోరికలు తీర్చడానికి ఇలా తన శక్తి ఖర్చుపెడతాడు. ఇంకొక సందర్భంలో మల్లెపూవులు దొరకని కాలంలో నాకు మల్లెపూవులు కావాలని కోరింది. ఎక్కడా మల్లెపూవులు లేవు. కాదంటే ఆవిడ వెళ్ళిపోతుందని మల్లెపూల తోట సృష్టించాడు. మళ్ళీ కొంత శక్తి ఖర్చు అయిపోయింది.

తర్వాత నాకు స్నానం చేయడానికి మానససరోవరం లాంటి సరోవరం కావాలంది, అదీ సృష్టించాడు. ఇలా ఆవిడ కోరిన కోరికలన్నీ తీర్చడానికి తన శక్తినంతా ఖర్చు పెట్టాడు. ఇలా జరుగుతూ ఉంటే మళ్లీ ఆవిడ నాకు ఆకాశ విహారం చేయాలని ఉంది అంది. అదెంత పని అని ఆవిడ నడుము మీద చెయ్యి వేసి చెయ్యి పైకెత్తాడు. ఇంతకుముందు లేచి వెళ్ళగలిగాడు కానీ ఇప్పుడు లేవట్లేదు. ఏంటిది నేను లేవలేకపోతున్నాను అనుకున్నాడు. తన శక్తి అంతా ఖర్చు అయిపోయింది అన్నది ఆయనకి అర్థమైంది.

మేనకతో నా శక్తి అంతా ఖర్చైపోయింది నేను లేవలేకపోతున్నాను అన్నాడు. మరి ఆవిడ ఆయనతో మొదట్లోనే చెప్పింది ఎప్పుడైతే ఆయన తన కోరిక కాదంటాడో అప్పుడు వదిలి వెళ్ళిపోతాను అని. అన్నట్టుగానే వెళ్ళి పోయింది. ఏడుస్తూ కూర్చున్నాడు. మేనక వెళ్ళిపోయినందుకు కాదు. తాను సంవత్సరాలు కష్టపడి సంపాదించు కున్న శక్తి అంతా కోల్పోయాను అని విచారించాడు. అలా మేనక కోరికలు తీర్చడానికి తన శక్తిని కోల్పోయాడు. అలాగే మీరు కూడా కోరికలు తీర్చుకోవడానికి సంకల్పాలు పెడితే శక్తిని కోల్పోతారు, నష్టపోతారు అన్నది తెలుసుకోవాలి.

విశ్వామిత్రుడు మళ్లీ 1000 సంవత్సరాలు తపస్సు చేసి శక్తి సంపాదించాడు. ఈసారి ఇంద్రుడు రంభను పంపించాడు రంభ వచ్చింది. విశ్వామిత్రుడికి అర్థమైంది ఇంద్రుడే ఈ పని చేస్తున్నాడు అని, ఆయనకి బుద్ధి చెప్పాలి అని రంభను శిలలా అయిపోమని శపించాడు. అప్పుడు శిల అయిపోయింది. కానీ ఈయన సంపాదించిన శక్తి అంతా మళ్ళీ కోల్పోయాడు. అక్కడ కామంతో, ఇక్కడ క్రోధంతో తన శక్తిని ఖర్చు పెట్టేసాడు.

అయ్యో మళ్ళీ నష్టపోయానే అని మళ్ళీ 1000 సంవత్సరాలు తపస్సు

చేశాడు. మళ్లీ శక్తి సంపాదించాడు. ఈసారి విశ్వామిత్రుడు భోజనం చేద్దామని కూర్చున్నప్పుడు ఇంద్రుడు మారువేషంలో వచ్చాడు. ఇంద్రుడు బిక్షం అడిగాడు, అప్పుడు విశ్వామిత్రుడికి అర్థమైంది. ఆ వచ్చినవాడు ఇంద్రుడే, మళ్లీ నాకు ఇంకొక పరీక్ష పెడుతున్నాడు అని భోజనం ఆపేసి వచ్చి ఇంద్రుడిని కూర్చోపెట్టి తాను తినే భోజనం ఇచ్చేసాడు.

అప్పుడు ఇంద్రుడు నాయనా నువ్వు కామాన్ని, క్రోధాన్ని, ఇప్పుడు లోభాన్ని కూడా జయించావు. నువ్వు ఇప్పుడు బ్రహ్మర్షి పదవికి అర్హుడవు అని తన నిజ రూపం చూపించాడు. ఇలా విశ్వామిత్రుడు కోరికల గురించి ఎంతో శక్తిని కోల్పోయాడని తెలుసుకున్నాడు.

గొప్ప గొప్ప వాళ్ళని ఆశ్రయిస్తే మన కష్టాలు తొలగిస్తారని మనం అనుకుంటాం. కానీ వాళ్ళైనా సరే సృష్టి నియమాలకి బద్ధులే. ఎంతటి గొప్పవాళ్ళైనా సృష్టి నియమాలు అనుసరించవలసిందే అది వాళ్ళకీ తెలుసు. అందుకే పెద్దలు, గురువులు ఎవ్వరైనా కూడా మార్గం చూపిస్తారు కానీ మీ కష్టాలు తొలగించే ప్రయత్నం చేయరు. వాళ్ళ రోగం నయం చేస్తే, ఆ రోగం కోసం వీళ్ళు కష్టపడి సంపాదించిందిన శక్తి పోగొట్టుకుంటారు.

ఎవడో మూర్ఖుడు పాపాలు చేసి కష్టం తొలగించమని వీళ్ళ కాళ్ళ మీద పడితే, అవి తొలగిస్తే వీళ్ళు సామాన్యులు అయిపోతారు. అందుకని వాళ్ళు ఏమి చేయరు. షిరిడీ బాబా భక్తుల కష్టాన్ని తొలగించాడు, ఆయన మహానుభావుడు, దేవుడు అని ఆయన పాదాల మీద పడతారు. ఆయన ఎవరికి అలా చేస్తారంటే? ఎవరైతే లోక కళ్యాణం కోసం పాటుపడతారో అలాంటి వారికే చేస్తారు, అది కూడా ఆఖర్లో తక్కువ శక్తి ఖర్చుపెట్టి చేస్తారు. వీళ్ళ శక్తి ఖర్చు పెట్టిన దానికంటే వాళ్ళు లోకానికి చేసే ఉపకారం చాలా అధికంగా ఉంటుంది, అందుచేత సంకోచించరు.

మరి మా మేడం విషయంలో చూసుకుంటే అవిడకి ఫైర్ యాక్సిడెంట్ అయింది. డాక్టర్లు బ్రతకదని చెప్పేసారు. 60-70% కాలిన వాళ్ళు బ్రతకడం చాలా కష్టం అన్నారు. అలాంటిది ఆవిడ బ్రతికి వచ్చింది. పత్రి గారు ఎంతో కొంత ఆయన శక్తిని ఖర్చు పెట్టి మేడమ్‌ను బ్రతికించారు. ఎందుకంటే భవిష్యత్తులో మేడం లోకానికి ఎంతో మేలు చేస్తారని ఆయనకి తెలుసు. ఈవిడ్ని మనం భూమిమీద ఉంచాలి అనేటటువంటి ఉద్దేశంతో ఉంచడం జరిగింది.

మరి ఇప్పుడు చూడండి ఆవిడ బయటికి వచ్చి అందరికీ ఎంత జ్ఞానాన్ని పంచిపెడుతుంది! ఆవిడ వల్ల ఎంతమంది జ్ఞానవంతులు అయ్యారు! ఇంకా అలా చేస్తూనే వుంది. నిజంగా ఆ రకంగా ఫైర్ యాక్సిడెంట్ అయినోళ్ళు దేనికీ పనికిరారు, మంచం మీద ఉండాలి. మరి ఆవిడ అలా కాదు, ఎన్నో ఊళ్ళు, రాష్ట్రాలు, దేశాలు తిరుగుతుంది. అంతలా ఆవిడ కృషి చేస్తుంది, ఇప్పటికీ రోజు జూమ్ క్లాసులు చెప్తుంది. అపారమైన జ్ఞాన సంపద అందరికి అందిస్తుంది.

అందుచేత కోరికలను అదుపులో ఉంచుకోండి, అవసరాలకు పరిమితం అవ్వండి. సృష్టికి అనుగుణంగా జీవించండి. మీ బుద్ధిని వికసింప చేసుకోండి, అపారమైన శక్తి పెంచుకోండి, గొప్పవాళ్ళు కండి. సాధన ద్వారా పొందిన శక్తిని కోరికల కోసం సంకల్పాలు పెట్టి పోగొట్టుకోకండి.

# భగవద్గీతను బట్టి కోరికల వల్ల కలిగే నష్టం

భగవద్గీతలో

**శ్లో॥ యం యం వా పి స్మర న్భావం త్యజ త్యన్తే కలేబరమ్ ।**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥ (భ.గీ.8-6)**

తా:- అర్జునా! దేహాన్ని విడిచిపెట్టేటప్పుడు మానవుడు ఏ స్థితిని స్మరిస్తాడో ఆ స్థితినే పొందుతాడు. అంటే మరణ సమయంలో ఏ భావంతో అంటే ఏ కోరికతో ఉంటే అదే పొందుతాడు అని తెలుసుకోవాలి.

అంటే చూడండి లోకంలో డబ్బు మీద, సంసారం మీద, సంపదల మీద, బంధువుల మీద, భోగాల మీద, పదవుల మీద, అలా ఒక్కొక్కరికి ఒకో దాని మీద ఆసక్తి వుంటుంది.

కొంతమందికి మా వాళ్ళంతా బాగుండాలనే కోరిక. కొంతమందికి అధికారంలో ఉండాలని, ఇలా రకరకాల కోరికలు ఉంటాయి. ఆ కోరికలతో జీవిస్తూ ఉంటారు. అటువంటి కోరికలతో జీవిస్తే మరణించేటప్పుడు కూడా ఆ కోరికల్ని తలుచుకుంటూ మరణిస్తారు.

మరి అలా మరణించినప్పుడు అంటే ఏ కోరికలతో మరణిస్తారో వాళ్ళు మరల అటువంటి జన్మ తీసుకోవాల్సి వస్తుంది. అంటే చేసిన కర్మలను బట్టి జన్మ ఉంటుందని గుర్తుపెట్టుకోవాలి. కాబట్టి దాన్ని బట్టి జన్మ వస్తుంది.

కానీ ఎవరైతే ఏ కోరిక లేకుండా ఆత్మ మీద అంటే భగవంతుని మీద దృష్టి పెడతారో అంటే ఎప్పుడూ ధ్యానంలో ఉంటారో, ఆ భావంతో ఉండడం వల్ల, మరణించిన తర్వాత ఉన్నతమైన లోకాలు పొందగలుగుతారు.

అందుచేత ఎవరైతే ఆత్మ ఉన్నతి కోరుకుంటారో! ఉన్నతలోకాలు పొందాలనుకుంటారో! వాళ్ళు కోరికలు లేకుండా ఆత్మ భావంతో ఉండాలి.

అప్పుడు తప్పకుండా వాళ్ళు గొప్ప లోకాలకి చేరుకోగలుగుతారు.

అంటే ఇక్కడ శ్రీ కృష్ణ భగవానుడు ఏ కోరికతో ఉంటే అదే పొందుతారు అని చెప్పారు.

అలాగే భగవద్గీతలో ఇంకొక శ్లోకం చూద్దాం:

**శ్లో॥ యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః ।**

**జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం త మాహుః పణ్డితం బుధాః ॥ (భ.గీ.4-19)**

తా:- ఎవరి యొక్క సమస్త కర్మలు కోరిక, సంకల్పం అన్నవి లేకుండా ఉంటాయో! అలాగే జ్ఞానమనే అగ్ని చేత కర్మలన్నీ దగ్ధమై ఉంటాయో! అట్టి వానిని పండితుడు అని చెప్పి విజ్ఞులు పేర్కొంటారు అని చెప్పడం జరిగింది.

అంటే ఎవరైనా సరే చేసే పని కోరిక, సంకల్పం అన్నది లేకుండా ఉండాలి. అంటే ఏ పని చేసినా నిష్కామంగా చేయాలని, అంటే ఆశించి చేయకూడదని,కారణం చేయవలసింది చేస్తే పొందవలసింది పొందుతారన్నది తెలుసుకోవాలి. అంతే కాదు కర్మ చేయడానికే నీకు అధికారం ఉంది కానీ కోరడానికి లేదు అని కూడా గీతలో చెప్పడం జరిగింది.

ఇంకా మీరు లోతుగా వెళ్తే కతృత్వ భావం లేకుండా చేయమన్నారు అంటే నేను చేస్తున్నాను, అన్న భావం లేకుండా చేయమన్నారు. నేను అనేది ఉంటే దాని ఫలితం ఉంటుంది. నేను అన్నదే లేకపోతే ఏమీ లేదు.

అలాగే ఇంకా లోతుకి వెళ్తే అన్నిటికంటే కర్మఫల త్యాగం గొప్పది అన్నారు. అంటే కోరికతో కర్మలు చేయడం కాదు. కోరే కోరిక యొక్క ఫలితాన్ని అంటే ఆ పని యొక్క ఫలితాన్ని వదిలిపెట్టాలి అన్నారు.

చాలామంది ఏమంటారంటే కృష్ణార్పణం, రామార్పణం అంటారు. ఇలాగే ఏదో అర్పించేశాను నాకు ఇంకేమీ లేదు అంటారు. కానీ వాళ్ళ ఉద్దేశం అలా అర్పిస్తే మంచి ఫలితం వస్తుందనే కోరికతోటే అలా అంటారు. కానీ వీరి భావం తెలుసుకోగల శక్తి ఆ ప్రకృతికి, ఆ సృష్టిని నడిపించే ఆయనకి

తెలుసు.

చూడండి గుడికి వెళ్ళినప్పుడు పూజ చేయిస్తారు. కానీ పూజ మొదలెట్టకుండానే సంకల్పం చెప్పిస్తారు. అంటే కోరికలు కోరతారు.

కానీ భగవానుడు అటువంటి కోరికలు లేకుండా చేయమన్నారు. కోరిక, సంకల్పాలు ఉన్నా వాటిని వదిలేయాలన్నారు. అలా ఎవరైతే వదిలేస్తారో, దానితో పాటు జ్ఞానం అనే అగ్నిలో కర్మలన్నీ దగ్ధం చేసుకుని ఉంటారో, వాళ్ళు పండితులు అంటే జ్ఞానంలో పండినవారు అన్నారు.

అంటే అజ్ఞానులు కోరతారు, జ్ఞానులకు కోరికలు ఉండవు. కారణం వారికి చేయవలసింది చేస్తే పొందవలసింది పొందుతారని తెలుసు.

ఇంకా పత్రి గారు పాపాలు వద్దు, పుణ్యాలు వద్దు, ముక్తి కర్మలు చేయమన్నారు, అంటే ఆత్మ కర్మలు చెయ్యమన్నారు. ఎప్పుడైతే ముక్తి కర్మలు చేస్తారో ముక్తి లభిస్తుంది. ముక్తి కర్మలు అంటే ఆత్మకు లాభించే కర్మలే. అదే ధ్యానం. అందుకే ధ్యానం వల్లనే ముక్తి అని చెప్తారు. "ధ్యానం వల్లనే జ్ఞానం, జ్ఞానం వల్లనే ముక్తి వస్తుంది" అన్నారు పత్రీజీ.

# మరణించినపుడు కలిగే నష్టాలు

చనిపోయిన తర్వాత ఈ కోరికల వల్ల కలిగే నష్టాలు తెలుసుకుందాం. చాలామంది జీవించి ఉన్నప్పుడు కలిగే నష్టాల గురించి ఆలోచిస్తారు, కానీ కోరికల వల్ల చనిపోయిన తర్వాత కూడా నష్టపోతారు.

ఎందుకంటే మానవులకి రెండు రకాల జీవితాలు ఉన్నాయి. ఒకటి దేహంతో ఉంటుంది. రెండవది దేహం లేకుండా ఉంటుంది. దేహంతో ఉండే జీవితం భూమిమీద ఉంటుంది. దేహం లేకుండా ఉండే జీవితం పరంలో సూక్ష్మ లోకాల్లో ఉంటుంది. మీరే ! అక్కడా ఉంటారు, ఇక్కడా ఉంటారు. ఇక్కడ దేహంతో ఉంటారు, అక్కడ దేహం లేకుండా ఉంటారు. చాలామందికి ఇది కొంచెం గందరగోళమే.

దేహంతో ఉండడం ఏంటి దేహమే నేను కదా? అని అనుకునే వాళ్ళు ఉన్నారు. కానీ "నేను దేహం కాదు, నేను ఆత్మను అని తెలుసుకోవాలి". ఇక్కడ మేను, నేను రెండు ఉన్నాయి. నేను అన్నది ఆత్మ, మేను అన్నది శరీరం. ఈ నేను అన్నది అంటే ఆత్మ మేనులో ప్రవేశించింది. ఒక తల్లి గర్భంలో తయారవుతున్నటువంటి శరీరంలో ప్రవేశించి జన్మ తీసుకుని తాను పొందవలసిన అనుభవాలు, నేర్చుకోవలసిన పాఠాలు నేర్చుకుంటూ ఉంటుంది.

తర్వాత తాను నిర్ణయించుకున్న సమయం అయిపోతే ఈ శరీరాన్ని వదిలేసి, మళ్లీ పైకి వెళ్ళిపోతుంది. మరి శరీరం తీసుకున్నాక జీవించే జీవితంలో కోరికలతోటే జీవిస్తూ ఉంటారు. ఎన్ని రకాల కోరికలు ఒకటా? రెండా? అలా పుడుతూనే వుంటాయి.

అలా మానవుడు కోరికలతో జీవితంలో ఎన్నో సమకూర్చుకుంటాడు, ఎన్నో సంపాదిస్తాడు, ఎన్నో పోగేస్తాడు, ఎన్నో దాచుకుంటాడు. ఇవన్నీ చనిపోయాక ఒక్కటి కూడా... కూడా రావు, అన్నీ భూమి మీదే వదిలేయాలి,

అలా అన్నీ  కోల్పోయేసరికి అరే ఎంత నష్టపోయాను చాలా నష్టపోయానే అన్నది చనిపోయాక తెలుసుకుంటాడు. మనం ఇప్పటిదాకా జీవించి ఉండగా కోరికల వల్ల  కలిగే నష్టాల గురించి చెప్పుకున్నాం.

ఇప్పుడు చనిపోయిన తర్వాత కోరికల వల్ల కలిగే నష్టం గురించి చెప్పుకుంటున్నాం. మీరు జీవితంలో పొందే లాభాలన్నీ చనిపోయాక లాభాలు కాదు నష్టం అన్న సంగతి తెలుస్తుంది. మీరు ఎంతో కష్టపడి ఎన్నో విజయాలు సాధించి, ఎన్నెన్నో గొప్పవి సాధించి ఎంతో సంపాదించి లాభం పొందానను కుంటారు. కానీ మరణించిన తర్వాత అది లాభం కాదు నష్టం అని తెలుసుకుంటారు.

అలా జీవితమంతా ఉపయోగపడని వాటి కోసం కష్టపడ్డా నాకు ఒక్కటీ ఉపయోగపడలేదే అని, అదంతా  లాభం కాదు నష్టమని తెలుసు కుంటారు. ఆ టైంలో నాకు అంటే ఆత్మకు లాభం కలిగించే పనులు చేసుకుని వుంటే అవి నాకు ఎంతో ఉపయోగపడేవి అని తెలుసుకొంటారు.

నేను పత్రి గారి పరిచయ భాగ్యం వల్ల ఈ విషయం జీవించి ఉన్నప్పుడే తెలుసుకోగలిగాను, అందుకే జీవితాన్ని మార్చుకున్నాను. అందుచేత అందరూ ఇప్పుడైనా అంటే జీవించి వుండగానే తెలుసుకోండి, మీకు అంటే ఆత్మకు నష్టం కలిగించే పనులు చేయకండి. సంపాదించండి ఎవరు వద్దనరు. కానీ ధర్మయుక్తంగా సంపా దించండి, మీరు అధర్మంగా, పాపాలు చేస్తూ సంపాదిస్తే సంపాదించిన ధనం మీకూడా రాదు, కానీ మీ పాపాలు మటుకు భద్రంగా మీ కూడా వస్తాయి. అందుచేత మీరు ఆత్మ అన్న సంగతి గుర్తుపెట్టుకొని ఆత్మకు లాభించే పనులు చేయండి.

నేను ఈ శరీరం కోసం ఈ శరీరాన్ని సుఖపెట్టడం కోసం ఎన్ని తప్పులు చేశాను, ఎన్ని పాపాలు చేశాను, ఎన్ని చేయకూడని పనులు చేశాను, ఎంత అధర్మంగా వ్యవహరించాను, అవన్నీ నాకు నష్టం కలిగించేవేగా నేను

కష్టపడి సంపాదించుక్నువి ఏవీ ఇప్పుడు నా కూడా రావు, నాకు ఉపయోగపడవు అని తెలుస్తుంది. నాకు లాభం కలిగిస్తాయి అనుకున్నాను కానీ వాటి గురించి ఆలోచిస్తే ఇప్పుడు నేను ఎంత నష్టపోయాను అన్నది చనిపోయాక అర్థం వుతుంది.

అందుచేత శరీరం గొప్పగా ఉండాలి, శరీరానికి పేరు రావాలి, శరీరం అందరికంటా గొప్పగా తయారవ్వాలి, అందరికంటే ఎక్కువ సంపాదించాలి అనే కోరికలతో పెద్ద మేడ కట్టుకోవాలి, అందరిలోనూ గొప్పగా అనిపించుకోవాలి లాంటి కోరికలతో చేయకూడని పనులు చేస్తే అవేవి కూడా రావు. అప్పుడు అర్థమవుతుంది? అరే ఎంత నష్టం జరిగింది నాకోసం అంటే ఆత్మ కోసం ఏమి చేసుకోలేదు, ఎంత జీవితం జీవించాను, ఎంత కష్టపడ్డాను నా కష్టం అంతా వృధా అయినట్టేనా? నేను పడిన పాట్లన్నీ వ్యర్థమేనా? అని ఆలోచిస్తే వ్యర్థమే అని అర్థమవుతుంది.

అలా ఏదో చేశాను అనుకుంటే అంతా నష్టమేనా? ఎంత నష్ట పోయాను అన్నది తెలుసుకుంటారు. ఇంకా ఆలోచిస్తే ఈ తప్పులు చేయకుండా ఉండవలసింది అని అర్థమవుతూ ఉంటుంది, ఒక జీవిత కాలమే నష్టపోయాను అని తెలుస్తుంది.

మహా జ్ఞానులైనటువంటి రమణ మహర్షిని మీరు కాస్త గమనిస్తే వారిని చాలామంది ఏమనుకుంటారంటే తెలివి తక్కువవాడు అనుకుంటారు. ఆయన ఏం సంపాదించుకోలేదు, కనీసం బట్టలు ఉండవు అనుకొంటారు. అదేం జీవితం మేము ఎన్ని లక్షలు, కోట్లు సంపాదించాం, ఎంత పెద్ద మేడకట్టుకున్నాం. మా ఇల్లు ఎంత గొప్ప డెకరేషన్ చేశాం, ప్యాలస్‌లా తయారు చేశాం. ఇల్లే కాదు కారు, ఇంకా ఎన్నో సౌకర్యాలతో ఉండేటువంటి ఎన్నో ఏర్పాట్లు చేసుకున్నాం అంటారు. కానీ చనిపోయాక వారి కూడా ఒక్కటీ రాదు.

అప్పుడు అనుకుంటారు ఎంత నష్టపోయాను, ఎన్నో కోరికలతో ఎన్నో చేసాను కానీ నాకు లాభించే పని ఒక్కటి చేయలేదే అని బాధపడతారు.

రమణ మహర్షి లాంటివారు ముందే తెలుసుకున్నారు ఆయన ఎంతసేపు ఈ శరీరాన్ని తనకోసం అంటే ఆత్మకోసం కోసం ఉపయోగించుకొని ఈ శరీరంతో సాధనలు చేయించారు. అపారమైన జ్ఞానాన్ని సంపాదించు కున్నారు. ఆయన చేసి చూపించిన దాన్నే పత్రి గారు కూడా చెప్తున్నారు. కోరికలకు బానిస అవ్వకు నువ్వు ఎవరో తెలుసుకో? అని చెప్తున్నారు.

దేహం నువ్వు కాదు, దేహం నీ కోసం ఉపయోగించుకో. ఈ దేహాన్ని నీకు అంటే ఆత్మకు లాభం కలిగించే ధ్యాన సాధనకు ఉపయోగించు, జ్ఞానాన్ని సంపాదించు. ఈ దేహంతో పుస్తకాలు చదువు, ఈ దేహంతో ఎవరైతే జ్ఞానానికి సంబంధించిన విషయాలు చెప్తూ ఉంటారో వారి సాంగత్యం చెయ్యి. పత్రిగారు ఈ విషయాలే పదే పదే చెప్తున్నారు.

జ్ఞానులతో సాంగత్యం చేస్తే మీరు జ్ఞానవంతులు అవుతారు. జ్ఞానవంతులు అంటే నేను ఆత్మ అన్న సంగతి తెలుసుకున్న వారు. అజ్ఞానులతో సాంగత్యం చేస్తే వారు దేహం అనే భావంలో ఉంటారు. అటువంటి వారు మనకేం చెప్పగలరు.

చూడండి **"దిక్సూచి ముల్లుని మీరు ఎటు తిప్పండి ఆ ముల్లు ఎటు తిప్పినా ఉత్తరం వైపుకే తిరుగుతుంది, ఉత్తర దిక్కునే చూపిస్తూ ఉంటుంది. అలాగే సజ్జన సాంగత్యం అంటే సత్యం చెప్పగలిగిన వారి సాంగత్యం చేస్తే ఎప్పుడూ ఆత్మ గురించి ఆలోచిస్తారు. ఆత్మ గురించే తెలుసుకుంటారు".**

అలా ఉన్నవారు నిజంగా లాభం పొందుతారు. మీ దృష్టి ఎప్పుడూ ఆత్మ మీదే ఉండాలి.

అలాంటి వారు అదృష్టవంతులు. వారు ఏం చేయాలో తెలుసు కుంటారు, ఏం చేయకూడదో తెలుసుకుంటారు. ఏది ఆత్మకు లాభమో

తెలుసుకుంటారు. ఆ పనులకే ప్రాముఖ్యం ఇస్తారు. దేహానికి ఏది లాభం కాదో వాటికి ప్రాముఖ్యం తగ్గిస్తారు. దేహం కోసం తప్పులు చేయరు, పాపాలు చేయరు, అధర్మంగా వ్యవహరించరు. సృష్టి విరుద్ధంగా ప్రవర్తించరు, ప్రాపంచిక కోరికలు వుండవు.

అందుచేత శరీరం వదిలినప్పుడు తీసుకు వెళ్ళడానికి వచ్చిన సహాయకులు రమ్మంటే "అమ్మో నా భార్య, నా పిల్లలు, నా బంధువులు వీళ్ళందరినీ వదిలి వచ్చేయడమేనా నేను రాను" అంటారు. అప్పుడు వాళ్ళు చెప్తారు. "ఇంకా నీకు అర్థం కాలేదా?" అసలు వాళ్ళకి నీకు సంబంధం ఏమిటి? నువ్వు ఏదో లోకంలో నుంచి వచ్చావు, వాళ్ళు వేరే లోకం నుంచి వచ్చారు. కొన్నాళ్ళు ఇక్కడ కలిసి ఉన్నారు అంతే! నువ్వు ఇప్పుడు నీ దారిని నువ్వు వెళ్ళిపోతావు, కొన్నాళ్ళకి వాళ్ళు కూడా వాళ్ళ దారిన వాళ్ళు వెళ్ళిపోతారు. నువ్వు చేసుకున్న కర్మలను బట్టి నువ్వు వెళ్ళే లోకాలు వేరే ఉంటాయి. వాళ్ళు చేసుకున్న కర్మలను బట్టి వాళ్ళు వెళ్లే లోకాలు వేరే ఉంటాయి. అందుచేత వాళ్ళకి నీకు సంబంధమే లేదు, వాళ్ళు ఎక్కడ ఉంటారో! నువ్వు ఎక్కడ ఉంటావో! ఎవరికి తెలుసు?" అని సహాయకులు చెప్తారు.

వారు మళ్లీ ఆలోచిస్తారు. వాళ్ళు చెప్పింది కరెక్టే కదా? ఇన్నాళ్లు నా వాళ్ళు అనుకున్నాను, వాళ్ళను పోషించడం కోసం చాలా తప్పులు చేశాను, చాలా పాపాలు చేశాను, చేయకూడని పనులు చేశాను, ఇన్ని తప్పులు చేసి సంపాదించింది వాళ్ళు అనుభవిస్తున్నారు, పాపాలు మాత్రం నా కూడా వస్తున్నాయి. అరె! ఎంత నష్టపోతున్నాను. నేను సంపాదించినవి నా కూడా రావు, పైగా నాకు నష్టం కలిగించే ఆ పాపాలే నా కూడా వస్తున్నాయి అని ఎంతో మదన పడతారు.

పరంలో ఒక లోకం కంటే ఇంకొక లోకం చాలా చాలా ఉన్నతమైనది. అందుచేత ప్రాపంచికమైన కోరికలకి బానిస కాకండి, అవసరాలకు పరిమితం

అవ్వండి. రాత్రి కల ఎలాగో ఈ పగలు జరిగేది కూడా కలే. అది రాత్రి కల, ఇది పగటి కల. ఈ పగటి కల కోసం ఇన్ని పాపాలు ఇన్ని తప్పులు చేస్తే... చనిపోయాక, కల అన్న సంగతి అర్థమవుతుంది. అరే కలలో జరిగేదానికి ఇంత ఆర్భాటాలు ఎందుకు? చేయకూడనివన్నీ చేసి ఎంత నష్టపోయాను అన్నది అర్థమవుతుంది.

అక్కర్లేని కోరికలు వదిలి, వున్న దానితో తృప్తి పడితే ఈ బాధలన్నీ ఉండవు కదా? అని అప్పుడు అనిపిస్తుంది. చనిపోయాక మిమ్మల్ని తీసుకెళ్లడానికి పైనుండి సహాయకులు వస్తారు. కొంచెం వివేకం ఉపయోగించి కొంతమంది ఏం చేస్తారంటే వారి కూడా వెళ్ళిపోతారు, కొంతమంది చాలా మూర్ఖంగా ఉంటారు. వాళ్ళు ఎంత చెప్పినా వినరు. సహాయకులు 11 రోజులు ఊరుకుంటారు 11వ రోజుతో ఆ కార్యక్రమాలు అయిపోయాక ఎవరి దారిన వారు వెళ్ళిపోతారు. అప్పుడు ఆ సహాయకులు ఎన్ని చెప్పినా, అందరి మీద, అన్నిటి మీద వుండే కోరికల వల్ల, వాటి మీద వుండే వ్యామోహం వల్ల నేను రానంటాడు. అప్పుడు వాళ్ళు నీకు ఆఖరిసారి చెప్తున్నాము వస్తావా? రావా? అంటే నా కుటుంబాన్ని వదిలిపెట్టి నేను రాను? వాళ్ళు ఏడుస్తున్నారు. నేను లేకపోతే ఎలా? అంటారు, అప్పుడు సహాయకులు చివరిసారిగా చెప్పి వెళ్ళి పోతారు.

ఎప్పుడైతే వాళ్ళు వెళ్ళిపోతారో వీడిని తీసుకు వెళ్ళడానికి తెరుచు కున్నటువంటి ఆత్మ ద్వారాలు అంటే ఏ ద్వారం గుండా అవుతే వీడు వెళ్ళవలసి ఉందో ఆ ద్వారాలు మూసుకుపోతాయి. వాళ్ళు వెళ్ళిపోతారు. ఇంక వీడికి వెళ్ళడానికి అవకాశం వుండదు, కొన్నాళ్ళు అక్కడే వుండిపోతాడు. ఎంతసేపూ ఇంటి చుట్టూ, తన ఆస్తులు చుట్టూ తిరుగుతాడు, ఏమీ అర్థం కాదు, ఎవరూ వీడి మాట వినరు ?

పై లోకాలకు వెళ్దామా అంటే వెళ్ళడానికి దారి లేదు, వీడికి సాయం

చేసేవాడు కూడా ఎవరు ఉండరు. అలా ఉండిపోయినవాడిని ఏమంటారంటే ప్రేతాత్మ అంటారు. దాన్నే అందరూ దెయ్యము అని అంటారు. కానీ గుర్తు పెట్టుకోండి నిజంగా పైలోకాలకి వెళ్లి తర్వాత జీవితాన్ని ప్లాన్ చేసుకోవాల్సిన వాళ్ళు కోరికల వల్ల ఇక్కడే ఉండిపోయి దెయ్యం క్రింద మారిపోతారు.

అంటే ప్రేతాత్మ అయిపోతారు. ఎంత నష్టపోయాడో చూడండి, ఎన్నో వందల సంవత్సరాలు అలా ఉండిపోవాల్సి వస్తుంది. దారి తెలియదు మళ్లీ ఎవరో వచ్చి ఎప్పుడో వాడికి దారి చూపిస్తే కానీ వెళ్ళడానికి ఆస్కారం ఉండదు. ఎంత నష్టపోతున్నాడో చూడండి, ఎంత సమయం వృధా చేసుకుంటు న్నాడో చూడండి, ఇదంతా కోరికల వల్ల జరిగే నష్టం.

ఆ కోరికల వల్లే వాడు వెళ్ళలేదు, కొంచెం వివేకం ఉపయోగిస్తే వెళ్ళిపోయేవాడు, కొంచెం జ్ఞానం ఉంటే వెళ్ళిపోయేవాడు. ఏమీ లేకపోవడం వల్ల అక్కడే ఉండిపోయి ప్రేతాత్మగా తయారైపోయాడు, వాడు వెళ్ళవలసిన లోకాలకి వెళ్ళకుండా నష్టపోయాడు. దేని వల్ల అంటే కోరికల వల్ల.

అందుచేత ప్రతి ఒక్కళ్ళు కోరికల వల్ల చనిపోయిన తర్వాత కూడా నష్టపోతారని తెలుసుకోవాలి. కాస్తో కూస్తో కాదు చాలా నష్టపోతారు అన్న సంగతి తెలుస్తుంది. అందుచేత కోరికలను అదుపు చేసుకోండి కోరికలను అదుపు చేసుకునే మార్గమే పత్రి సార్ అందించిన **“శ్వాస మీద ధ్యాస”** ధ్యానం.

## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ధ్యాన యజ్ఞంలో రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao


c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 9) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 10) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 11)పంచకోశాలు | - | రూ.60/- |
| 12) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 13) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 14) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్:9440309812,



# Tatavarthy Raghavarao Sir Books in English

| | | |
|---|---|---|
| 1. | Life Science (Part-I) | Rs.120 |
| 2. | Why is Guiding Not Meditation ? | Rs.100 |
| 3. | Which is the right Meditation ? | Rs.100 |
| 4. | Die before death! | Rs.120 |
| 5. | The Law of Karma | Rs.100 |
| 6. | What is Meditation? | Rs.80 |
| 7. | True Path | Rs.80 |
| 8. | Why soul-knowledge | Rs.70 |
| 9. | What comes after death ? | Rs.70 |
| 10. | How to improve Financial Status ? | Rs.60 |
| 11. | Wisdom is attained only through Meditation | Rs.60 |
| 12. | What is Intention? | Rs.50 |
| 13. | Why is this life? | Rs.50 |
| 14. | Vegetarian Food Is Human Food | Rs.50 |
| 15. | Meditation for the Development of Students | Rs.40 |
| 16. | Non violence and vegetarianism | Rs.40 |

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) మరణించకముందే మరణించాలి - రూ.130/-
10) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
12) గీతాసందేశం - రూ.120/-
13) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) కర్మ సిద్ధాంతం - రూ.80/-
21) ధ్యానమంటే ? - రూ.80/-
22) త్రివిధాలు - రూ.80/-
23) ఉత్తమ పురుషుడు - రూ.80/-
24) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
25) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
26) జ్ఞాన జ్యోతి - రూ.70/-
27) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
28) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
29) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
30) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
31) బుద్ధుని సందేశాలు - రూ.70/-
32) భూతదయే దైవత్వం - రూ.70/-
33) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
34) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
35) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
36) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
37) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
38) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
39) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
40) అతీంద్రియ శక్తులు - రూ.60/-
41) ఆలోచించండి - రూ.60/-
42) నిర్వాణ మార్గం - రూ.60/-
43) ధ్యానులకు సూచనలు - రూ.60/-
44) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
45) సంకల్పమంటే? - రూ.50/-
46) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
47) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
48) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
49) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
50) బ్రహ్మం అంటే? -రూ.40/-
51) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం -రూ.40/-
52) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
53) మహాత్ముల సందేశాలు - రూ.40/-
54) సత్యం - రూ.40/-
55) చక్రాలు - రూ.40/-
56) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
57) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
58) మౌన ధ్యానం - రూ.40/-
59) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
60) శాకాహారమే మానవాహారం - రూ.15/-
61) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు : తటవర్తి వీర రాఘవరావు, తటవర్తివారి వీధి,
భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



కోరికలు లేకుండా ఎవరూ ఉండరు. చాలా మందికి అనిపించవచ్చు కోరికల వల్ల నష్టాలు ఏమిటి? కోరికలు లేకుండా ఎలా ఉండగలరు? అసలు కోరికలు లేకపోతే జీవించడం ఎందుకు? అసలు జీవించేదే కోరికలు తీర్చుకోవడం కోసం కదా? అని అనేవాళ్ళు కూడా ఉన్నారు. అలా కోరికలతో జీవిస్తున్న మానవులకు ఈ కోరికలు ఎన్ని రకాల నష్టాన్ని, కష్టాల్ని కలిగిస్తాయో తెలుసుకుంటే ప్రతి ఒక్కరు కోరికలు తీర్చుకోవడానికి ప్రయత్నించరు, కోరికల్ని అదుపు చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. అలా ఎవరైతే కోరికల్ని అదుపు చేసుకోగలుగుతారో వారు జీవితంలో అవసరాలకు పరిమితమవుతారు.

కోరికలని అదుపు చేయాలి అంటే కోరికలకు మూలం "మనస్సు" కాబట్టి మనస్సును మీరు అదుపు చేస్తే కోరికలు మీ అదుపులో ఉంటాయి. అంటే మనస్సు చెప్పినట్టు మీరు వినడం కాదు, మీరు చెప్పినట్టు మనస్సు వినాలి.

అది ఎలా సాధ్యం అంటే? ఆ మార్గమే పత్రి గారు మనకు అందించినటువంటి "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

- బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు

రూ.100/-